# శ్రీకృష్ణ దర్శనం



విశ్వపతి



# శ్రీకృష్ణ దర్శనం

(గోకుల, బృందావన శ్రీకృష్ణ దివ్యదర్శనం)


**విశ్వపతి**

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**



श्री

SHRI DESIGNS

VEDIC LOGO DESIGNERS

www.lordofsevenhills.com

Phone : 98494 43752

HYDERABAD

# శ్రీకృష్ణ దర్శనం

(గోకుల, బృందావన శ్రీకృష్ణ దివ్యదర్శనం)

విశ్వపతి

(తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి)

© Copyrights reserved

ప్రథమ ముద్రణ : 2025

వెల : రూ. 100/-

ప్రతులకు :

**T.V.R.K.Murthy**
**(Viswapathi)**

E-mail: viswapathi@gmail.com

www.lordofsevenhills.com

Printed at :
**VIMAL PRINTERS**
1-1-776/3/1, SBI Colony,
Gandhi Nagar, Hyderabad.
Cell : 98491 60301

# ఒక విన్నపం

మనలో చాలా మందికి ఏదైనా కొత్త పుస్తకం చదువుతున్నప్పుడు ఆ రచయిత రాసిన ముందుమాట చదవకుండా పుస్తకంలోనికి వెళ్ళిపోవడం అలవాటు. అప్పుడు ఆ రచయిత మనస్సులో ఉన్న భావాలు, ఈ పుస్తకంలో చెప్పదలచుకున్న విషయాల పరమార్థం మనకు తెలియదు. ఈ పుస్తకం చదివేముందు మీరు తరువాత పేజీలో గల నివేదన తప్పక చదవండి. అప్పుడే మీకు ఈ పుస్తకం యొక్క పరమార్థం బాగా అర్థమవుతుంది. మీ అందరికి ఇదే నా విన్నపం.

విశ్వపతి

# నివేదన

శ్రీకృష్ణుడు నిస్సంగుడు, ప్రేమ తత్వ స్వరూపుడు, నిష్కామయోగి, నిష్కామ కర్మయోగి. మహాభారత శ్రీకృష్ణుని మహాపురుషునిగా, గొప్ప రాజనీతిజ్ఞునిగా మనం దర్శిస్తే, భాగవత కృష్ణుడు ఎంతో ఆనందానిచ్చే ప్రేమ స్వరూపంగా, ఎంతో దివ్యానుభూతిని ప్రసాదించే గొప్ప మనోహర మూర్తిగా మనం దర్శిస్తాం. శ్రీకృష్ణుల వారి అనేక గుణ విశేషాలపై ఇప్పటికే కొన్ని లక్షల రచనలు వచ్చి ఉంటాయి. ఆ స్వామి తన భక్తులను అంతగా అనుగ్రహించాడు మరి! .

ఇన్ని వేల సంవత్సరాలుగా కృష్ణయ్య మధురభక్తిలో ఓలలాడుతూ ఆ స్వామికే సర్వం సమర్పించి సచ్చితానందానికి లోనైన మహనీయులు ఎందరో ఉన్నారు. ఆ కన్నయ్య పేరులో, ఆ స్వామి తత్వంలో ఉన్న మాధుర్యం అంతటిది!.

ఇప్పటిదాకా అనేక దేవతలపై ఎన్నో పుస్తకాలు రచించిన నేను కొన్ని సంవత్సరాల క్రితం శ్రీకృష్ణ వ్రతం కూడా రచించాను. ఆ పుస్తకం శ్రీకృష్ణ భక్తులను ఎంతగానో అలరిస్తోంది. ఇన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ ఈ శ్రీకృష్ణ దర్శనం! ఇది పూర్తిగా ఆ శ్రీకృష్ణుల వారి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఆ స్వామి అనుగ్రహంతో నేను ద్వాపరయుగంలోకి వెళ్ళి అప్పటి కన్నయ్య లీలలను దర్శించి రచించిన పుస్తకం ఇది. ఈ పుస్తకం రాస్తున్నంతసేపు నేను మాటలలో, అక్షరాలలో వర్ణించలేని అద్భుత అనుభూతికి లోనయ్యాను. ఆ స్వామితో ద్వాపరయుగంలో గోకులంలో, బృందావనంలో విహరించడం కంటే ఆనందం ఏముంటుంది?

ఒక్కోరోజు నేను కాస్త పని వత్తిడి వలన కొంచెం బద్ధకం చేసి పడుకొని ఉంటే ఎదురుగా ప్రత్యక్షమై పక్కన కూర్చొని పదపద రాసుకుందాం అనేవాడు. ఎంతటి దివ్యానుభూతి అది! అక్కడితో నా శ్రమ మర్చిపోయి వెంటనే ఇద్దరం చెంగు చెంగున నేను రాసుకునే టేబుల్ దగ్గరకి వెళ్ళి మళ్ళీ

రాయడం ప్రారంభించేవాడిని అలా కన్నయ్య నాకు దర్శింపచేసిన ఎన్నో దివ్యలీలలు ఈ పుస్తకంలో రాసాను. జన్మ జన్మలకు మర్చిపోలేని మధురానుభూతి అది! .

ఈ పుస్తకం రాస్తున్న రోజుల్లో కృష్ణుడితో ఎన్నో అద్భుతాలు! ఒక్కొక్కసారి బాగా అలసిపోయి రాత్రి నిద్రపట్టకపోతే పక్కనే కూర్చొని ఎంతో మనోహరంగా వేణువు ఊదేవాడు. ఒక్కొక్కసారి ద్వాపరయుగ కబుర్లు చెపుతూ నాకు నిద్ర పట్టే వరకు పక్కనే కూర్చొనేవాడు. ఇలా ఆ కన్నయ్య ఎన్నో అనుభూతులు నాకు అనుగ్రహించాడు.

ఈ పుస్తకం మీరు ఎటువంటి సంశయాలు మనస్సులో పెట్టుకోకుండా చదివితే మీకు అద్భుత అనుభూతులు కలుగుతాయి. మీరు కూడా గోకులంలోను, బృందావనంలోను ఆ కృష్ణయ్యతో విహరించిన దివ్య అనుభూతి కలుగుతుంది. మనస్సు ఎంతో ఆనందంతో నిండిపోతుంది. ఈ పుస్తకాన్ని మీరు మీకు మనశ్శాంతి లేనప్పుడు చదివితే ఎంతో మనశ్శాంతి కలుగుతుంది. అంతేకాదు ఆ కన్నయ్య అనుగ్రహంతో మీ సమస్యలన్నీ పూర్తిగా తీరిపోతాయి.

కన్నయ్య చెప్పిన ఇంకో విషయం. ఈ పుస్తకాన్ని ఎవరయితే ఆ కన్నయ్యపై పూర్తి భక్తితో, ప్రేమ భావంతో చదువుతారో వారికి తాను స్వప్న దర్శనం కాని, ఒక అపరిచిత భక్తుని రూపంలోగాని తప్పక దర్శనమిస్తాడని అనుగ్రహించాడు. ఇంతకు మించిన భాగ్యం మనకి ఏముంటుంది? ఇంకా ఆలస్యం దేనికి? హాయిగా ప్రశాంతంగా చదవడం మొదలు పెట్టండి. పదండి ఆ కన్నయ్యతో గోకులానికి, బృందావనానికి!.

ఈ పుస్తకాన్ని ఎంతో అందంగా డి.టి.పి. చేసిన శ్రీ తామరపల్లి కృష్ణకు, ఎంతో చక్కటి ముఖచిత్రాన్ని ఇచ్చిన శ్రీమతి విష్ణుప్రభ గారికి, రాధాకృష్ణుల చిత్రం ఇచ్చిన శ్రీ హరి తాడోజు గారికి, నా పుస్తకాలన్నింటినీ ఎంతో చక్కగా ముద్రిస్తున్న విమల్ ప్రింటర్స్, శ్రీ సత్యనారాయణ గారికి నా

కృతజ్ఞతలు. ఈ పుస్తక ప్రచురణలో ఎన్నో విధాల సహాయపడిన నా కుటుంబ సభ్యులకు, బంధువులకు, ఎందరో మిత్రులకు, శ్రేయోభిలాషులకు నా కృతజ్ఞతలు. వీరందరినీ, మిమ్మల్ని ఆ శ్రీలక్ష్మీ శ్రీనివాసులు ఎల్లప్పుడూ చల్లగా చూడాలని ప్రార్థిస్తున్నాను.

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు!

శ్రీకృష్ణ అనుగ్రహ సిద్ధిరస్తు!
శ్రీలక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు!
సర్వేజనా సుఖినోభవంతుః
సమస్త కళ్యాణానిభవంతుః

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి
viswapathi@gmail.com
Ph.: 98494 43752

Hyderabad
2025

# అంకితము

నా తల్లిదండ్రులు

కీ॥శే॥ బ్రహ్మశ్రీ తిమ్మరాజు లక్ష్మీ నరసింహారావు

కీ॥శే॥ శ్రీమతి నాగరత్నాంబ గార్ల ప్రీత్యర్థముగా

శ్రీకృష్ణ దర్శనం పుస్తకాన్ని ముస్తాబాదులోని

మా వంశీకుల కులదైవం అయిన

శ్రీ సంతాన వేణుగోపాలస్వామి

వారికి భక్తితో సమర్పిస్తున్నాను.

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

# 1

ఆ రోజు రోజూలాగానే యశోద ఏవో పనులు చేసుకుంటూ అటూ ఇటూ తిరుగుతోంది. ఊయలలో చిన్ని కృష్ణయ్య ఎంతో ముద్దుగా నిద్రపోతున్నాడు. కృష్ణుడు అప్పటికి కేవలం 18 రోజుల పసిబాలుడు! ఈ బ్రహ్మాండాలన్నింటినీ తనలో దాచుకున్న ఆ పురుషోత్తముడు అలా ఊయలలో పసిపాపలా నిద్రపోతుంటే ఎంత ముచ్చటగా ఉంది ఆ దృశ్యం! ఆహా ఎంత ముద్దుగా ఉన్నాడో ఆ చిన్ని కృష్ణుడు! సృష్టిలో ఉన్న అందమంతా నీదేనయ్యా! అప్పటికింకా కృష్ణుడికి నామకరణం కూడా జరగలేదు. పసిపిల్లవాడు అలా ఊయలలో నిద్రపోతుంటే యశోద గోష్టంలోకి వెళ్ళి ఆవుల పాలు పితుకుతున్నది.

బయట ఆవుపాలు పితుకుతున్న యశోదమ్మకు ఏవో మువ్వల శబ్దం వినపడింది. తాను నిన్ననే కన్నయ్య ఊయలకి పైన మువ్వలు కట్టిన విషయం గుర్తుకువచ్చింది. కాని లోపల ఎవరు లేరు కదా! మువ్వలు ఎలా

శబ్దం చేస్తున్నాయి. అని ఆశ్చర్యపోయింది. బహుశా ఇది తన భ్రమ అనుకుని తన పనిలో తాను పడింది. కాని కాసేపటికే మళ్ళీ ఆ మువ్వల శబ్దం ఎంతో అద్భుతంగా వినపడింది. బాగా కదులుతున్నట్లు అనిపించి వెంటనే యశోద లోపలకి వెళ్ళి చూసింది. ఊయల అటూ ఇటూ ఊగుతూ కనిపించింది. ఊయలలో పడుకున్న చిన్ని కృష్ణయ్య కనులు మూసుకొని చిరునవ్వుతో నిద్రిస్తున్నాడు. ఇక్కడ ఎవ్వరూ లేరు కదా! మరి ఈ ఊయల ఊపినది ఎవరు? బహుశా ఎవరో గొల్లభామలు ఇంట్లోకి వచ్చి కన్నయ్యను చూసి ఎంతో ముద్దుగా అనిపించి ఎంతో ముచ్చటపడి ఒకసారి ఊయల ఊపి వెళ్ళిపోయి ఉంటారులే అని యశోద సమాధానపడి మళ్ళీ ఆవుల గోష్టంలోకి వెళ్ళింది. మళ్ళీ పాలు పితకడంలో నిమగ్నమయింది.

కాసేపటికి మళ్ళీ అదే ఊయల ఊగుతున్న శబ్దం. మువ్వలు చప్పుడు చేస్తున్నట్లు అనిపించింది. వీళ్ళెవరో గాని మన పిల్లవాడిని పడుకోనిచ్చేలాగా లేరు. ఇలా మాటిమాటికి అది కూడా దొంగచాటున వచ్చి ఊయల ఊపి వెళ్ళిపోవాలా! పిల్లవాడు భయపడితేనో? మరీ ఇంతగట్టిగా ఊపాలా అనుకుంది. కన్నయ్య యశోద వంక చూస్తూ కొంచెం బెదిరినట్లు ముఖం పెట్టాడు. యశోదకు ఆశ్చర్యం కలిగింది తాను బయట ఉన్నప్పుడు కన్నయ్య నవ్వు వినిపించింది. కాని తాను లోపలకి రాగానే ఈ మువ్వల శబ్దానికి బెదిరిన వాడిలాగా ముఖం పెట్టాడు. అయ్యో! ఎవరబ్బా ఇలా ఊయల ఊపి వెళ్ళిపోతున్నది అని తనలో తాను ఎంతగానో అనుకుంది.

కాని అసలు అక్కడ జరుగుతున్న విషయం వేరొకటి. ఆ వైకుంఠ వాసి అయిన శ్రీమన్నారాయణుల వారు ఇక్కడ భూలోకంలో గోకులంలో ఇలా పసిపిల్లవాడిలా కనిపించేటప్పటికి దేవతలందరికీ ఎంతో ముచ్చట కలిగింది. శ్రీమన్నారాయణుల వారిని ఇలా చిన్న పిల్లవాడిలా ఊయలలో ఊగుతూ చూడగానే వారందరికీ ఎంతో ఆనందం కలిగింది. ఆహా! ఈ గోకులం ఎంత అదృష్టం చేసుకుంది! సృష్టి మొత్తానికి కారణభూతుడైన ఆ పురుషోత్తముడు భూలోకంలో జన్మించి ఒక చిన్న బాలుని రూపంలో అలా

కేరింతలు కొడుతూ ఆడుతూ ఎంత ముచ్చటగా ఉన్నాడో ? ఈ బాలుని నిత్యం చూస్తున్న యశోద, నందులు ఇంకా గోకులంలోని వారందరూ ఎంత అదృష్టవంతులో కదా! ఈ బాలుని తాకి, ముద్దాడిన వారందరూ ఎన్నో జన్మల పుణ్యఫలం మూటకట్టుకుంటున్నారు. ఇలా నిత్యం ఆ బాలుని స్పృశిస్తున్న ఆ గోకుల వాసులు ముందు ముందు యుగాలలో ఎంతో గొప్ప జన్మను పొందనున్నారు. ఆహా వారి అదృష్టం ఎంతటిది? అని దేవతలందరూ తలుస్తున్నారు.

దేవతలకు మరొక ముచ్చటకూడా కలిగింది. ఈ చిన్ని బాలుని రూపంలో ఉన్న పురుషోత్తముని ఒక్కసారి ఊయల ఊపితే ఎంత ఆనందంగా ఉంటుంది అని తలచి ఆరోజు చతుర్ముఖ బ్రహ్మ అదృశ్య రూపంలో వచ్చి కన్నయ్య ఊయల పక్కనే నుంచొని ఊపసాగాడు. ఊయలలో ఉన్న పరంధాముడు చతుర్ముఖ బ్రహ్మ ముచ్చట గమనించి తన చిన్ని కాళ్ళు చేతులు అటూ ఇటూ కొడుతూ చిరునవ్వు నవ్వుతున్నాడు. ఇది చూసిన బ్రహ్మ దేవుని ఆనందం ఇంతా అంతా కాదు ఆహా పరంధామా! పురుషోత్తమా! దేవదేవ! నిన్ను పసిబాలునిగా ఊయల ఊపే చక్కటి భాగ్యం ప్రసాదించావు తండ్రీ! నిన్ను ఒక్క క్షణం కూడా వదిలి పోబుద్ధి కావడంలేదు. కదా! ఇక్కడ ఇలాగే ఉండిపోవాలనిపిస్తోంది అనుకుంటున్నాడు.

బ్రహ్మదేవుడు ఆ పురుషోత్తముడిని చూసి పొందుతున్న ఆనందం మాటల్లో వర్ణించలేము. ఆహా నా అదృష్టం ఎంతటిది! నిన్ను ఇలా చిన్ని బాలునిగా కాళ్ళు చేతులు ఇటూ అటూ ఆడిస్తూ చిరునవ్వు చిందిస్తుంటే చూడడానికి ఎన్ని కన్నులు ఉన్నా సరిపోవయ్యా! బ్రహ్మ దేవుడు ఇలా ఆలోచిస్తూ ఆ ఊయల ప్రక్కనే నుంచున్నాడు. ఊయలలో ఉన్న ఆ చిన్న కన్నయ్య ఊ ఊ అంటూ మధ్య మధ్యలో బ్రహ్మ దేవుడు చెప్తున్న విశేషాలన్నీ వింటున్నట్లుగా ఊ కొడుతున్నాడు.

ఇంతలో ఇంట్లోకి యశోదమ్మా! ఏంచేస్తున్నావు? అంటూ చిత్రిక వచ్చింది. అయ్యో పిల్లవాడి దగ్గర ఎవరూ లేరే అనుకుంది. చిన్ని కన్నయ్య ఆ

ఊయల అటూ ఇటూ ఊగుతుంటే ఒకటే కేరింతలు కొడుతున్నాడు. అది చూసి చిత్రిక ఎంతో ముచ్చట పడింది. ఈ పిల్లవాడు ఎంత ముద్దుగా ఉన్నాడో అనుకుంది. ఓహో! యశోదమ్మ పాలు పితకడానికి గోష్టానికి వెళ్తూ బహుశా ఒక్కసారి ఈ ఊయల గట్టిగా ఊపి వెళ్ళినట్లుంది అనుకుంది చిత్రిక.

చిత్రిక ఇలా అనుకుంటుండగానే యశోదమ్మ రానే వచ్చింది. వస్తూనే ఏమ్మా చిత్రికా నువ్వేనా ఇందాక ఈ ఊయల ఊపి వెళ్ళావు? పిల్లవాడు భయపడడూ! ఎంత ముద్దయితే మాత్రం మరీ అంత గట్టిగా ఊపడమా అని కొంచెం కోపంగా అంది. అప్పుడు చిత్రిక అమ్మా యశోద నేను ఇప్పుడే ఇంట్లోకి వస్తున్నాను. ఇంట్లోకి అడుగు పెట్టగానే ఇదిగో ఈ ఊయల ఇలా ఊగుతోంది. పక్కన ఎవరూ లేరు. ఊయలలో పిల్లవాడు ఊ ఊ అంటూ ఏదో వింటున్నట్లుగా ఉంటే ఆశ్చర్యం వేసింది అని చిత్రిక చెప్పింది. నేను మాత్రం ఊపలేదమ్మా అని మళ్ళీ అంది. యశోదమ్మ సరేలే అని సర్దుకొని ఊయలను కాస్త ఊగకుండా ఆపింది. ఊయలలోని చిన్ని కన్నయ్య యశోద వంక చిరునవ్వుతో చూసాడు. ఆ ముసి ముసి నవ్వులతో యశోద కోపం అంతా ఇట్టే పోయింది. యశోదకు ఏం తెలుసు తన కొడుకు సాక్షాత్తూ ఆ పురుషోత్తముడే అని! అప్పుడు ఉయ్యాల ఊపింది ఆ చతుర్ముఖ బ్రహ్మనే అని!

బ్రహ్మదేవుడు తిరిగి తన లోకానికి వెళ్ళి పరమేశ్వరునితో చిన్ని కృష్ణుని లీలా విశేషాలన్నీ చెప్పాడు. పరమేశ్వరుడు ఇవన్నీ విని ఎంతో సంతోషించి ఒకసారి తాను కూడా కేశవుని ఇలా చిన్ని బాలునిగా చూడాలి అనుకున్నాడు.

# 2

మర్నాడు ఉదయం యశోద చిన్ని కృష్ణునికి పాలు త్రాగించింది. ఎంతో ముద్దులు గొలుపుతున్న చిన్ని కృష్ణయ్యను చూడడానికి గోపికలు రాసాగారు. చుట్టు ప్రక్కల గల గోప బాలురు ఈ చిన్ని బాలుడు ఎప్పుడెప్పుడు పెద్దవాడవుతాడా ఎప్పుడెప్పుడు తాము ఈ ముద్దుల పిల్లవాడితో ఆడుకుంటామా అని అనుకుంటూ ఉండేవారు. వారికి ఉయ్యాలలో ఉన్న కన్నయ్య సరిగ్గా కనబడక ఎగిరి ఎగిరి చూసేవారు. వారిని చూసి యశోద పిల్లలూ! వీడికి ఇంకా రెండు నెలలు కూడా లేవు మీరు అలా ఎగిరి శబ్దం చేస్తే పిల్లాడు భయపడతాడు అలా ఎగరకండి అని చెప్పేది. యశోదమ్మ ప్రాణాలు అన్నీ చిన్ని కృష్ణుని పైనే!

ఇంతలో రాత్రి అయింది. చిన్ని కృష్ణయ్యను ఊయలలో పడుకోపెట్టి పక్కనే యశోద, నందులు ఇద్దరు పడుకున్నారు. ఇంతలో బయట పెద్ద వర్షం ప్రారంభమయింది. ఆ శబ్దానికి యశోదకు మెలకువ

వచ్చింది. పసిబాలుడు ఎలా ఉన్నాడో అనుకుంది. ఉయ్యాలలో కన్నయ్య చక్కగా నిద్రపోతున్నాడు. హమ్మయ్య అనుకొని ప్రశాంతంగా వెళ్ళి నిద్రపోయింది. కాసేపటికి పరమేశ్వరుడు వచ్చాడు. ఊయల పక్కనే అదృశ్య రూపంలో నుంచొని ఏమయ్యా! కేశవ! ఇలా చిన్న బాలుడిలా ఎంత ముద్దుగా ఉన్నావయ్యా అని అన్నాడు. ఒక్కసారి నిన్ను ఎత్తుకోవాలని ఉంది నారాయణా అని అన్నాడు. అందుకు కృష్ణయ్య చిరునవ్వుతో అలాగే అన్నట్లుగా సమాధానమిచ్చాడు.

పరమేశ్వరుడు ఆ చిన్న బాలుని రెండు చేతులతో ఎత్తుకొని చూసుకుంటూ మురిసిపోతున్నాడు. ఇంతలో ఎక్కడో పెద్ద పిడుగు పడటంతో పెద్ద శబ్దము వచ్చి యశోదకు మెలకువ వచ్చి ఊయలలో పిల్లవాడు ఎక్కడ బెదిరిపోయాడో అనుకుంటూ వచ్చి చూస్తే ఊయలలో పిల్లాడు కనబడలేదు. అమ్మో అని ఒక్కసారిగా కంగారు పడింది. ఆ తల్లికి గుండె గాభరా అయింది. ఇది గమనించిన పరమేశ్వరుడు వెంటనే నారాయణుని తిరిగి ఊయలలో వేసాడు. యశోదమ్మకు మళ్ళీ కన్నయ్య కనబడ్డాడు. ఒక్క క్షణం అనుకుంది ఇదేమిటి ఇప్పుడే లేడు కదా మళ్ళీ కనబడుతున్నాడు. ఇంతలో ఎక్కడకి వెళ్ళాడు? ఎలా వచ్చాడు? అనుకొని ఆశ్చర్యపోయింది. మళ్ళీ కాస్త తమాయించుకొని ఓహో! నేనే నిద్రమత్తులో సరిగ్గా చూసినట్లు లేను అనుకుంది యశోదమ్మ.

ఆరోజు కృష్ణయ్య ఉదయం నుంచే ఎంతో ఆనందంగా ఉన్నాడు. యశోదకు తన కొడుకు ఆ రోజు ఇంకా తేజస్సుతో మరింత ముద్దుగా కనిపిస్తున్నాడు. అప్పటికి కృష్ణయ్యకు రెండు నెలలు నాలుగు రోజులు. రోజూ గోకులం నుంచి ఎందరో గోపికలు వచ్చి ఈ చిన్ని కృష్ణయ్యను చూసి ఎంతో సంతోషిస్తున్నారు.

కొందరు పిల్లవాడిని ఎత్తుకుందాం అని చూస్తారు. కొందరు బుగ్గపై ముద్దులాడుతారు. కొందరు ఊయలలూపుతుంటారు. మరి వీరందరూ ఎన్ని యుగాలనుంచి ఎదురుచూస్తున్నవారు? వారి మనస్సులన్నీ

ఈ కన్నయ్య పైననే కదా! అయితే ఇలా రోజూ గోపికలు రావడం పిల్లవాడిని ఇలా ఆడించడం యశోదమ్మకు కాస్త చిరాగ్గా ఉంది. అమ్మో నా పిల్లవాడికి వీరి దృష్టి తగులుతుందేమో అని బాధ పడుతుంది. ప్రతీ రోజు రాత్రి పడుకునేముందు తన ముద్దుల కన్నయ్యకు దిష్టి తీస్తుంది. ఇదంతా గమనిస్తున్న ఆ పురుషోత్తముడికి ఎంతో విచిత్రంగా, ఎంతో ముచ్చటగా అనిపిస్తుంది. భక్తులందరి ముచ్చట్లు తీర్చడమే కదా ఆ శ్రీమన్నారాయణుడికి అత్యంత ప్రీతికరం! అమాయకపు భక్తితో తనను సేవించేవారిని తానెప్పుడూ అనేక చేష్టలతో ఆనందపరుస్తూంటాడు.

తాను ముందు ముందు చేయవలసిన కార్యాలన్నీ గుర్తుకు వచ్చి అప్పుడప్పుడూ తనలో తాను నవ్వుకుంటాడు. ఉయ్యాలలో ఉన్నాడన్న మాటేగాని ఆ పురుషోత్తముడికి సృష్టిలో ఎక్కడ ఏది జరుగుతోందో నిత్యం గమనిస్తూంటాడు అందుకే తనలో తాను నవ్వుకుంటూ ఉంటాడు. పిల్లవాడు అలా నవ్వటం చూసిన యశోదమ్మ గోపికలతో అమ్మలారా ఈ పిల్లాడిని చూడండి! ఎంత విచిత్రమో! ఏవో క్రితం జన్మల విశేషాలు గుర్తొచ్చి ఇలా నవ్వుతున్నట్లున్నాడు అని చెప్తుంది. పాపం యశోదకి ఏం తెలుసు ఇక్కడ ఉయ్యాలలో ఉన్న బాలుడు ఈ విశ్వం మొత్తాన్ని తనలోనే నింపుకొని ఉన్నవాడని అందరి జీవుల యందు అంతర్యామి స్వరూపంలో ఉండేది ఇతడే అని! అసలు తన ఆదేశం లేనిదే ఈ సృష్టిలో ఏ ప్రాణి ఒక్క క్షణం కూడా ముందుకు కదలదు అని! సృష్టి మొత్తానికి ఆధారభూతుడైన ఆ నారాయణుడే ఇక్కడ ఇలా చిన్న పిల్లవాడిలా ఉన్నాడని ఆ అమాయకపు గోకులవాసులకేం తెలుసు?

ఆ రోజు పిల్లవాడు ఇంకా ముద్దుగా కనిపిస్తున్నాడని చెప్పాను కదా! కారణం ఏమిటో తెలుసా? ఇంక కాసేపట్లో అక్కడకి తనకి ప్రియాతిప్రియమైన ఆదిశేషుడు, గరుత్మంతులవారు రాబోతున్నారు. ఈ సృష్టిలో ప్రతీక్షణం ఎక్కడ ఏం జరుగబోతున్నది తెలిసిన ఆ పురుషోత్తమునికి తన అనుంగు భక్తులు వస్తున్నారని తెలియడంలో ఆశ్చర్యమేముంది? ఇలా

తలుస్తుండగా కృష్ణయ్య ఉన్న గదిలో నేలపై ఒక్కసారిగా ఒక సర్పం జరజరా పాకడం యశోదమ్మ చూసింది. యశోదమ్మ గట్టిగా ఒక కేక వేసి పిల్లవాడిని ఏం చేస్తుందో అని ఇరుగు పొరుగుల వారిని గట్టిగా అరచి పిలిచింది.

నలుగురు వచ్చేసరికి ఆ సర్పం ఇంట్లోనుంచి బయటకు వెళ్ళింది. యశోద, పక్క ఇళ్ళల్లోని వారు దాని వెంట పరుగులు పెట్టారు. అయితే ఆ సర్పం ఏదో మాయా సర్పంలాగా కాసేపు కనబడి ఇట్టే మాయమౌతోంది. అది కూడా ఒకరికి చిన్నదిగా ఒక రంగులో కనబడుతుంటే, మరొకరికి పెద్దగా మరొక రంగులో కనబడుతుంది. ఇదంతా ఆదిశేషుడు సృష్టించిన మాయ! పిల్లవాడి దగ్గర ఎవరూ లేకుండా అందరూ బయట ఆ పాముని వెదకడంలో అటూ ఇటూ పరుగెడుతూ చాలా దూరం వెళ్ళారు. యశోదమ్మ గడప దగ్గరే ఒక పెద్ద కర్ర పట్టుకొని కూర్చొని ఆ సర్పం మళ్ళీ ఇటు వస్తుందేమోనని చూస్తోంది.

ఇలా ఉండగా ఇంటిలోపల ఆదిశేషులు, గరుత్మంతుల వారు అదృశ్య రూపంలో ఊయల పక్కనే నుంచొని ఉన్నారు. తాము ఎల్లప్పుడూ సేవించే పురుషోత్తముని ఇంత కాలానికి ఇలా చిన్న పిల్లవాడిలా చూసి ఎంతో సంతోష పడ్డారు. ఆహా! మా స్వామి ఎంత అందంగా ఉన్నాడో సృష్టిలో ఉన్న అందం అంతా నీదేకదయ్యా! ఈ గోకుల వాసులు చేసుకున్న అదృష్టం ఎంత గొప్పది. నిన్ను ఇలా ముగ్ధమనోహరుని రూపంలో చూస్తుంటే మాకు తిరిగి వెళ్ళబుద్ధి కావడం లేదు. నిన్ను ఇలా చూస్తూ నీ ముచ్చట్లు చూస్తూ నీ లీలలు చూస్తూ ఇలా నీతోనే ఉండిపోవాలనిపిస్తోంది అని అనుకుంటున్నారు. ఆ స్వామితో ఇదే మాట చెప్పారు. చిన్ని కన్నయ్య వీరి రాకకు వీరి ఆలోచనలు చూసి ఎంతో ఆనందించాడు.

ఒక్కసారి ఆ అద్భుత దృశ్యం చూడండి. దేవతా రూపాలతో, అదృశ్య రూపాలలో ఆ చిన్ని బాలుని పక్కనే నుంచొని ఉన్న ఆదిశేషుని, గరుత్మంతులవారిని దర్శించిన మన జన్మ ధన్యం కదా! వారు కాసేపు అలా స్వామితో ముచ్చట్లు ఆడి వారిద్దరూ స్వామి వద్ద సెలవు తీసుకొని వారి వారి

స్వస్థలాలకు పయనమై వెళ్ళారు. అప్పుడే యశోద లోపలకి వచ్చి ఆ చిన్న బాలుడిని ఎత్తుకొని ముద్దాడి ఎంత గండం తప్పిందిరా కన్నా నీకు! ఆ పాము ఎలా ఉందనుకున్నావు? నువ్వు చూస్తే ఎంత భయపడేవాడివో? ఎంత బెదిరిపోయేవాడివో? భగవంతుని దయ వల్ల ఎటో వెళ్ళిపోయింది తండ్రి! నా కన్న తండ్రి అంటూ ఎన్నో ముద్దులు కురిపించి చిన్ని కన్నయ్యను తిరిగి ఉయ్యాలలో పడుకోపెట్టింది.

ఇదంతా గమనించిన మన చిన్ని కృష్ణయ్య మన కొంటె కృష్ణయ్య చిరునవ్వులు నవ్వుతూ మధ్యలో భయం నటిస్తున్నాడు. నటనసూత్రధారికి ఈ చిన్న నటన ఏపాటిది! ఆహా! నీ అద్భుత లీలలతో మా అందరినీ ఎంత తన్మయత్వంలో పడేస్తున్నావు తండ్రి! విచిత్రం ఏమిటంటే నీ మాయలు కూడా ఎంతో ఆనందంగా ఉంటాయి. ఎంతో అద్భుతంగా ఉంటాయి తండ్రీ!.

# 3

ఆ రోజు చిన్ని కన్నయ్య ఎందుకోఉదయం నుంచి చికాకుగా ఉన్నాడు. మధ్య మధ్యలో చిన్న చిన్నగా ఏడుస్తున్నాడు యశోదకు ఎంతో బాధ కలిగింది. ఏమయింది కన్నా ఎందుకు ఇలా ఏడుస్తున్నావు? నీకెవరి దృష్టి తగిలింది తండ్రీ? అంటూ ఏవో జోలపాటలు పాడుతోంది. అయినా కన్నయ్య ఏడుపు ఆపట్లేదు. కాసేపు ఆగి ఏదో ఆలోచిస్తున్నవాడిలా ఉండి తిరిగి ఏడవడం మొదలుపెట్టాడు. యశోదకు ఏం చెయ్యాలో దిక్కు తోచడం లేదు. ఇంతలో పక్కింటి గోపికలు వనజ, స్రవంతి వచ్చారు యశోద వారికి కన్నయ్యని చూపించింది. చూడండమ్మా పిల్లాడు ఎలా ఏడుస్తున్నాడో ఎందుకో అర్థం కావడం లేదు మీరైనా కాస్త సముదాయించండి అని అంది. అప్పుడు వనజ ఉయ్యాల వద్దకు వచ్చి కన్నయ్యను చూస్తూ పాట పాడింది. వనజ కంఠం ఎంతో మధురంగా ఉంటుంది. కాని ఉయ్యాలలో పిల్లవాడు ఏమాత్రం ఏడుపు ఆపడంలేదు. ఇందాకటివలె ఏడుస్తూ మధ్య మధ్యలో కాసేపు ఆపి తిరిగి ఏడవసాగాడు.

పిల్లవాడికి ఏదైనా పురుగు కుట్టిందేమో అనుకొని యశోద పక్క అంతా తీసి చూసింది. ఎక్కడా ఏమి కనపడలేదు. కాసేపు భుజం మీద వేసుకొని అటూ ఇటూ తిప్పింది. కాని కన్నయ్య ఏడుపు ఆపితేనా? అలా ఏడుస్తూనే ఉన్నాడు. ఎత్తుకుంటే ఇంకా ఎక్కువ ఏడుస్తున్నాడు. యశోదకి ఏం చెయ్యాలో పాలుపోవడంలేదు. వచ్చిన రెండవ గోపిక స్రవంతి కూడా ఎంతో చక్కటి జోలపాట పాడింది. అయినా అస్సలు లాభం లేదు! కన్నయ్య ఏమాత్రం ఏడుపు ఆపడం లేదు.

ఇంతలో ఎవరో తలుపు కొట్టినట్లనిపించి యశోద తలుపు తీసింది. అక్కడ కనబడిన గోపికను చూసి ఎంతో ఆశ్చర్యపోయింది ఎంత అందం! ఆ అందం చూసిన యశోదకు నోట మాట రాలేదు. ఎవరు ఈమె మన గోకులంలో ఇంతకుముందు ఎప్పుడూ చూడలేదే! రోజూ ఎంతోమంది గోపికలు వచ్చి కన్నయ్యను ఆడించి వెళ్తుంటారు. దాదాపు గోకులంలో ఉన్న ఆడవారందరూ తనకు తెలిసిన వారే కాని ఈమెను ఎప్పుడూ చూసినట్లు అనిపించడంలేదు ఎంతో తేజస్సుతో ఏదో దేవకన్యలాగా ఉంది.

ఆమె అందానికి ముగ్ధురాలై మైమరచి యశోద ఆమెను లోపలకి రమ్మని అనడం కూడా మరిచిపోయింది. ఇంతలో ఆమెనే చిరునవ్వు నవ్వుతూ ఏమ్మా యశోద నన్ను కాస్త లోపలకి రానిస్తావా ఒకసారి కన్నయ్యను చూసి వెళదామని వచ్చాను అంది. యశోద అయ్యో ఎంత భాగ్యం తల్లీ! తప్పకుండా రా కాని పిల్లవాడు ఉదయం నుంచి ఒక్కటే ఏడుస్తున్నాడు ఎందుకో అర్థం కావడంలేదు. ఇంతకి నువ్వు ఎక్కడనుంచి వచ్చావమ్మా అని అడిగింది. నేను పక్క ఊరునుంచి వచ్చాను మీ గోకులంలో ఉండే సువర్ణకి బంధువుని నాపేరు సాహితి. నాలుగు రోజులు ఇక్కడ గోకులంలో ఉండి వెళదామని వచ్చాను. చిన్ని కన్నయ్య అందం గురించి లీలలు గురించి అందరూ చెప్పుకుంటుంటే చూసి వెళదామని వచ్చాను.ఏది ఒక్కసారి చిన్ని కన్నయ్యను చూపించండి అన్నది. దానికి యశోద పిల్లవాడు ఉదయం నుంచి పాలు తాగలేదు ఒక్కటే ఏడుస్తున్నాడు అన్నది. అలాగా యశోదమ్మా! ఏది నన్ను చూడనీ అని చిన్ని కృష్ణుడి ఊయల దగ్గరకు వచ్చింది.

సాహితిని చూసిన కన్నయ్య ఒక్క క్షణం ఏడుపు ఆపి చిరునవ్వు నవ్వి మళ్ళీ ఏడవడం ప్రారంభించాడు. అప్పుడు సాహితి యశోదమ్మతో అమ్మా నేను ఒక జోలపాట పాడదాం అనుకుంటున్నాను పాడనా అంది. అయ్యో తల్లీ అంతకంటేనా! పిల్లవాడు ఏడుపు మానడమే కదా మనకి కావలసింది అంది. అప్పుడు సాహితి ఎంతో తియ్యని కంఠంతో చిన్న చిన్న పదాలతో చక్కటి జోలపాట పాడింది. సాహితి పాడటం ఇలా మొదలు పెట్టిందో లేదో ఉయ్యాలలోని చిన్ని కన్నయ్య ఒక్కసారిగా ఏడుపు ఆపేసాడు.

సాహితి అలా పాడుతూనే ఉంది ఆ పాట ఎంత మధురంగా ఉంది అంటే అది విన్న పక్క ఇళ్ళలో ఉన్న గోపకాంతులు అందరూ వచ్చి ఇలా ముక్కున వేలేసుకొని ఆమె అందాన్ని ఆమె పాటని చూసి ఎంతో ఆశ్చర్యపోయారు. ఆహా ఎవరు ఈమె? ఇంత అందంగా ఉంది? ఇంత గొప్పగా పాడుతోంది! మన గోకులంలో ఇంతటి అందగత్తెను ఎప్పుడూ చూడలేదే అనుకున్నారు.

యశోదమ్మ ఇదంతా గమనించి నా కన్నయ్య ఏడుపు ఆపేసాడు అంతే చాలు అనుకుంది. సాహితి పాట పాడడం పూర్తిచేసి యశోదమ్మ దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయింది. యశోదమ్మ సాహితికి బొట్టు పెట్టి చక్కటి చీర, తాంబూలం, బోలెడు పళ్ళు ఇచ్చింది. ఇవన్నీ ఎందుకమ్మా అంటే నువ్వు దేవతలా వచ్చి పాట పాడటంతో మా కన్నయ్య ఏడుపు మానేసాడు కదా! మా కెంత సంతోషం చెప్పు! అప్పుడప్పుడూ వస్తూ ఉండు తల్లి అంది. సాహితి యశోద దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయింది. సాహితి పాడుతున్నంతసేపు కన్నయ్య ఎంతో అద్భుతంగా నవ్వుతూ ఉన్నాడు. యశోదమ్మ గాభరా తగ్గి ఎంతో సంతోషపడింది.

ఇంతకీ ఆ వచ్చిన సాహితి ఎవరో తెలుసా? సాక్షాత్తూ చదువుల తల్లి సరస్వతియే! మొన్న పార్వతీ దేవి చిన్ని కృష్ణుని చూసి వెళ్ళిన తర్వాత బ్రహ్మలోకానికి వెళ్ళి సరస్వతితో శ్రీమన్నారాయణుల వారు ఇక్కడ భూలోకంలో గోకులంలో చిన్ని కృష్ణయ్యగా ఎంత ముద్దుగా ఉన్నాడో

చెప్పింది. ఆ అందం ఆ తేజస్సు మాటలలో వర్ణింపలేము అంది. మన నారాయణుడు గోకులంలో కన్నయ్యగా ఎంతో మురిపెంగా పెరుగుతున్నాడు. గోపికలు ఒక్కరోజు కూడా కృష్ణయ్యను వదలడంలేదు. కన్నయ్య మురిపెంతో వారందరినీ సమ్మోహన పరుస్తున్నాడు. మరి నారాయణుడు ఆ చిన్ని బాలునిగా అంత అందంతో ఆడుతుంటే ఎవరికి ముద్దు రాదమ్మా అని పార్వతి సరస్వతితో చెప్పింది.

అప్పటి నుంచి సరస్వతికి ఎలాగైనా చిన్ని కన్నయ్యను చూడాలని ఎంతో ఉబలాటంగా ఉంది. అందుకే ఈ రోజు ఇలా గోపకాంతలా వచ్చి చిన్ని కృష్ణయ్యను దర్శించుకొని చక్కటి జోలపాట పాడి వెళ్ళింది. ఇదంతా చిన్ని కృష్ణయ్యకు ముందే తెలుసు! అందుకే ఆ రోజు ఉదయం నుంచి అలా ఏడుపు నటిస్తున్నాడు. ఆహా! ఆ లీలామానుషధారి లీలలు ఎంత మధురంగా ఉంటాయో కదా! ఊయలలో ఊగుతున్న, చిరునవ్వు నవ్వుతున్న ఆ చిన్ని కృష్ణయ్యను చూడండి! ఎంత అందంగా మెరిసిపోతున్నాడో! ఈ సృష్టి మొత్తాన్ని ఆక్రమించి ఉన్న ఆ పురుషోత్తముడే ఇలా చిన్ని బాలుని రూపంలో ఇలా ఊయలలో పడుకొని కాళ్ళు అటూ ఇటూ చేతులు ఊపుతూ ఉంటే ఆ దృశ్యం ఎంత అద్భుతంగా ఉంది! ఇదంతా చూస్తున్న మన జన్మ ధన్యమయింది కదా!.

# 4

చిన్ని కన్నయ్య అలా నెమ్మదిగా కొంచెం పెద్దవాడయ్యాడు. చిన్ని చిన్ని అడుగులు వేసుకుంటూ నడుస్తున్న కన్నయ్య అందం చూడడానికి రెండు కళ్ళూ చాలవు. వైకుంఠంలోని శ్రీమన్నారాయణుడే శ్రీకృష్ణునిగా ఇక్కడ భూమిపై జన్మించడంతో భూదేవి ఎంతో ఆనందపడుతున్నది. తన భారం అంతా ఎంతో తేలికపడినట్లు అనిపించింది. చిన్ని కన్నయ్య నడకలో ఎంత వయ్యారం! ఎంత సొగసు!

ఒకరోజు కన్నయ్య అలా నడుస్తూ గబుక్కున కాలికి ఏదో తగులుకుని కింద పడ్డాడు. యశోద పరుగెత్తుకుంటూ వచ్చి అయ్యో కన్నయ్య ఎక్కడ తగిలింది అని చూసింది. బొటన వ్రేలుకు కొంచెం తగిలి వాచినట్లుంది అయ్యో కాస్త పసుపు రాస్తాను అని లోపలకి పరుగెత్తింది. లోపలకి వెళ్ళి పసుపు తీసుకొని వచ్చేటప్పటికల్లా కన్నయ్య కాలికి గాయం కనబడలేదు.

అదేంటి ఇంతలోనే ఆ గాయం ఎలా మాయమైంది? అసలు నేను సరిగ్గా చూసానా లేదా అనుకుంది. కన్నయ్య చిరునవ్వుతో అమ్మ వంకే చూస్తున్నాడు.

ఇంతలో ఒక మహర్షి వీరింటికి వచ్చాడు. యశోద నందులు ఆ మహర్షికి నమస్కరించి సపర్యలు చేసారు. అప్పుడు ఆ మహర్షి ఓ యశోద నందులారా! మీ ఇంట ఉన్న ఈ కన్నయ్య ఎవరు అనుకున్నారు? సృష్టి మొత్తానికి ఆధారభూతుడైన ఆ శ్రీమన్నారాయణుడే ఈ చిన్ని బాలుడు! ముందు కాలంలో ఈ బాలుని లీలా విలాసాలు ఎన్నో మీరు చూస్తారు. అప్పుడుగాని ఈ బాలుడు ఎవరన్నది మీకు అర్థం కాదు. ఎన్నో దైవ కార్యాలకోసం, ధర్మ రక్షణ కోసం భూమిమీద అవతరించిన పురుషోత్తముడే ఈ బాలుడు అని మహర్షి చెప్పాడు. అందుకు యశోద ఏమో స్వామి అదేమీ నాకు తెలియదు నాకు మాత్రం నా కన్నయ్యే! నా అతిముద్దుల గారాల బిడ్డడు! అని అన్నది. ఆ మహర్షి చిరునవ్వు నవ్వుతూ త్వరలోనే నేను చెప్పినది గ్రహిస్తావు యశోదమ్మ అంటూ వెళ్ళిపోయాడు. చిన్ని కన్నయ్య ఆ మహర్షి వంక చూస్తూ చిరునవ్వు నవ్వాడు ఆ చిరునవ్వులోని ఆంతర్యం గ్రహించిన ఆ మహర్షి కన్నయ్యకు మనస్సులోనే అభివాదం చేసి సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయాడు.

ఆ చిన్ని చిన్ని అడుగులు చూడండి ఆహా! కాలికి గజ్జెలతో మొలలో మువ్వలతో ఎంత ముద్దుగా ఉన్నావయ్యా కృష్ణా! అవి చిన్న పిల్లవాడి అడుగులలాగా లేవు ఎవరో గొప్ప నృత్యగాడు నృత్యం చేస్తూ ఉన్నట్లున్నాయి. మరి ఈ సృష్టిలో శ్రీమన్నారాయణుల కంటే మించిన ఆనందం ఇవ్వగలిగినవారు ఎవ్వరుంటారు? సృష్టిలోని అందం అంతా నీదే తండ్రి! ఓ చిన్ని కన్నయ్యా! నీ బుల్లి బుల్లి ఆటలతో మమ్మల్ని అందర్ని ఎంతో మురిపిస్తున్నావయ్యా!

ఒకరోజు చిన్ని కన్నయ్య ఇలా ఆడుకుంటూ ఉండగా పెద్దగాలివాన ప్రారంభమయింది. యశోద ఇంటి వెనక గోశాలలో ఉంది. ఆ

గాలివానకు పిల్లాడు ఏం బెదిరిపోయాడో అనుకుంటూ పరుగెత్తుకుంటూ ఇంట్లోకి వచ్చింది అక్కడ చిన్ని కన్నయ్య లేడు. ఒక్కసారిగా భయపడింది.

ఇల్లంతా వెతికింది ఎక్కడా కనపడలేదు. అమ్మో నా కన్నయ్య ఏమైపోయాడు అని పరుగెడుతూ ఇంటి బయటకి వచ్చింది. అక్కడ కృష్ణయ్య నుంచొని చిరునవ్వు నవ్వుతూ ఏమాత్రం తొణకకుండా ఆకాశం వంక చూస్తూ ఆ గాలిని ఆనందిస్తున్నాడు. అంత గాలికి కూడా ఆరు నెలల ఆ బుడతడు ఏ మాత్రం అటూ ఎటూ కదలక ఎంతో ముచ్చటగా ఆనందిస్తున్నాడు. ఆ గాలికి పక్కన ఇంటి కప్పులు కూడా ఎగిరిపోతున్నాయి. దూరంగా వృక్షాలు కూలుతున్న శబ్దాలు వస్తున్నాయి. అయినా చిన్ని కన్నయ్య ఏమాత్రం తొణకలేదు. పైపెచ్చు ఎంతో ముచ్చటగా నవ్వుతున్నాడు.

యశోద పిల్లవాడిని ఎత్తుకొని ఇంట్లోకి తీసుకొచ్చి తలుపు గట్టిగా వేసింది. కృష్ణా నీకేం కాలేదు కదా! అంత గాలిలో ఎలా నుంచున్నావు తండ్రీ! అంది. ఇంతలో నందుడు అక్కడకి వచ్చాడు. గాలి ఉధృతం తగ్గింది. జరిగిందంతా యశోద నందుడికి చెప్పింది ఇదంతా విన్న నందుడు ఆశ్చర్యపోయాడు. మొన్న మహర్షి చెప్పిన మాట నిజమేనేమో అని నందుడికి అప్పుడు అనిపించింది. యశోదకు మాత్రం కన్నయ్య కన్నయ్యే! తన ముద్దుల పిల్లవాడు! అంతేనా కన్నయ్యా! అంటూ ఎంతో అమాయకత్వంతో కృష్ణా! ఈ గాలికి భయపడకుండా ఎలా ఉన్నావు తండ్రీ! అంటూ కన్నయ్య బుగ్గలను ముద్దులతో తడిపేసింది. యశోదమ్మకు కన్నయ్యపై ఉన్న ప్రేమ మాటలలో వర్ణించలేనిది. ఎప్పుడూ కన్నయ్య మీదనే ఆమె ధ్యాస ఆమె దృష్టిలో కన్నయ్య చిన్ని బాలుడే ఇంక వేరే ఏమి తనకి అక్కర్లేదు. ఈ కన్నయ్య ఎప్పటికీ తన చిన్ని చిన్ని అడుగుల కన్నయ్యలాగానే కనిపిస్తున్నాడు.

# 5

ఆ కృష్ణుని అనుగ్రహంతో ఈ శ్రీకృష్ణ దర్శనం దివ్యంగా సాగిపోతోంది. కృష్ణస్వామి నాకు అనేక రూపాల్లో దర్శనమిస్తూ ద్వాపరయుగంలోకి తీసుకువెళ్ళి గోకులంలోని తన స్నేహితులందరినీ చూపిస్తున్నాడు. చిన్ని కన్నయ్య ఎంత ముద్దుగా ఉన్నాడో చూడండి. ఎప్పుడూ కృష్ణుని వద్ద నాలుగైదు రకాల రంగురంగుల గుడ్డలు ఉంటాయి. వాటిలో ఒకటి తీసుకొని నుదుటికి చుట్టుకునేవాడు. మధ్యాహ్నం ఆటలయ్యాక మరొక రంగు తీసుకొని చుట్టుకునేవాడు.

ఇలా రోజు మొత్తం ఆ నాలుగైదు రకాల గుడ్డ ముక్కలను నుదుటున చుట్టుకునేవాడు. ఒకొక్కసారి దానిమధ్యలో నెమలి పింఛం దోపేవాడు. కన్నయ్యకు నెమలి పింఛం ఎంత ఇష్టమో! ఒక్కోరోజు మూడు నాలుగు పింఛాలను కూడా తలకి చుట్టుకున్న ఈ గుడ్డకు దోపి పెట్టేవాడు.

ఇలా నాలుగైదు పింఛాలతో రంగురంగుల ఆ నుదుటి గుడ్డలతో అటూ ఇటూ పరుగెడుతున్న ఆ కన్నయ్యను చూడండి. ఎంత ముచ్చటగా ఉన్నాడో. ఈ రోజు నన్ను గోకులం బయటకు తన స్నేహితులతో తీసుకువచ్చాడు. ఆ గోపబాలురంటే కన్నయ్యకు ఎంతో ప్రాణం. ఒక పిల్లవాడిని చూపించి ఇదిగో ఇతను ఎంత బాగా ఆడతాడో తెలుసా అని చెప్పాడు. నన్ను అక్కడ నుంచోమని అన్నాడు. కన్నయ్య గోపబాలురతో కలిసి దగ్గరలో ఉన్న చెట్టుపైకి ఎక్కసాగాడు.

కన్నయ్య చెట్టు అలా ఎక్కుతుంటే తలపై ఉన్న నాలుగు పింఛాలలో రెండు కింద పడ్డాయి. నన్ను పిలిచి ఆ పింఛాలను తీసి తనకిమ్మన్నాడు. నేను ఆ రెండు పింఛాలను తీసుకొని కళ్ళకి హత్తుకొని చెట్టుని పట్టుకొని పైకి ఎక్కుతున్న కన్నయ్య వద్దకు వెళ్ళి కన్నయ్య చేతికి ఇచ్చాను. ఒకచేత్తో కిందకి జారకుండా చెట్టుని గట్టిగా పట్టుకొని రెండో చెయ్యి నావద్దకు చాచి ఈ రెండు పింఛాలను తీసుకున్నాడు. ఎక్కడ జారి పడతానో అని బెదురుతున్న నన్నుచూసి చిరునవ్వు నవ్వాడు.

ఆ చిరునవ్వులోని పరమార్థం నాకు అర్థమైంది. ఈ విశ్వం మొత్తాన్ని పట్టుకొని ఉన్న ఆ కన్నయ్యకు ఈ చెట్టుని పట్టుకొనడం ఒక లెక్కా ఈ విశ్వంలోని సమస్త గ్రహాలను శాసిస్తున్న ఆ పరంధాముడికి ఈ చెట్టుకొమ్మనుంచి జారకుండా ఉండడం ఎంత చిన్న విషయం?.

కన్నయ్య అలాచెట్టు ఎక్కుతుంటే ఆ చెట్టుమీద ఉన్న నెమళ్ళు అనేక రకాల పక్షులు కన్నయ్య చుట్టూ ఎగరసాగాయి. ఈ దృశ్యం క్రిందనుంచి చూస్తున్న నాకు ఎంతో ముచ్చటగా ఉంది. అదిగో ఆ నెమలిని చూడండి! ఆ చెట్టుకొమ్మలపై అటూ ఇటూ ఎగురుతూ కన్నయ్య చెట్టుపైకి పాకుతుంటే తానుకూడా వెళ్ళి పక్కనే వాలుతోంది. కొన్ని పక్షులైతే ఎంతో అద్భుతంగా పాడుతూ ఆ పక్కన కొమ్మలపై కూర్చున్నాయి. ఆ గోపబాలురంతా ఎంత పుణ్యం చేసుకున్నవారో. కన్నయ్య అలా ఆడుతున్న ఆ చెట్టు ఎంతటి పుణ్యం చేసుకుందో!

అలా కాసేపు ఆడుకున్నతరువాత అందరూ కలిపి కిందకి దిగారు. కన్నయ్య స్నేహితులందరినీ ఇళ్ళకు వెళ్ళమని చెప్పి నీకు ఇప్పుడు ఒక అద్భుతమైన కథ చెపుతాను. నాకు ఈ సృష్టిలో ఎంతో ప్రీతిపాత్రమైన రాధ గురించి చెప్తాను అని అన్నాడు. నాలో ఉన్న ప్రేమ తత్వం అంతా రాధే! ఈ ప్రకృతిలో ఉన్న ప్రేమ మొత్తం రాధా స్వరూపమే!

రాబోయే కాలాలలో రాధాకృష్ణ తత్వంపై ఎన్నో కావ్యాలు వస్తాయి, ఎన్నో కీర్తనలు వస్తాయి. రాధాకృష్ణ ప్రేమతత్వం యుగయుగాలుగా ఈ విశ్వం మొత్తానికి ఆదర్శంగా నిలుస్తుంది. రాధలేని కృష్ణుడు లేడు కృష్ణుడు లేని రాధ లేదు. నాకు అంతటి అపురూపమైన రాధ జన్మ విశేషం చెప్తాను విను అని కన్నయ్య నాకు ఇలా చెప్పసాగాడు.

వృషభానుడు అనే రాజు ఎన్నో వేల గోవులకు అధిపతి. ఇతటి భార్య కీర్తి. ఈ దంపతులిద్దరికి శ్రీమన్నారాయణుడంటే ఎంతో భక్తి. ఎప్పుడు ఆ స్వామి ఆరాధనలోనే జీవితం గడిపేవారు. వారికి చాలాకాలం సంతానం కలుగలేదు. కాని వారు ఏ మాత్రం నిరుత్సాహపడకుండా ఎప్పుడూ ఆ పురుషోత్తమునే ఆరాధిస్తూ ఉండేవారు.

అలా ఉండగా ఒకనాడు రాత్రి శ్రీమన్నారాయణుడు వారికి కనిపించి ఓ పుణ్యదంపతులారా! పూర్వజన్మలో మీరు కళావతి, సుచంద్రుడు. మీరు ముక్తి కోసం బ్రహ్మదేవుని అనుగ్రహం కోసం గోమతీ నదీ తీరాన ఎన్నో సంవత్సరాలపాటు ఎంతో గొప్ప తపస్సు చేశారు. అప్పుడు బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై మీ దంపతులిద్దరూ ద్వాపరయుగం చివ్వరలో గోకులంలో జన్మిస్తారని అప్పుడు మీకు రాధాదేవి పుత్రికగా జన్మిస్తుందని అక్కడితో మీకు ముక్తి లభిస్తుంది అని వరమిచ్చాడు. అప్పటి ఆ వర ఫలితంగా రాధాదేవి మీకు ఇప్పుడు పుత్రికగా జన్మిస్తుంది. ఆమె వలన గోకులమంతా ఎంతో ధన్యులౌతారు అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

వృషభానుడు, కీర్తి ఆ శ్రీమన్నారాయణుని అనుగ్రహం తమకు కలిగిందని గ్రహించి ఎంతో సంతోషించారు. నిత్యం ఆ స్వామి ఆరాధనను స్మరిస్తుండగా కాలక్రమాణ కీర్తి గర్భవతి అయింది. ఆ దంపతులు ఎంతో ఆనందించారు. ఆ పురుషోత్తముని ఎన్నో విధాలా కీర్తించారు. అనేక రకాల పూలతో శ్రీలక్ష్మీనారాయణులను ఎంతో గొప్పగా పూజించారు. గర్భవతి అయిన కీర్తి ప్రతీ నిత్యం శ్రీమన్నారాయణుల వారి గుణ విశేషాలను స్తోత్రం చేసేది. ఆ స్వామి వైభవాన్ని ఎంతో గొప్పగా వర్ణిస్తూ ఎన్నో కీర్తనలు పాడేది.

ఇలా ఉండగా భాద్రపదమాసం వచ్చింది. అది కృష్ణ పక్షం అష్టమీ సోమవారం. ఆ రోజు ఉదయం నుంచి ప్రకృతి అంతా ఎంతో గొప్ప శోభను సంతరించుకుంది. గోకులంలోని పక్షులు, నెమళ్ళు ఎంతో ఆనందంగా కూయసాగాయి. ఆకాశంలోనుంచి దేవతలందరూ ఏదో అద్భుతం జరుగబోతున్నట్లు ఎదురుచూస్తున్నారు.

ఇలా ఉండగా ఆనాటి మధ్యాహ్న సమయంలో కీర్తికి శ్రీరాధాదేవి జన్మించింది. రాధాదేవి భూమిమీద అవతరించినంతనే ఆ చుట్టుపక్కల అంతా ఎంతో దివ్యమైన తేజస్సుగల కాంతి ప్రసరించింది. ఆకాశం నుండి దేవతలు అద్భుతమైన పుష్పవృష్టి కురిపించారు. కీర్తి, వృషభానుడు ఎంతో ఆనందించారు. ఆ జగన్మాతే మనింట్లో అవతరించింది అని ఎంతో ఆనందించారు. ఆ పాప ఎంత ముచ్చటగా ఉందో చూడండి! ఎంత తేజస్సుతో వెలిగిపోతుందో!

ఈ సంతోషకర వార్తవిని యశోద, నందుడు కన్నయ్యను తీసుకొని వృషభానుని వద్దకు వచ్చారు. ఎంతో ముద్దుగా ఉన్న ఆ కన్నయ్యను చూసి వృషభానుపురంలో ప్రజలందరూ ఎంతో ముచ్చట పడ్డారు. వీరందరూ కలిసి వృషభానుడి ఇంటికి వచ్చారు. యశోద, నందుడు కన్నయ్యను తీసుకొని ఊయల వద్దకు వెళ్ళారు.

ఎంత తేజస్సుతో ఉంది ఈ పాప అనుకుంది యశోద. ఆశ్చర్యం అచ్చం చిన్నప్పటి కన్నయ్యలాగానే ఉంది అనుకుంది. ఆ మహాలక్ష్మియే ఇలా జన్మించలేదు కదా అని తలచింది. ఆ పాప తేజస్సుని చూసిన యశోదకు నోటమాటరాలేదు.

అయితే ఒక్క విషయం ఆమెని ఎంతో ఆశ్చర్యానికి గురిచేసింది. అదేమిటంటే ఆ పాప పుట్టినప్పటినుంచి కళ్ళు తెరువలేదని కీర్తి అప్పుడే చెప్పింది. తొలుత తాము చాలా బయపడ్డామని. అయితే నారద మహర్షి వచ్చి వీరికి ఈ విషయం గురించి ఏమాత్రం కంగారు పడవద్దు. ఈ తల్లి ఒకనొక శుభముహూర్తాన ఒక దివ్య సంఘటనతో కనులు తెరుస్తుంది అన్నాడు.

ఈ విషయం కీర్తి యశోదకు చెప్పింది. ఇంతలో కన్నయ్య ముందుకు వచ్చి పాపను నా చేతులకి ఇవ్వండి అన్నాడు. కన్నయ్య చిన్న పిల్లవాడు కావడంతో ఆ పాపను కన్నయ్య చేతిలో పెట్టడానికి కీర్తి కాసేపు తటపటాయించింది. కాని కన్నయ్య గట్టిగా మారాం చేయడంతో పాపను అతని చేతిలో పెట్టక తప్పలేదు.

పాప అలా కన్నయ్య చేతిలో తీసుకోగానే ఒక్కసారిగా కళ్ళ తెరిచింది. అక్కడ ఉన్నవారందరూ ఆశ్చర్యపోయారు. రాధకు తెలుసు తాను ఈ భూమిమీద జన్మించిన తరువాత ముందుగా తన కన్నయ్యనే చూడాలి అని! అంతటి దివ్య ప్రేమబంధం వారిది. రాధాదేవి అలా కళ్ళ తెరవడమే కాకుండా ఎంతో చక్కగా కన్నయ్య వంక చూస్తూ ముసి ముసి నవ్వులు చిందిస్తోంది.

ఈ దృశ్యం చూసిన వృషభానుడు, కీర్తి దంపతులకు, యశోద, నంద దంపతులకు ఎంతో ఆనందం కలిగింది. యశోద, నందుడు కన్నయ్యతో వీరింటినే నాలుగు రోజులు ఉన్నారు. ఆ నాలుగు రోజులు కన్నయ్యకు రాధతోనే లోకం ఊయల చుట్టూ చేరి ఆ పాపని ఎన్నో విధాలా

ఆడిస్తూ ఎంతో ముద్దు చేసాడు. రాధ కూడా కాళ్ళు చేతులు ఆడిస్తూ మురిసిపోతుంది. అటు తరువాత వారు తిరిగి గోకులానికి అందరూ వెళ్ళారు.

ఈ విధంగా కన్నయ్య నాతో రాధాదేవి జన్మ వృత్తాంతాన్ని ఎంతో ఆనందంతో చెప్పాడు. ఆహా ఈ రాధాకృష్ణుల ఇద్దరి దర్శనంతో నా జన్మ ధన్యమైంది. ఇది చదువుతున్న మనందరి జన్మ ధన్యమైంది. రాధాకృష్ణులు మొట్టమొదటిసారి కలుసుకున్న ఈ వృత్తాంతం విన్నవారికి అమితానందం కలుగుతుంది. సర్వసౌభాగ్యాలు కలుగుతాయి, సర్వసంపదలు లభిస్తాయి. కృష్ణుడి నామం ఎంత మధురమో రాధా నామం కూడా అంతే మధురం! కేవలం రాధాదేవి నామాన్ని ఒక్కసారి స్మరించినా ఎంతో గొప్ప ఐశ్వర్యం లభిస్తుంది! శరీరమంతా ఆనందంతో పులకరిస్తుంది.

ఇలాగే కృష్ణనామం కూడా ఎంతో శక్తివంతమైంది. కొన్ని వేల విష్ణు నామాలకంటే ఒక్క కృష్ణనామం ఎంతో పుణ్యఫలం ఇవ్వగలదు. కృష్ణుడు అంటే సర్వజీవులను ఆకర్షించేవాడు అని అర్థం. మరి ఈ సృష్టి మొత్తాన్ని ఆకర్షిస్తున్నది ఆ కృష్ణనామమే, ఆ కృష్ణరూపమే కదా! ఎందరో యోగులను తరింపచేసింది ఈ కృష్ణనామమే! దేవతలందరూ కూడా కృష్ణనామ స్మరణతో ఎంతో ఆనందం పొందుతారు. సృష్టిలోని అన్నింటియందు వ్యాపించి ఉన్నది ఈ కృష్ణ స్వరూపమే! కృష్ణతత్వాన్ని పూర్తిగా గ్రహించినవారికి బ్రహ్మానందం లభిస్తుంది. ఆ తత్వం అర్థం చేసుకోవాలంటే మనకి ఆ స్వామి అనుగ్రహం కావాలి. రాధాకృష్ణుల నామస్మరణ ఎంతో విశిష్టమై యుగయుగాలుగా ఎందరినో తరింపచేస్తోంది. ఎందరికో బ్రహ్మజ్ఞానం, మోక్షం అనుగ్రహిస్తున్నది.

# 6

ఆరోజు కృష్ణయ్య ఉదయం నుంచి ఎంత సంతోషంగా ఉన్నాడో! ఆహా! ఏమి కేరింతలు! ఎంత ముద్దుగా ఉన్నాడు! అటూ ఇటూ ఇల్లంతా ఒకటే నవ్వుతూ పరుగెడుతున్నాడు. ఆ పురుషోత్తముడు ఇలా చిన్న చిన్న అడుగులతో తనపై పరుగెడుతుంటే ఆ భూదేవి మురిసిపోతుంది. కన్నయ్య ఆరోజు అంత ఆనందంగా ఎందుకు ఉన్నాడో యశోదకు అర్థం కావడంలేదు ఎందుకు నాన్నా! అలా పరుగెడుతున్నావు! పడతావు జాగ్రత్త అంటుంది.

ఇందాక చెప్పినట్లుగా యశోదకు కన్నయ్య ఎప్పటికీ సామాన్య పిల్లవాడే! తన ముద్దుల బిడ్డడే. కొందరు మహర్షులు వచ్చి ఈ పిల్లవాడు భగవంతుడి రూపం అంటే నవ్వేది ఇదంతా మీ అభిమానం, ముద్దు అని అనేది. కన్నయ్యను ఎంతో ముద్దుగా చూసుకునేది రంగు రంగుల బట్టలు వేసేది కాని ఏది సరిగ్గా ఉంచుకునేవాడు కాదు ఆ కొంటె కృష్ణుడు. ఆ కొంటె నవ్వు చూడండి ఎంత చిలిపిగా నవ్వుతున్నాడో!.

ఆహా! కృష్ణా! ఏం అదృష్టమయ్యా నాది! నీ దర్శన భాగ్యం చేత నా జన్మ ధన్యమయింది తండ్రి! రోజు నువ్వు నన్ను ఇలా పిలిచి గోకులానికి తీసుకెళ్ళి ఈ విశేషాలన్నీ దర్శింపచేస్తున్నావే!.

ఆహా ఎంతటి భాగ్యం నేను కొంచెం బద్ధకం చేస్తే చెయ్యిపట్టుకొని ద్వాపర యుగానికి తీసుకువెళతావు పద పద ఎన్నో కబుర్లు చెప్తాను గోకులం చూపిస్తాను పదా అని అంటావు అసలు నీ లీలలన్నీ నేను రాస్తున్నానా నువ్వు రాస్తున్నావా తెలయడంలేదు కలం పట్టుకున్నది నేనైనా నా చేయి పట్టుకొని రాయిస్తున్నది నువ్వేకదా!.

అబ్బా! ఈ రోజు నీ పింఛం ఎంత బాగుందో! నీ తలపై తన పింఛం చేరిన నెమలి ఎంత అదృష్టవంతురాలో కదా! ఈ పుస్తకం రాస్తున్నప్పుడు కృష్ణయ్య నన్ను అలా ద్వాపర యుగంలో గోకులంలోకి, బృందావనంలోకి తీసుకెళ్ళాడు. చుట్టూ వేరే ఏది నాకు కనిపించడంలేదు కృష్ణ తత్వమే అంతటి ప్రేమమయం. తాను తప్ప ఇంకేది మనకు కనిపించదు ఆనందం అంతా ఆ స్వరూపంలోనే! ఆ తత్వంలోనే!

ఒక్కోరోజు నేను మధ్యాహ్నం వేళ పడుకున్నప్పుడు మంచం ఎక్కి చేయిపట్టుకొని పదపద రాద్దాము అంటాడు. అసలు ఆ స్పర్శ ఎంత మధురం? మాటలతో, అక్షరాలతో వర్ణించలేను! ఈ ముల్లోకాలను పాలిస్తున్న ఆ పరబ్రహ్మం తత్వం అలా నన్ను తాకగానే గొప్ప తేజస్సు శరీరమంతా ప్రవహిస్తుంది ఎంతో గొప్ప శక్తి వస్తుంది. ఇద్దరం కూర్చొని ఒక్కసారిగా గోకులంలోకి వెళ్ళిపోతాం.

నేను కన్నయ్య ఆ గోకులమంతా తిరుగుతూ ఎన్నో అద్భుత దృశ్యాలు చూస్తున్నాము. యశోద, నందులు, గోపకాంతలు, ఎందరో యాదవులు, పురివిప్పి నృత్యం ఆడుతున్న నెమళ్ళు, అటూ ఇటూ గెంతుతున్న లేగ దూడలు, పక్కనే పొదలలో చెంగు చెంగున ఎగురుతున్న కుందేళ్ళు గోకులం అంతా ఎంత అద్భుతంగా ఉంది. కన్నయ్య తేజస్సు అక్కడ ప్రతీ

దాంట్లో ప్రకాశిస్తోంది ఇలా ఇద్దరం ఆ గోకులంలో తిరుగుతూంటే ఒక్కొక్కసారి కన్నయ్యే నేను, నేనే కన్నయ్యలా కనపడతాం. ఆ కన్నయ్య మధురతత్వం అంతటిది! మనం ఎప్పుడైతే పూర్తి ప్రేమ భావంతో ఉంటామో అతడు మనలో ప్రవేశిస్తాడు. ఆ అద్భుత తత్వం అనుభవిస్తే ఇంక మనకి ఏదీ కావాలని అనిపించదు.

ఒకరోజు గోకులంలో ఇద్దరం తిరుగుతుంటే ఒక గోపబాలుని చూపించి ఇదిగో! ఇదే నువ్వు! అప్పటి ద్వాపరయుగంలో నువ్వు నాతోనే ఉన్నావు అన్నాడు. ఆహా! ఎంత భాగ్యం! ఆ గోపబాలుడు రంగు రంగుల గుడ్డలు కట్టుకొని భలే ముచ్చటగా ఉన్నాడు. కన్నయ్య అతడిని చూపించి ఇదిగో ఇది నువ్వే! అన్నాడు. నేనతడిని ఎంతో ముచ్చటపడి చూస్తూంటే ఆ బాలుడు ఒక్కసారి కన్నయ్యగా మారిపోయాడు.

ఇది నిజమా భ్రమా! అనుకుంటుండగానే కన్నయ్య నా పక్కనే చిన్నగా నవ్వుతూ కనబడేవాడు! నేను ఆశ్చర్యపోతుంటే అదీ నేనే! ఇదీ నేనే! అలాగే అదే నువ్వు! అదే నేను! అనేవాడు. నేను కన్నయ్యను అలా చూస్తూంటే ఎంతో తేజస్సుతో నవ్వుతూ పదపద! మనిద్దరం ఒక్కటే! మన పుస్తకంలోకి వెళదాం అనేవాడు.

ఆరోజు గోకులం అంతా చాలా హడావిడిగా ఉంది. ఒక దూరపు ఊరినుంచి ఒక చిత్రకారుడు వచ్చాడు. గోకులంలో చిన్న పిల్లలతో ఆడుకుంటూ వారు చెప్పే కబుర్లు వింటూ ఎంతో ముచ్చటపడుతున్నాడు. మీరంతా ఎంత ముద్దుగా ఉన్నారు అనుకుంటున్నాడు. అసలు ఈ ప్రదేశమంతా ఎంత ఆనందంతో నిండి ఉంది అని ఆశ్చర్యపోతున్నాడు.

బహుశా ఏ దేవతలైనా ఇక్కడ అదృశ్య రూపంలో తిరుగుతున్నారా? ఏమిటి? ఇక్కడ ప్రతీ చెట్టు ప్రతీ రాయిలోను ఒక తేజస్సు కనిపిస్తుంది. ఏమిటీ అద్భుతం అనుకుంటున్నాడు ఆ చిత్రకారుడు. కొంతమంది పిల్లల చిత్రాలు వేసి వారి తల్లితండ్రులకు ఇచ్చాడు. వారు ఆ చిత్రాలను చూసి ఎంతో మురిసిపోయారు.

ఆ చిత్రకారుడు అటూ ఇటూ తిరుగుతూ యశోద ఇంటి పరిసరాల్లోకి వచ్చాడు. అక్కడ గోపబాలురు అటూ ఇటూ తిరుగుతూ ఆడుతున్నారు. వారిలో ఒక పిల్లవాడు ఎంతో తేజస్సుతో ఉండటం గమనించాడు. అతనే మన కన్నయ్య! ఆ చిలిపి కళ్ళు, ఆ అద్భుతమైన చిలిపి చిరునవ్వు!.

అటూ ఇటూ ఎగురుతూ ఆడుతుండడం వలన చిందరవందరగా ఉన్న జుట్టు! మధ్యలో నెమలి పింఛం! చక్కటి నీలవర్ణం!...మట్టిలో ఆడటంతో ఆ మట్టి కన్నయ్య శరీరంపై పడి నీలవర్ణంతో కలిసి ఇంకొక అద్భుతమైన రంగుతో ప్రకాశిస్తోంది. అంతకు ముందే వెన్న తిన్నట్లున్నాడు ఆ పెదవులపై అక్కడక్కడ ఇంకా చిక్కటి మీగడ తరకలు అక్కడక్కడ అంటుకొని ఎంతో దివ్యంగా, ఎంతో ముద్దుగొలిపేలాగా ఉన్నాయి.

ఈ చిత్రకారుడు ఆ పిల్లవాడి వంకే అలా కన్నార్పకుండా చూస్తుంటే అక్కడకి యశోద వచ్చింది. ఎవరయ్యా నువ్వు! మా పిల్లవాడిని అలా చూస్తున్నావు? దిష్టి తగిలేలా ఉంది అంది అప్పుడా చిత్రకారుడు నా పేరు దేవశర్మ. పొరుగూరు నుంచి వచ్చాను చిన్నప్పటినుంచి చిత్రకళ అంటే ఎంతో ఇష్టం అదే నా జీవనోపాధి కూడా! నా చిత్రాలు వేయించుకున్నవారు ఎంతిస్తే అంత తీసుకుంటాను. నాకు కుటుంబం లేదు. ఒంటరి వాడిని. ఇలా ఊళ్ళ వెంబడి తిరుగుతూ ప్రకృతితో కలిసి ఆనందిస్తూ ఇలా చిత్రాలు వేసుకుంటాను.

ఒక్కోసారి ఏ ధనవంతుడో నా చిత్రాలు చూసి ఒక సంవత్సరానికి సరిపడా సొమ్ము ఇస్తాడు. నాకు శ్రీమన్నారాయణుడు అంటే ఎంతో భక్తి ఇదంతా ఆ శ్రీమన్నారాయణుల వారి అనుగ్రహం గానే భావిస్తాను. నాకు లభించే ప్రతీ కాసు ఆ స్వామి అనుగ్రహమే అని నమ్ముతాను అని యశోదమ్మతో చెప్తూ మీ గొల్లవాడలో కొందరు వారి పిల్లల చిత్రాలు వేయించుకున్నారు. కాని ఈ పిల్లవాడిని చూస్తే మీరు అడగకుండానే నాకు ఇతని చిత్రం వెయ్యాలి అనిపిస్తుంది. నాకు ఆ అవకాశం ఇస్తారా అన్నాడు.

దానికి యశోద వద్దు వద్దు అలా పిల్లవాడి చిత్రం వేస్తే ఎంతమంది దృష్టి నా కన్నయ్యకు తగులుతుందో అని అంది. ఆ తల్లిది అపారమైన మాతృప్రేమ. ఏ చిన్నది తేడా వచ్చినా తన కన్నయ్య ఎక్కడ నలిగిపోతాడో అని భయం.

దానికి ఆ చిత్రకారుడు సమాధానమిస్తూ అలా ఎందుకను కుంటావు తల్లీ! ఈ చిత్రం చక్కగా ఇంట్లోనే ఉంచుకోండి. రేపు మీ పిల్లవాడు పెద్దయితే చిన్నప్పటి మీ కన్నయ్య ఎంత ముద్దుగా ఉన్నాడో చూసుకోవచ్చు కదా అని అన్నాడు. ఇదేదో యశోదకు నచ్చింది అవును నేను పెద్దయ్యాక నా చిన్ని కన్నయ్యను తల్చుకుంటే మతిమరుపు వచ్చి ఇప్పటి ఈ ముద్దుల రూపం గుర్తుకురాకపోతేనో! యశోదమ్మ ఇలా తలచి సరే నాయనా మా కన్నయ్య బొమ్మకూడా వెయ్యి కానీ చాలా బాగుండాలి సుమా అంది.

ఇది విన్న దేవశర్మ ఎంతో సంతోషించాడు. యశోద కన్నయ్యను పిలిచి కన్నా! ఈయన నీ బొమ్మ వేస్తారుట! కదలకుండా అలా కూర్చో! అంది ఓ అలాగే! అమ్మా! అస్సలు కదలకుండా కూర్చుంటాను అన్నాడు కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ. కన్నయ్య దేవశర్మతో నేను బొమ్మ వేయించుకుంటాను కానీ ఒక్క విషయం నాతోపాటు నా స్నేహితులు కూడా ఈ చిత్రంలో ఉండాల్సిందే అని అక్కడున్న నలుగురు గోప బాలురుని చూపించాడు. యశోద కన్నయ్యతో ఇదేమిటి తండ్రీ! నీవొక్కడివే చిత్రంలో ఉండాలని అనుకుంటున్నాను. మళ్ళీ వీరంతా ఎందుకు? అన్నది. అందుకు కన్నయ్య లేదమ్మా వీళ్ళందరూ ఉండాల్సిందే అన్నాడు. చివరికి యశోదకు అవును అనుకుండా తప్పలేదు.

దేవశర్మ తన వద్దనున్న కుంచెలను, రంగులను తీసి అక్కడున్న ఒక పెద్ద రాతి బండపై కూర్చున్నాడు. ఎదురుగా కన్నయ్య, నలుగురు గోప బాలురు అటూ ఇటూ తిరుగుతూ ఏవో కబుర్లు చెప్పుకుంటూ ఉన్నారు. అప్పుడు దేవశర్మ వారితో పిల్లల్లారా ఒక్క అరగంట కదలకుండా ఉండండి మీకు చక్కటి చిత్రం గీసి ఇస్తాను. కదలకుండా ఉంటే మీరందరూ ఎంతో ముద్దుగా ఈ చిత్రంలో వస్తారు అన్నాడు. అప్పుడు అందరూ కదలకుండా కూర్చున్నారు.

దేవశర్మ వారి చిత్రం వేయటం మొదలు పెట్టాడు. దేవశర్మ వేషం కూడా ఎంతో విచిత్రంగా ఉండి కన్నయ్యకు, ఆ పిల్లలకు ఎంతో ముచ్చట కలిగిస్తోంది. తలపై రంగురంగుల గుడ్డను చుట్టుకున్నాడు చేతులకు కంకణాలు పెట్టుకున్నాడు. ఒక కాషాయ రంగు చొక్కాలాంటిది ధరించాడు. మెడలో రంగు రంగుల పూసల దండలున్నాయి. మొఖం పై చిన్న మీసం ఎంతో చురుకైన కళ్ళు చాలా తమాషాగా ఉన్నాడు. పిల్లలు ఇతన్ని చూసి ముచ్చట పడుతూ మధ్య మధ్యలో  నవ్వు ఆపుకోలేకపోతున్నారు. కన్నయ్య వారిని నవ్వవద్దని వారించాడు.

దేవశర్మ వద్ద ఏవో పక్షుల ఈకలు ఉన్నాయి. వాటిని తన పక్కన పెట్టుకున్న రంగుల సీసాల్లో అద్ది నెమ్మదిగా చిత్రం వేయడం ప్రారంభించాడు. ముందు ఎదురుగా ఎంతో ముచ్చటగా ఉన్న కన్నయ్యని వేద్దామని ప్రారంభిస్తే సరిగా కుదరడం లేదు. సరే ముందుగా ఈ పిల్లవాళ్లని చిత్రిద్దాము అని తలచి ఒకొక్కరిని చిత్రించడం మొదలు పెట్టాడు. ఆ పిల్లలు కూడా ఎంతో ముద్దుగా ఉండడంతో దేవశర్మకు చిత్రం ఎంతో ఉత్సాహంగా ముందుకు సాగుతోంది. అలా కాసేపటికల్లా వారందరినీ చిత్రించాడు. పిల్లలకి ఇటొచ్చి తమ బొమ్మ చూసుకుందామని అనిపించింది దేవశర్మ ఇప్పుడే కాదు పూర్తిగా వేసాక చూపిస్తానని వారితో అన్నాడు.

ఇక కన్నయ్య చిత్రం మొదలుపెట్టాడు. కన్నయ్య వంక చూసి ఇటు పటంపై చిత్రం వేసేలోపు ఆ రూపం తన మదిలోనుంచి వెళ్ళిపోతోంది. అలా చూసి తల ఇలా తిప్పగానే ఆ రూపం మాయమౌతోంది. ఏమిటి ఇలా అవుతోంది అని ఆశ్చర్యపోయాడు! ఇన్ని వేల చిత్రాలు గీసిన ఎప్పుడూ ఇలా కాలేదు ఇదేమిటి ఈ పిల్లవాడి రూపం ఒక్క క్షణంలో మాయమౌతోంది ఏమిటి అని ఎంతో ఆశ్చర్యపోయాడు. ఇన్ని వేల మంది చిత్రాలు గీసిన తాను ఈ చిన్న పిల్లవాడి చిత్రం వేయలేకపోతున్నానేమిటి అని పట్టుదల వచ్చి మళ్ళీ ప్రయత్నించాడు. ఊహూ! ఏ మాత్రం సరిగ్గా రావడం లేదు ఇదేమి విచిత్రం! దేవశర్మకు ఇదేమిటో అంతు పట్టడం లేదు! ఈ పిల్లవాడి బొమ్మ ఎందుకు వెయ్యలేకపోతున్నాను. ఇతను సామాన్యుడిలాగా లేదు అనుకున్నాడు.

ఇలా ఆలోచిస్తుండగా కన్నయ్య ఒక్క ఉదుపున దేవశర్మ వద్దకు వచ్చి ఏది నా చిత్రం అని అడిగాడు. నా స్నేహితుల బొమ్మలు ఉన్నాయి కాని నా బొమ్మలేదే అని దేవశర్మ ముఖంలోకి చిలపిగా చూస్తూ అడిగాడు. ఆ నవ్వులో దేవశర్మకి ఎంతో దైవత్వం కనిపించింది దేవశర్మని ఒక మాయ కప్పేసింది. కృష్ణమాయ! శ్రీమన్నారాయణుని రూపం ఒక్కసారి కన్నుల ముందు మెరిసింది అంతే అర్థమయింది! తండ్రీ నువ్వెవరో కాదు చిన్న పిల్లవాడిలా నన్ను భ్రమింపచేసిన నీవు ఆ శ్రీమన్నారాయణుడివే! ఆ పరంధాముడివే! దేవశర్మకు అంతులేని ఆనందంతో కన్నుల వెంట నీటిధార కారింది. దేవశర్మ జన్మ ధన్యమయింది అని తలిచాడు. తండ్రీ నన్ను కరుణించి నీ చిత్రం వెయ్యనివ్వు నన్ను అనుగ్రహించు అలా ఆనందంతో కన్నీటి ధారతో కన్నయ్యను అర్థించాడు.

కన్నయ్య చిన్నగా నవ్వుతూ అతడి చెంపలపై కారుతున్న కన్నుల నీరు చేతితో తుడిచి ఇంక బొమ్మ వెయ్యడం ప్రారంభించు చక్కగా వస్తుంది అని వెనక్కి పరుగెత్తాడు. దేవశర్మ తాను చిత్రం వేస్తున్న ఆ ఈకను కన్నులకు అద్దుకొని మనస్సులో శ్రీమన్నారాయణుడికి నమస్కరించి అక్కడ ఉన్న రంగు సీసాలో అద్ది కన్నయ్య చిత్రం వెయ్యడం ప్రారంభించాడు. అంతే ఇందాక ఏ మాత్రం కుదరని ఆ బొమ్మ ఇప్పుడు అద్భుతంగా ముందుకు సాగిపోతోంది. కన్నయ్య, పక్కన నలుగురు గోప బాలురు చిత్రంలో ఎంతో గొప్పగా కనబడుతున్నారు. ఆ చిత్రం చూసి దేవశర్మ ఎంతో మురిసిపోయాడు ఒక్కసారి తల వంచి కృష్ణ పాదాల వద్ద ఆ చిత్రానికి తగలకుండా నమస్కారం చేసాడు. ఎందుకంటే అప్పుడే అద్దిన రంగులు తన తల తగిలితే చెదిరిపోతాయని పురుషోత్తముడైన ఈ కన్నయ్య పాదాలకు తల తాకించే అర్హత తనకు లేదని అనుకున్నాడు. ఇంతలో కన్నయ్య ఈ ఆలోచనలలో ఉన్న దేవశర్మ బుగ్గపై ముద్దుపెట్టాడు. హటాత్తుగా జరిగిన ఈ పరిణామానికి దేవశర్మ ఉబ్బి తబ్బిపైపోయాడు.

అయితే ఆశ్చర్యంగా ఈ జరిగిన విషయం అంతా దేవశర్మ మరిచిపోయాడు. ఒక్కసారిగా మళ్లీ కృష్ణమాయ కప్పేయడంతో కన్నయ్య తనకు శ్రీమన్నారాయణుడిలా దర్శనం ఇవ్వడం ఈ విశేషమంతా మరిచిపోయాడు. ఇంతలో లోపలినుంచి నందుడు, యశోద వచ్చారు. ఇద్దరు ఎంతో ఆసక్తిగా ఆ చిత్రం వద్దకు వచ్చి ఎంతో మురిసిపోయారు. ఆహా! కన్నయ్య ఎంత ముద్దుగా ఉన్నాడు అని ఎంతో ఆనందించారు ఆ చిత్రకారుని ఎంతో పొగిడారు. ఆ చిత్రకారుడికి కొంత సొమ్ము, కొత్తబట్టలు ఇచ్చారు. దేవశర్మ ఎంతో సంతోషించాడు బట్టలు తీసుకుంటాను గాని ధనం ఇవ్వకండి అన్నాడు. ఇంతటి ఆనందం నాకు ఇన్ని వేల చిత్రాలు గీసినప్పుడు ఎప్పుడూ కలుగలేదు అని వారితో అన్నాడు. కాని నందుడు యశోద ధనం తీసుకోవలసిందే అని పట్టుబట్టడంతో దేవశర్మకు తీసుకోక తప్పలేదు. కన్నయ్య దేవశర్మ వంక చూస్తూ ముద్దుగా నవ్వాడు దేవశర్మ కన్నయ్యను ముద్దు పెట్టుకొని నందుడు, యశోదల వద్ద శెలవు తీసుకొని ముందుకు సాగాడు.

యశోదమ్మ ఆ చిత్రాన్ని ఇంట్లో గోడకు తగిలించుకుంది. ఆహా! ఎంత ముద్దుగా ఉన్నాడు కన్నయ్య అనుకుంది. రోజు నాలుగైదు సార్లు ఈ చిత్రం చూసుకొని ఎంతో మురిసిపోతుండేది. శ్రీమన్నారాయణుల వారి అనుగ్రహంతో కృష్ణయ్యగా జన్మించినప్పుడు తన చిన్ననాటి చిత్రం గీసిన అనుగ్రహంతో దేవశర్మ ఆ తరువాత కలియుగంలో జన్మించి ఒక జన్మలో అద్భుత చిత్రకారుడిగా పేరు సంపాదించాడు. ఆనాడు కన్నయ్య కరుణ కలుగడంతో ఈ కలియుగంలో ఎందరో దేవతామూర్తుల చిత్రాలు అద్భుతంగా చిత్రీకరించాడు. ఆనాడు దేవశర్మ గీసిన కన్నయ్య చిన్ననాటి చిత్రం ఇప్పటికి యోగులకు, సాధకులకు, కృష్ణునిపై అచంచలమైన, స్వచ్ఛమైన భక్తి కలిగిన వారికి దర్శనమిస్తూ ఉంటుంది. ఆ చిత్రం ఇప్పటికి ఒక కృష్ణ భక్తుని వద్ద ఉంది. అయితే ఆ భక్తుడు ఎవరన్నది మనం ఎరుగము.

ఆనాటి నుంచి నేటి వరకు ఆ అద్భుత చిత్ర రాజం ఒక భక్తుని తరువాత మరొక భక్తునికి అందుతూ కేవలం ఆ భక్తునికి తప్ప వేరొకరికి కనపడక అదృశ్య రూపంలో ఉంటుంది. మధ్యకాలంలో అంత గొప్ప కృష్ణ భక్తుడు జన్మించినప్పుడు ఆ చిత్రం బృందావనంలో అదృశ్య రూపంలో ఉంటుంది. మళ్ళీ తననే పూర్తిగా నమ్మి సర్వం తనకి ధారపోసే భక్తుడు ఈ భూమిపై జన్మించినప్పుడు కన్నయ్య ఈ చిత్రాన్ని ఆ ప్రియ భక్తుని వద్దకు చేరుస్తాడు. ఈ చిత్రం మనం చూడనప్పటికి మనస్సులో ఊహిస్తే చాలు మనం ఎన్నో జన్మలలో చేసిన పాపాలు నశిస్తాయి. మన జీవితం శుభప్రదంగా జరుగుతుంది. ఆ దేవశర్మ త్రేతాయుగంలో కూడా జన్మించి శ్రీరామచంద్రుని పట్టాభిషేక చిత్రాన్ని కూడా ఎంతో అద్భుతంగా చిత్రీకరించాడు. అతడు శ్రీమన్నారాయణుల వారికి అత్యంత ప్రీతి పాత్రుడై కాల గమనంలో అప్పుడప్పుడు జన్మిస్తూ ఎంతో గొప్ప దైవత్వం ఉట్టిపడే ఎన్నో అద్భుత దేవతా చిత్రాలను చిత్రీకరిస్తూ జీవిస్తున్నాడు.

# 7

కృష్ణయ్య రోజూ బృందావనంలో అలా తిరుగుతూ ఎన్నెన్ని లీలలు చూపిస్తున్నాడో అసలు ఆ కన్నయ్య అందం చూడండి! ఈ సృష్టిలోని అందం ఇన్ని అద్భుత రూపాలు కూడా సంతరించుకుంటుందా అని ఆశ్చర్యమేస్తుంది. తన భక్తులకు వారి వారి భావాలకు తగ్గట్టుగా అటువంటి అందమైన రూపంతో వారికి దర్శనమిచ్చి, వారిని ఆనందింపజేయడం కన్నయ్యకు పెద్ద ముచ్చట. కృష్ణయ్య గోప బాలురితో కలిసి గోకులంలో తిరుగుతూ అలా వేణువూదుకుంటూ పరుగెడుతూ ఉంటే గోపికలందరూ ఎంతో ముచ్చట పడుతున్నారు. కృష్ణయ్య అందానికి ముగ్ధులు అవుతున్నారు. ఈ పిల్లవాడిని చూస్తూంటే తనకు మాటల్లో వర్ణించలేని ఇంత ఆనందం ఎలా కలుగుతోంది? ఇలా తదేకంగా కన్నయ్యనే చూస్తూ ఉండిపోవాలనిపిస్తుంది.

మన కన్నయ్య అందం అటువంటిది! ఆ చిలిపి కళ్లు చూడండి! ఒక పక్క చిలిపితనం మరొక పక్క ఎంతో ప్రేమ నిండిన కళ్ళు. ఆహా! కన్నయ్య

ఒక్క నీ కళ్ళు చాలయ్యా! మా ఒళ్ళు మరచిపోయేలా చెయ్యడానికి! ఏమి అందం! ఏమి ఆకర్షణ! ఆ కళ్ళలో ఎన్ని భావాలు! ప్రేమ, ఆకర్షణ, వేదాంతం, వైరాగ్యం... అసలు ఏ భావం లేదని చెప్పగలం ఆ కన్నయ్య కన్నులలో! జగత్ మొత్తానికి పరమ గురువు, ఆనంద ప్రదాత కన్నయ్యనే! వేదాంత, వైరాగ్య ప్రదాత కూడా ఆ కన్నయ్యనే! ఆ కన్నయ్యను దర్శించిన వారికి ఆ తత్వం పూర్తిగా అనుభవించిన వారికి ఇక ఈ ప్రాపంచిక విషయాలన్నీ తృణప్రాయాలే! ఎవరికీ ఏ భావంలో దర్శనమియ్యాలో ఎవరికి ఏ తత్వం అనుగ్రహించాలో అదికూడా ఏ జన్మలో ఎప్పుడు అనుగ్రహించాలో ఆ పురుషోత్తమునికి పూర్తిగా తెలుసు.

ఆ రోజు కన్నయ్య గోప బాలురుతో కలిసి అటూ ఇటూ పరుగెడుతూ గోకులంలో వీధులలో వెళ్తున్నాడు. నడుముకు కట్టుకున్న వస్త్రంలో ఆ వేణువును ఎంత ముచ్చటగా దోపుకున్నాడో చూడండి! కన్నయ్య అటూ ఇటూ ఎగురుకుంటూ నడుస్తుంటే ఆ వేణువు జారిపోతుంటే తిరిగి గట్టిగా దోపుకుంటున్నాడు. ఆ దృశ్యం చూడడానికి ఎంత ముచ్చటగా ఉందో! ఆ వేణువు ఎంత పుణ్యం చేసుకుందో! ప్రపంచంలో ఎన్నో చోట్ల వెదురు చెట్లు ఉంటాయి కాని ఆ పురుషోత్తముని చేతిలో వేణువుగా మారిన ఆ వెదురు ఎంత పుణ్యం చేసుకుందో!

ఆ వేణువుకూడా ఎంత అందంగా ఉందో చూడండి! ఆ పరంధాముని స్పర్శ తగిలితే అందం, ఆకర్షణ రానిది ఈ సృష్టిలో ఏది ఉంటుంది? ఆ స్పర్శకోసమే కదా మునీశ్వరులు, మహాయోగులు గోకులంలో గోపకాంతలుగా జన్మించింది. రోజూ కన్నయ్యతో ఆడుతున్న ఆ గోపబాలురు గత జన్మలలో ఎంతో పుణ్యం చేసుకున్నారు కదా! వీరిలో కొందరు మహర్షులే ఇంతకు ముందు యుగాలలో ద్వాపరయుగంలో కృష్ణునిగా జన్మించినప్పుడు తనతో తిరిగే భాగ్యం ఇమ్మని అర్థించినవారు. మరికొందరు గోప బాలురు కొందరు దేవతలే ఇలా సామాన్య మానవులుగా గోకులంలో జన్మించినవారు. మరికొందరు తమ పూర్వజన్మలలో కృత త్రేతా యుగాలలో ఎన్నో గొప్ప

పుణ్యకార్యాలు చేసినవారు. అంత గొప్ప పుణ్యం సంపాదించుకొనడం చేత ద్వాపరయుగంలో శ్రీకృష్ణులవారు ఉన్న సమయంలో గోకులంలో గోప బాలురుగా జన్మించారు.

ఆ రోజు కన్నయ్యతో పాటు ఒక పదిమంది గోపబాలురు ఆడుతూ పాడుతూ తిరుగుతున్నారు. ఇంతలో కన్నయ్య వాళ్ళతో మనమందరం ఇక్కడ కూర్చొందాము. అని ఒక చోట కూర్చున్నారు అక్కడ పచ్చిక అంతా ఎంతో ఆకుపచ్చ రంగులో ఉంది. ఉదయం పడిన చిరుజల్లుకు ఆ పచ్చిక తడిసి అక్కడక్కడ నీటి బిందువులతో మెరుస్తూ ఎంతో అద్భుతంగా ఉంది ఆ దృశ్యం!

అక్కడ కన్నయ్య ఒక రాతిపై కూర్చొని  వేణువుని తీసుకొని నెమ్మదిగా ఊదడం ప్రారంభించాడు. అసలు కన్నయ్య వేణువుని పట్టుకున్న ఆ భంగిమను చూడండి. ఎంత అద్భుతంగా ఉందో ఆ వేణువు ఊదుతుంటే వస్తున్న ధ్వని తరంగాలు చెవులకు ఎంత ఇంపుగా ఉన్నాయో ఆలకించండి. ఆ అద్భుత వేణుగానంలో ప్రకృతి మొత్తం పరవశించిపోతుంది. ఒక కాలిపై మరొక కాలు వేసుకొని కనులు మూసుకొని వేణువు ఊదుతున్న ఆ కమనీయ దృశ్యం చూడండి!.

కన్నయ్య చేతికి ఉన్న కడియాలు చూడండి! కన్నయ్య చుట్టుకున్న రంగు రంగుల దారాలు చూడండి! తలపై ఆ పింఛం చూడండి! ఇంక ఆ వేణునాదం వినండి! ఆ వేణు నాదంతో మన శరీరాలన్నీ ఒక దివ్యతేజస్సుతో నిండిపోయినట్లు అనిపిస్తుంది. అసలు అది వేణునాదమా! వేదనాదమా! సర్వవేదసారము అలా వేణునాదంలో ఆ ధ్వనిలో ప్రవహిస్తోంది. అంతే కాదు ఈ సృష్టిలోని శబ్ద మాధుర్యం మొత్తం ఆ వేణునాదంలోనే ఉంది.

కన్నయ్య అలా కూర్చొని వేణువు ఊదుతూ ఉంటే గోప బాలురి రూపంలో జన్మించిన మహర్షులందరికీ వేదసారమే అలా వినిపిస్తుంది. చిన్న పిల్లలుగా ఉన్నప్పటికీ వారి ఆత్మలు ఆ పురుషోత్తముని గ్రహిస్తున్నాయి. అయితే మాయ కప్పేయడం వల్ల వారికి భౌతికంగా తెలియడం లేదు. శరీరం

మైమరచి వింటున్నారు. చాలా బాగుంది అనుకుంటున్నారు కానీ వారి ఆత్మలు సత్యం గ్రహిస్తున్నాయి. అసలు ఈ సత్యం, ఈ పరమార్థం, ఈ స్పర్శానుభవం, ఈ తత్వానుభవం కోసమే కదా తాము ఈ జన్మలో ఇలా గోకులంలో జన్మించినది!

ఆ వేణునాదానికి ప్రకృతి మొత్తం పరవశిస్తుంది అని చెప్పాను కదా! అదిగో ఆ చిన్ని కుందేలును చూడండి కన్నయ్య దగ్గరకు ఎలా చేరిందో! అదుగో ఆ జింకపిల్లను చూడండి ఆ జింకపల్లి కన్నయ్య వేణునాదం విని చెంగు చెంగున గంతులు వేస్తూ అక్కడే తిరగసాగింది. ఆ నెమళ్ళు ఎలా ఎగిరివచ్చాయో చూడండి! ఇదిగో ఈ కోకిలలు ఎక్కడినుంచో వచ్చి పక్కనే చెట్టుపై వాలాయి. అక్కడ చెట్టుపై దూకుతున్న ఆ కోతులను చూడండి! ఇక్కడ కన్నయ్య వేణువు ఊదడం ప్రారంభించగానే ఎంతో నిలకడగా ఒక కొమ్మపై కూర్చొని ఎటూ కదలకుండా ఎలా వింటున్నాయో. సర్వ ప్రాణకోటి ఆ వేణునాదానికి ఎలా పరవశమవుతోందో చూడండి! ఈ దృశ్యం చూస్తున్న మన జన్మ ఎంత ధన్యమయిందో కదా!

కన్నయ్య వేణువూదుతూంటూ వచ్చే ధ్వని తరంగాలు మన శరీరాన్ని మనస్సుని తాకుతూ ఉంటే ఎంతో పరవశమౌతున్నాము. మనం చేసుకున్న ప్రారబ్ధకర్మ కూడా ఎంతో తేలికగా అనిపిస్తున్నది. ఇంతలో అక్కడ ఉన్న కేశవుడు అనే గోపబాలుడు కన్నా ఒక్కసారి ఆ వేణువు నాకు ఇవ్వవా నాకు కూడా ఊదాలని ఉంది అని అన్నాడు. కన్నయ్య చిరునవ్వుతో కేశవుడికి తన వేణువు ఇచ్చాడు. కేశవుడు ఎంతో ఆనందపడి ఆ వేణువు తీసుకొని ఊదసాగాడు. కృష్ణా నువ్వు ఊదినట్లు నాకు రావడం లేదు అని అన్నాడు అప్పుడు కన్నయ్య ఏది ఒకసారి ఇలా ఇవ్వు అని ఆ వేణువు తీసుకొని ఒక్కసారి ఊది తిరిగిచ్చాడు. ఇదిగో కేశవ ఇప్పుడు ఊదు ఎంత బాగుంటుందో అని అన్నాడు అంతే! ఈ సారి కేశవుడు తన పెదవులపై ఆ వేణువు ఆనించగానే ఎంతో అద్భుతంగా పలకసాగింది. కేశవుడు ఆ వేణువుని ఊదుతూ మైమరచిపోయాడు.

కేశవుడు అలా ఊదుతుంటే మిగిలిన పిల్లలు అందరూ తమ రెండు చేతులు ముఖానికి ఆనించి వినసాగారు. కన్నయ్య కేశవుడుతో నువ్వు కూడా నాలాగ ఎంతో చక్కగా ఊదావు అన్నాడు. కేశవుడు ఎంతో ఆనందించి ఆ వేణువును తిరిగి కన్నయ్యకు ఇచ్చాడు. కన్నయ్య దగ్గర వేణువుని ఊదిన ఆ కేశవుడు ఎంతటి భాగ్యం చేసుకున్నాడు. అతడు తర్వాత జన్మలలో కలియుగంలో జన్మించి ఒక గొప్ప వేణుగాన విద్వాంసుడిగా ఎంతో పేరు పొందాడు. అదంతా ఒకప్పుడు ద్వాపరయుగంలో తాను కన్నయ్య వేణువును ఊదిన ఫలం. ఆ మహాభాగ్యం వలన ఇప్పుడు కలియుగంలో అతడు గొప్ప వేణుగాన విద్వాంసుడు అయ్యాడు.

# 8

నేను యుగాలన్నింటిని దర్శిస్తున్నప్పుడు కొన్ని ఆసక్తికర విషయాలు గమనించాను. అందులో ముఖ్యమైనది ఈ రోజు ఈ భూమి మీద ఉన్న జీవులన్నీ అన్ని యుగాలలోను ఉన్నవే. కోట్లాది జన్మల్లో వారి వారి పూర్వజన్మల ప్రారబ్ధ కర్మలు అనుభవిస్తూ ముందుకు సాగుతుంటాడు. అందుకే మనం నిత్యం ఇంత వైవిధ్యభరితమైన జీవితాలు మన చుట్టూ చూస్తూ ఉంటాము. ఇలా గడచిన 27 మహాయుగాలలోని కృత, త్రేత, ద్వాపర, కలియుగాలలో ఈ జీవులన్నీ ఎన్నెన్నో జీవజాతులలో జన్మించి, ఎన్నెన్నో సంస్కృతులలో, ఎన్నెన్నో ప్రదేశాలలో జన్మించి ఎన్నెన్నో కర్మలు చేస్తూ ఇదిగో ఈ రోజు ఈ జన్మలోకి వచ్చాము. ఇది కూడా ఒక ప్రయాణంలా భావించాలి.

ఈ జన్మలో వారు తమ ప్రారబ్ధ కర్మ కొంత అనుభవిస్తారు. తిరిగి వచ్చే జన్మలో వారు ఇంతకుముందు జన్మలలో చేసుకున్న ప్రారబ్ధ కర్మలలో

కొంతభాగం అనుభవించడానికి తిరిగి ఎక్కడో జన్మిస్తారు. అది ఎలా నిర్ణయింపబడుతుంది అంటే ఆ జీవి మళ్ళీ ఆ జన్మలో జీవించే 70 లేదా 80 సంవత్సరాలు, ఎన్ని సంవత్సరాలైనా సరే తాను ప్రోగుచేసుకున్న ఇంతటి కొండంత ఎత్తైన ప్రారబ్ధ కర్మలు కేవలం ఒక చిన్న రాయి మాత్రపు పరిమాణం కలిగిన ప్రారబ్ధ కర్మను ఈ జన్మలో అనుభవిస్తారు. తిరిగి మళ్ళీ ఆ ప్రయాణం కొనసాగుతూ ఉంటుంది. ఇన్ని కోట్లాది జన్మలలో ఒక జీవి చేసుకునే ప్రారబ్ధ కర్మ ఎంత ఎక్కువ ఉంటుంది అన్నది మన ఊహకు కూడా అందదు. అటువంటి దాని నుంచి ప్రస్తుత జన్మలో జీవించే ఒక 70 లేదా 80 సంవత్సర కాలంలో దాంట్లో సహస్రంలో కంటే ఎంతో తక్కువ మాత్రమే ఈ జన్మలో ఆ జీవి అనుభవిస్తాడు.

ఇలా కొందరు తాము కోట్లాది జన్మలలో జన్మిస్తున్నప్పుడు వారి వారి పుణ్యఫలం చేత మధ్యలో కొన్ని జన్మలలో దైవాంశ సంభూతులను కలవడం జరుగుతుంది. అలాగే దేవతల అంశతో జన్మించినవారిని కూడా కలవడం సంభవిస్తూ ఉంటుంది.

కొందరు జీవులు ఎన్నో జన్మలలో ఎంతో ధర్మంగా జీవించడం వలన ఒక్కొక్కసారి సాక్షాత్తూ ఆ పురుషోత్తముడే ఈ భూమిమీద మానవుడిగా అవతరించిన కాలంలో జన్మించడం కూడా జరుగుతుంది. అది వారికి లభించిన ఎంతో మహాభాగ్యం. అది కేవలం అతి కొద్దిమందికే లభిస్తుండటం మనం గమనిస్తాము. ఎందుకంటే సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే భూమిమీద అవతరించినపుడు ఆ స్వామిని చూడగలగడం, ఆ స్వామితో సాన్నిహిత్యంగా ఉండ గలగడం అనేది వారు ఎన్నో జన్మలలో ధర్మంగా జీవించడం వలన మాత్రమే లభించే గొప్ప భాగ్యం.

ఇంకో విశేషం ఏమిటంటే శ్రీరామచంద్రుల వారు ఈ భూమిమీద ఉన్నప్పుడు ఆ మహాపురుషుడుని ఎన్నో లక్షల మంది దర్శించి ఉండవచ్చుకదా! వారు ఎంతో అదృష్టవంతులు. అయితే వారిలో

కొంతమంది మరింత పుణ్యం చేసుకున్నవారు శ్రీరామచంద్రులతో మాట్లాడినవారు, చిన్నప్పుడు ఆడుకున్నవారు, శ్రీరామచంద్రుని జీవితకాలంలో కొంత సాన్నిహిత్యంగా ఉన్నవారు కూడా ఉంటారు కదా! అంతేకాదు రామచంద్రుడు చిన్నప్పుడు బాల్యంలో ఆడుకుంటున్నప్పుడు కొంతమంది పరిచారికల పిల్లలు కూడా స్వామితో కలిసి ఆడుకున్నారు. అలాగే రామచంద్రుడు గురుకులంలో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు స్వామి వారితో అతి సాన్నిహిత్యంగా ఉన్నవారు కూడా కొందరు ఉన్నారు. వారిలో మానవ రూపంలో జన్మించిన దేవతలు, మహర్షులు కొందరు కాగా ఎన్నో వేల జన్మల పుణ్యఫలంతో ఈ అద్భుత భాగ్యం లభించిన సామాన్య మానవులు కూడా ఉన్నారు.

అటువంటి మహనీయులు కొందరు తరువాత ద్వాపరయుగంలో జన్మించినప్పుడు శ్రీకృష్ణుల వారి కాలంలో ఉన్నవారు కూడా ఉన్నారు. వారిలో కొందరు శ్రీకృష్ణుని దర్శించినవారు, శ్రీకృష్ణుల వారితో ఎంతో సాన్నిహిత్యం ఉన్నవారు కూడా ఉన్నారు. అంటే వీరు ఎంతటి అదృష్టవంతులో గమనించండి. శ్రీమన్నారాయణుల వారి రెండు అవతారాలలోనూ ఆ స్వామిని దర్శించి అదే ప్రదేశంలో నివసించి ఎంతో సాన్నిహిత్యంగా ఉన్నవారు ఎంతటి భాగ్యవంతులో కదా! ఇందాక చెప్పినట్లు ఇంతటి మహాభాగ్యం లభించాలంటే వారు ఎన్నో జన్మలలో ధర్మాత్ములై ఉండి లోకానికి ఎంతో సేవ చేసినవారై ఉంటారు. అటువంటి వారికే ఇంతటి మహాభాగ్యం లభిస్తుంది.

అటువంటి పుణ్యాత్ములే ప్రస్తుత కలికాలంలో జన్మించినప్పుడు పురాణాలకు వ్యాఖ్యానం రాసిన వారు కొందరు, పురాణాలను ఎంతో అద్భుతంగా గానం చేసినవారు కొందరు, మహాపండితులుగా జన్మించినవారు కొందరు... ఇలా వివిధ కాలలలో ఈ భూమ్మీద వివిధ ప్రదేశాలలో జన్మించి విశేషమైన ధర్మ ప్రచారం చేస్తారు. ఇటువంటి మహనీయులను ఎందరినో నేను గమనించాను. వీరు రామాయణ

మహాభారత కాలాలలో ఎక్కడ ఉన్నది, రామచంద్రునితోను, శ్రీకృష్ణుల వారితోను ఎటువంటి సాన్నిహిత్యం ఉన్నది అప్పుడు వారి జీవితాలలో జరిగిన విశేషాలు ఏమిటి? వారు ఎంత కాలం రామయ్యతోను, కన్నయ్యతోను గడిపారు అన్న విషయాలు అర్థమయ్యాయి.

భూలోకంలో ఒకే కాలంలో జన్మించిన వీరిలో కొందరికి రాములవారుతోను, కృష్ణులవారుతోను సాన్నిహిత్యం వీరికి ఆ మహాపురుషులతో జరిగిన అద్భుత అనుభవాలు ఎంతో గొప్పగా ఉంటాయి. ఇవన్నీ ఈ పుస్తకం రాస్తున్న సమయంలో కన్నయ్య నాకు ఎంతో విశదీకరించి చెప్తున్నాడు. అంతేకాదు ఆ కృష్ణుని అనుగ్రహంచేత ఆ సంఘటనలు అన్నీ నా కంటి ముందు అలా అద్భుత దృశ్యాలుగా కదులుతూ జరుగుతూ ఉంటే ఆ కాలంలోకి వారి మధ్యకు నేను వెళ్ళడం జరుగుతుంది. ఆహా! ఆ అద్భుత అనుభూతులను మాటలతోను, అక్షరాలలోను వర్ణించలేను. కొంతమేర ఆ విశేషాలు కొన్ని మీతో పంచుకుంటున్నాను. ఇది పూర్తిగా శ్రీకృష్ణుల వారి అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

ప్రముఖ సంగీతత్రయం శ్రీత్యాగరాజు, శ్రీశ్యామశాస్త్రి, శ్రీముత్తుస్వామి దీక్షితార్, ఒక పోతనామాత్యులు, ఒక ఎర్రనామాత్యులు, ఒక తిక్కనామాత్యులు, తులసీదాసు, కబీర్‌దాసు, పురందరదాసు, తుకారాం... ఇంకా ఎందరో మహాపురుషులు నా కంటికి ఈ క్షణంలో రామయ్యతోను, కృష్ణయ్యతోను ఎటువంటి సాన్నిహిత్యం కలిగి ఉన్నారు ఎటువంటి అద్భుత సంఘటనలు అనుగ్రహించడ్డాయి ఇవన్నీ నా కంటిముందు కనిపిస్తుంటే ఆ అనుభూతి మాటలలో వర్ణించలేనిది. అయితే స్థలాభావం చేత, కొన్ని దైవ రహస్యాల వలన వాటిని ఇక్కడ వివరంగా చెప్పలేకపోతున్నాను. విజ్ఞులైన తమరు ఈ విషయం సహృదయంతో అర్థం చేసుకోగలరని భావిస్తున్నాను.

అటువంటి మహనీయులు కొందరు ప్రస్తుత కాలంలో కూడా మన మధ్య ఉన్నారు. వారిలో కొందరు అద్భుత సాహిత్యాన్ని లోకానికి అందిస్తుంటే మరికొందరు ఎంతో గొప్ప సంగీతాన్ని అందిస్తున్నారు. వారి సంగీతం చేత

సామాన్య మానవులే కాదు ఈ ప్రకృతి మొత్తం పరవశిస్తోంది. అంతే కాదు సంగీతనాదంతో మానవుల మనస్సులు సన్మార్గంలో ఆలోచిస్తూ అధర్మం కూడా తగ్గుతుంది. ఆ మహనీయుల నోటినుంచి వచ్చే ఆ దివ్యధ్వనికి ఈ సమాజంలో ధర్మం పెరిగి, అధర్మం తగ్గుతుంది. ఇంతటి మహనీయులని అంటే శ్రీమన్నారాయణుల వారి అవతార కాలంలో జన్మించిన మహాపురుషులలో మనం ఏ జన్మలోనైనా దర్శింపగలగడం మనం ఎన్నో జన్మలలో చేసుకున్న పుణ్యఫలంలా భావించాలి.

నన్ను కలిసిన వారిలో అలా కొంతమందిని శ్రీరామచంద్రుల వారితో గడిపిన వారిని శ్రీకృష్ణుల వారితో సాన్నిహిత్యంగా ఉన్నవారిని కూడా కలిసాను. వారు అంతటి మహాభాగ్యం సంపాదించినప్పటికి అంతకు ముందు కోట్లాది జన్మలలో కొన్ని సార్లు చేసుకున్న ప్రారబ్ధకర్మలను అనుభవిస్తూ తిరిగి ఈజన్మలో మనమధ్యనే సామాన్య జీవితాలు గడుపుతుంటారు. వారికి శ్రీరామచంద్రుని దర్శించామనిగాని, శ్రీకృష్ణుల వారితో సాన్నిహిత్యంగా ఉన్న కాలం గాని ప్రస్తుతం ఎరుకలేదు. కలి మాయ చేత ఎవరో దైవాంశతో జన్మించినవారు, ప్రత్యేక కార్యాల నిమిత్తం ఈ భూమిపైకి వచ్చినవారికి తప్ప ఇతరులకు పూర్వజన్మ స్మృతి ఉండదు. ఇది సృష్టి ధర్మం, కాల ధర్మం.

మీ ఆనందం కోసం ఒకటి రెండు విషయాలు ఇక్కడ మీకు చెప్తాను. జగమెరిగిన మహా సంగీత నర్తి శ్రీత్యాగరాజ స్వామివారు త్రేతాయుగంలో శ్రీరామచంద్రులవారు ఉన్న కాలంలో జన్మించి ఆ స్వామి వనవాసం చేస్తున్నప్పుడు ఆ స్వామిని కలిసారు. వారికి శ్రీసీతారామలక్ష్మణ దర్శనం లభించింది. వారితో కొన్ని రోజులు గడపడం చేత ఎంతో పుణ్యం సంపాదించి ప్రస్తుత కలికాలంలో ఎంతో గొప్ప సంగీతకారునిగా ప్రసిద్ధి పొంది ఆ రామయ్యపై ఎన్నో గొప్ప కీర్తనలు రచించారు. వారు మరల ఒక 600 సంవత్సరాల తరువాత ఈ భూమిపై జన్మించి ఆ జన్మలో

శ్రీకృష్ణులవారిపై ఎంతో గొప్ప కీర్తనలు రచిస్తారు. ఇలా మరొకరు శ్రీరామచంద్రమూర్తిని కలిసి రాముల వారితో గొప్ప సాన్నిహిత్యం ఉండడం చేత ఈ జన్మలో రామాయణ కావ్యానికి అద్భుతమైన వ్యాఖ్యానం రాసారు. అది కేవలం వారికి అప్పటి శ్రీరామ సాన్నిహిత్యం వలనే సాధ్యం అయింది.

మనం ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఇక్కడ మనలో కొందరికి ఒక అనుమానం కలుగుతుంది. సాక్షాత్తూ ఆ పురుషోత్తమునే దర్శించినప్పటికి ప్రస్తుత జన్మలో ఎంతో ధర్మంగా ఉంటున్నప్పటికి ఎందుకు వీరిలో కొందరు అనేక కష్టాల పాలవుతున్నారు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుల వారి దర్శనమే జరిగినా కూడా కష్టాలు ఇలా కలుగుతాయి అని మనలో చాలామందికి సంశయం వస్తుంది. ఇది అర్థం చేసుకోవాలంటే మనం కొంచెం ధీర్ఘంగా ఆలోచించాలి. వారు అప్పటికే ఒక కోటి జన్మలలో జన్మించారని అనుకుందాం. దానిలో ఒక వెయ్యిజన్మలలో ఎంతో ధర్మాత్ముడిగా జీవించడం చేత ఇంతటి భాగ్యం లభించింది.

వెయ్యి జన్మలలో ఒక జీవి అనేక సంస్కృతులలో, అనేక వృత్తులలో ఉంటూ కూడా ధర్మం పట్టుకొని ఉన్నాడంటే అది ఎంత కష్టతరమో ఆలోచించండి. అటువంటి వారికే ఇలా అవతార పురుషుల సాన్నిహిత్యం లభిస్తుంది. అయితే వారు అంతకుముందు లక్షల జన్మలలో చేసుకున్న ప్రారబ్ధకర్మ పూర్తిగా తొలగిపోవడానికి ఇంకా ఎన్నో జన్మలు పడుతుంది. కాబట్టే వీరు అంత గొప్ప భాగ్యం కలిగినా అదే సమయంలో వారి జీవితాలలో అనేక కష్టాలను కూడా ఎదుర్కొనడం జరుగుతుంది. ఇది మనం ఎందరో మహానుభావుల జీవితాలలో గమనిస్తుంటాము. ఒక త్యాగయ్య, ఒక రామదాసు ఎన్ని కష్టాలు పడ్డారో మనం గమనించాము. అంతటి మహనీయులకే కష్టాలు తప్పనప్పుడు అతి సామాన్యులమైన మనమెంతటివారము?.

అయితే ఇక్కడ మనం మరొక విషయం గమనించాలి. ఇటువంటి మహనీయులు కొందరు నేను ఇందాక చెప్పిన కొన్ని లక్షల జన్మల ప్రారబ్ధ

కర్మలను తమ జ్ఞానాగ్నిలో దగ్ధం చేసుకుంటారు. అందువలన వారు వెంటవెంటనే జన్మలు తీసుకోకుండా ఒక వెయ్యి లేదా రెండు వేల సంవత్సరాలకొకసారి ఈ భూమిపై ప్రత్యేక కార్యాల నిమిత్తం వస్తూ ఉంటారు. అటువంటి మహనీయులు ప్రతీ కాలంలోను ఈ భూమిమీద నాలుగువందల మంది వివిధ ప్రదేశాలలో, వివిధ జాతులలో జన్మించి, వివిధ వృత్తులలో జీవిస్తుంటారు. అతి సామాన్యంగా కనబడే వీరిని ఎంతో సాధకులు తప్ప సామాన్యులు గ్రహించలేరు.

వారు కాలానుగుణంగా అతి సామాన్యంగా ప్రవర్తిస్తూ తమను కలిసిన వారికి తమ తత్వం గ్రహింపు జరుగకుండా ప్రవర్తిస్తుంటారు. మనం ఎంతో ధర్మ మార్గంలో ఉంటూను, అటువంటి మహనీయులను గుర్తుపట్టాలని ఎంతో ఆర్తి కలిగిఉండడం చేతను మాత్రమే మనం తెలుసుకొనగలుగుతాం. మనం అలా తెలుసుకొనగలగడానికి కూడా దైవానుగ్రహం, పూర్వజన్మ పుణ్యఫలం, ఆ మహనీయులు అనుగ్రహం కూడా మనకి తప్పక కావాలి. ఇటువంటి వారి చెంత కేవలం ఒక గంట గడిపినా కొన్ని జన్మల ప్రారబ్ధకర్మ నశిస్తుంది.

దేవతలు కూడా ఒకొక్కసారి ఈ భూమిమీద ధర్మం పూర్తిగా నశించకుండా ఉండడానికి అనేక యుగాలలో అనేక కాలాలలో ఈ భూమిమీద మానవ రూపంలో వారి అంశలో కొంత భాగంత జన్మిస్తుంటారు. మనం గమనించే మహాపురుషులలో కొంతమంది సాక్షాత్తూ దేవతల అంశతో జన్మించినవారు కూడా ఉంటారు. అటువంటి వారి దర్శనం వలన మనకి ఎంతో పుణ్యం లభిస్తుంది. కలియుగ లక్షణం ఏమిటంటే ఇటువంటి మహా పురుషుల యొక్క విశిష్టత వారు ఏ అంశతో వచ్చిన వారు ఏ కార్యాల నిమిత్తం వచ్చిన వారు ఇవన్నీ వారు ఈ భూమి మీద నుంచి నిష్క్రమించిన రెండు వందల సంవత్సరాలకు గాను బహిర్గతం కాదు. అప్పటి దాకా వారి గురించి సామాన్య మానవులకు తెలియదు. ఇది కలి లక్షణం.

ఈ లక్షణం ద్వాపరయుగం చివ్వరినాటికే ఈ భూమి అంతా వ్యాపించడం చేత సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే శ్రీకృష్ణుడిగా అవతరించినప్పటికి ఆ స్వామిని ఎవరో కొంతమంది తప్ప అందరూ భగవత్‌స్వరూపంగా గ్రహించలేకపోయారు. సామాన్య మానవుల లాగానే శ్రీకృష్ణులవారిని కూడా తలచారు. ఆనాటికే పరిస్థితులు అలా ఉంటే ఇక ఇప్పటికాలం గురించి చెప్పేదేమున్నది. ఇందాక చెప్పినట్లుగా ఈ అవతార పురుషులను దర్శించిన మహనీయులే కాకుండా శ్రీమన్నారాయణుల వారిలో అతికొద్ది అంశతో, అలాగే శ్రీపరమేశ్వరునిలో అతి కొద్ది అంశతోను జన్మించిన వారు మనమధ్య ప్రస్తుతం ఉన్నారు. కొద్ది అంశ అయినప్పటికీ సాక్షాత్తూ అంతటి మహాదేవతల అంశతో వచ్చినవారు కాబట్టి వారు ఎంతో తేజస్సుతో ప్రకాశిస్తూంటారు. ఎన్నో విధాలుగా భూమిపై ధర్మ ప్రచారం చేస్తారు, ధర్మ వృద్ధి చేస్తారు. వారే మనకు ఆదర్శమూర్తులు, ప్రాతస్మరణీయులుగా కలకాలం వెలుగొందుతారు.

# 9

ఈ వాక్యాలు రాస్తూంటే శ్రీరామచంద్రులవారు దర్శనమిచ్చి నాకు ఒక త్యాగయ్య కృతి వినాలని ఉంది. శ్రీరామ్ అని మీ దగ్గరకు వస్తూఉంటారు కదా! అతడి కీర్తనలు చాలా బాగుంటాయి. నా వనవాసంలో ఒకనాడు ఒక మహర్షి నా దర్శనార్థమై వస్తూ తనతో పాటు ఒక ఇరవై మంది శిష్యులను తీసుకొని వచ్చాడు. ఆ పిల్లలందరూ ఎంతో ముచ్చటగా, ఎంతో తేజస్సుతో ఉన్నారు. వారందరూ వారి గురువుగారి ప్రక్కనే కూర్చొని సామవేదం గానం చేస్తున్నారు. వారెవ్వరికీ నేను శ్రీమన్నారాయణుల వారి అవతారం అని తెలియదు. వారి గురువైన ఆ మహర్షికి మాత్రం నేను ఒక దేవతాంశతో జన్మించిన వాడిని అని మాత్రమే గ్రహింపగలిగారు. వారు ఎంతో వినయంగా మాట్లాడుతూ శ్రీమన్నారాయణుల వారి గుణగణాల విశేషాలను, శ్రీనర్సింహావతార విశేషాలను, శ్రీపరమేశ్వర లీలా విశేషాలను ఎంతో గొప్పగా చెప్పారు. ఇలా వారు చెప్తుండగా అక్కడ సీత, లక్ష్మణులు కూడా

ఉండి ఆ పిల్లలను ఎంతో ముచ్చటగా చూస్తున్నారు. ప్రకృతి ఎంతో ముచ్చటగా ఉంది. అక్కడ చుట్టు ప్రక్కల జింకలు అటూ ఇటూ చెంగు చెంగుమంటూ తిరుగుతున్నాయి.

శ్రీరామచంద్రుల వారు ఇంకా ఇలా చెప్పసాగారు. ఆనాటి ఆ ఇరవై మంది బాలురు తరువాతి కాలంలో కలియుగంలో జన్మించినప్పుడు వారి వారి ప్రారబ్ధ కర్మల ప్రకారం లౌకిక జీవితాలు గడుపుతున్నప్పటికి సాహిత్యంలోను, సంగీతంలోను అపార పరిజ్ఞానాన్ని సంపాదించుకున్నవారై గొప్ప పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. శ్రీరామచంద్రులవారు నాతో ఆ పిల్లలు చూడు ఎంతో ముచ్చటగా ఉన్నారో నువ్వు కృష్ణుని గురించి రాస్తున్నది చదువుతూనే ఉన్నాను. నీకో విశేషం చెప్తాను ఇలా ఇప్పుడు నాదగ్గర ఈ వనవాస సమయంలో పాడినవారు కొందరు తరువాత ద్వాపరయుగంలో నేను కృష్ణావతారంలో జన్మించినప్పుడు కూడా ఉన్నారు. వారు అప్పుడు అదే ప్రదేశంలో జన్మించి నన్ను కలుసుకొని వారి అమోఘ వేదపారాయణతో, సంగీత ప్రతిభతో నన్ను ఎంతో ముగ్ధులను చేశారు.

నీకు ఇంకో విశేషం చెప్పనా అంటూ ఆ శ్రీరామచంద్రమూర్తి నాతో ఇంకా ఇలా అన్నారు. ఈ ఇరవై మంది కలియుగంలో ఎప్పుడెప్పుడు ఏఏ ప్రదేశాలలో ఏఏ పేర్లతో జన్మించారో వారు అప్పుడు ఎంత గొప్ప సంగీత సాహిత్యకారులుగా విలసిల్లారో చెప్పున్నాను విను అని శ్రీరామచంద్రమూర్తి వివరంగా చెప్పారు. వారిలో కొందరు గొప్ప సాహిత్యకారులుగా జన్మిస్తే మరికొందరు గొప్ప సంగీతకారులుగాను మరికొందరు గొప్ప ఆధ్యాత్మిక ప్రవచన కర్తలు గాను జన్మించి ప్రస్తుత కలియుగంలో ధర్మాచరణ ప్రాముఖ్యాన్ని ప్రజలందరికీ ఎంతో విశేషంగా చెప్తున్నారు.

త్రేతాయుగంలో ఆనాడు సాక్షాత్తూ శ్రీసీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఎదురుగా వేదపారాయణ చేయడం వలన ఆ దివ్యమూర్తులతో ఎంతో సమయం గడపడం వలన ఆ దివ్యమూర్తుల అనుగ్రహంచేత ఈ కలియుగంలో వారు ఎంతో పేరు ప్రఖ్యాతులు

సంపాదించారు. సాక్షాత్తూ శ్రీరామచంద్రులవారిని అటుతరువాత శ్రీకృష్ణులవారిని దర్శించి వారి వద్ద వేదపారాయణం చేయుట వలన ఈ జన్మలో వారిలో కొందరు శ్రీరామచంద్రమూర్తిపై గొప్ప కృతులు రాయగా మరికొందరు ఆ కృతులను ఎంతో గొప్పగా కీర్తించేవారిగా పేరు పొందారు. వారి గొంతులో దైవత్వం ఉట్టిపడుతున్నది. అలాగే కొందరు శ్రీకృష్ణ తత్వాన్ని ఎంతో అద్భుతంగా ప్రచారం చేస్తున్నారు.

భక్తిలో మనం ఎంతో ఉన్నత స్థానానికి వెళ్తున్నప్పుడు మనమూ, మనం కొలుస్తున్న దేవత ఒకటే అనే స్థితికి చేరతాం. ఇది సిద్ధించాలంటే అచంచలమైన భక్తి పూర్తి ధర్మాచరణ, ఎన్నో జన్మల పుణ్యఫలం, మనచుట్టూ ఉండే ప్రతి జీవిలోను, ప్రతీ వస్తువులోను, కదిలేది, కదలనిది అన్నిటియందు ఆ పరమాత్ముడిని చూడగలగాలి. ఎంతో ఆర్తి కావాలి. ఎంతో ఆనందంతో ఆ స్వామిని ఆరాధించాలి. నిరంతరం తలుస్తూ ఉండాలి అప్పుడు మనము, ఆ భగవంతుడు ఒక్కటే అన్న స్థితికి మన మనస్సు చేరుతుంది. అప్పుడు మన మనస్సు, ఆ భగవంతుడి మనస్సు ఒక్కటే అవుతుంది. అంటే ఆ భగవత్ శక్తి ఆలోచనలో మన మనస్సులో ఆలోచనలుగా కలుగుతాయి. అంతేకాదు ఆ స్థితికి చేరినప్పుడు ఈ సృష్టిలోని సర్వ విశేషాలు, అన్ని యుగాలలో జరిగిన కోటానికోట్ల సంఘటనలు మన మనస్సులో దర్శనమిస్తాయి. ఈ స్థితి ఎంతసేపు ఉంటుంది అన్నది మన సాధన బట్టి ఉంటుంది. మన సాధన పూర్తి స్థాయిలో ఉంటే నిరంతరం మన మనస్సు అదే ఎరుకలో ఉంటుంది. ఇంతకు మించిన బ్రహ్మానందం మరొకటి లేదు. అంతేకదామరి! ఎంతటి గొప్ప ఆనందం అది మరి!

# 10

ఆరోజు కన్నయ్య ఉదయం నుంచి ఎంతో సంతోషంగా ఇటు అటు హడావిడిగా తిరుగుతున్నాడు. అమ్మని అడిగి వెన్న తిన్నాడు. యశోదమ్మకు ఆరోజు కృష్ణయ్య ఇంకా అందంగా కనిపించాడు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణనునే తల్లిలా లాలిస్తున్న మా యశోదమ్మ అదృష్టం ఎంతటిది అని దేవతలు ఆమె భాగ్యానికి ఎంతో సంతోషపడుతున్నారు. కొందరు ఈర్ష్య పడుతున్నారు కూడా. ఆ దేవదేవుని చిన్న పిల్లవాడిగా రోజూ చూసుకుంటూ ఉదయం నుంచి రాత్రి పడుకునేంత వరకు ఎన్నో సపర్యలు చేయడం, ఆ ముచ్చట్లు చూడడం, ఆ భువన మనోహర రూపాన్ని ఇలా చిన్న పిల్లవాడిలా సంవత్సరాల పాటు చూస్తూ ఆడించడం, పిల్లవాడికి స్నానం చేయించడం, అలంకరించడం...ఆహా ఎంతటి భాగ్యశీలి ఈ యశోద అని దేవతలు ఈర్ష్య పడుతున్నారు. యశోదమ్మా నువ్వు ఎంతో అదృష్టవంతురాలివి తల్లీ! ఆ పురుషోత్తముని రోజు తాకి ఇన్ని సేవలు చేసే భాగ్యం లభించింది అని అన్నారు.

కృష్ణయ్య అలా ఆ రోజు ఎంతో ముచ్చటగా తయారై గోప బాలురితో కలిసి ఆడుకుంటూ ఊరి బయటకు చేరాడు. అక్కడ గోవులు, దూడలు గడ్డి మేస్తూ కనబడ్డాయి. వాటిలో ఒక ఆవు ఎంతో అద్భుతంగా ఉంది. కన్నయ్యతోపాటు ఉన్న గోప బాలురకు ఆ ఆవుని చూస్తే ఎంతో సంతోషం కలిగింది. కన్నయ్య అటువెళ్ళి ఆ ఆవుని ముట్టుకుందామా అని అన్నారు. ఓ అలాగే అన్నాడు కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ!

కన్నయ్యతో సహా ఆరుగురు పిల్లలు ఆ గోవువైపు నడవసాగారు. ఆ ఆవు వీరు రావడం చూసి కొంచెం దూరంగా వెళ్లింది పిల్లలకు ఆతృత ఎక్కువైంది. ఎటో వెళ్లిపోతోంది! పరుగెత్తండి! పరుగెత్తండి! అంటూ అందరూ ఆ ఆవువైపు పరుగెత్తారు.

కన్నయ్య కూడా చిరునవ్వు నవ్వుతూ వారితో కలిసి పరుగెడుతున్నాడు. ఆ ఆవు వీరు రావడం చూసి ఎంతో వేగంతో పరుగెత్తసాగింది. పచ్చికబయళ్ళను దాటుకుంటూ దూరంగా ఉన్న కొండవైపు పరుగెడుతోంది. అప్పుడు కన్నయ్య వారితో ఇంక మనం వెనక్కి వెళ్ళిపోదాం రండి మీరు బాగా అలసిపోతున్నారు అన్నాడు. అబ్బే ఏమి అలసట లేదు ఎలాగైనా ఆ ఆవుని తాకాల్సిందే ఎంత అందంగా ఉందో చూడు అంటున్నాడు ఒక పిల్లవాడు. అతని పేరు సుకేశుడు. సుకేశుడు కృష్ణుడితో అన్నా! ఎలాగైనా మనం ఆ ఆవుని తాకాల్సిందే నువ్వు మమ్మల్ని ఆపకు అని అన్నాడు. అందుకు కన్నయ్య సరే పదండి అని అందరితో కలిసి తానుకూడా ఆ ఆవువైపు పరుగెత్తసాగాడు.

కన్నయ్య అలా పచ్చికబయళ్ళలో ఆలమందల మధ్య ఒక్క ఆవుకోసం ఈ గోప బాలురతో కలిసి పరుగెడుతూ ఉంటే ఎంత అద్భుతంగా ఉంది ఆ దృశ్యం ఆహా! అంతటి దివ్య దృశ్యాన్ని చూస్తున్న మనం ఎంత అదృష్టవంతులమో కదా! దూరంగా కొండలు...నన్నటి చిరుజల్లు...ఆలమందలు... పరుగెడుతున్న కన్నయ్య... పిల్లలు...కింద నేల ఎత్తుపల్లాలుగా ఉండడం చేత వారందరూ కాసేపు కిందకి కాసేపు పైకి

కనిపిస్తున్నారు. కన్నయ్య తలమీద నెమలి పింఛం కూడా అలా కదులుతూ కనిపిస్తూ ఆ దృశ్యం ఎంతో ముచ్చటగా ఉంది. వీరిని చూసి ముచ్చటపడి ఈ పిల్లలు ఇలా ఎందుకు పరుగెడుతున్నారో చూద్దాం అనుకుంటూ రెండు నెమళ్ళు వీరి వెనకే కొంత పరుగెడుతూ మళ్ళీ ఎగురుతూ వెళుతున్నాయి.

పచ్చికబయళ్ళలో కుందేళ్ళు, చిన్న చిన్న ఉడుతలు అలా గంతులేస్తూ పరుగెడుతున్న వీరి వంక ఆశ్చర్యంగా చూస్తున్నాయి. ఆ కుందేలు ముఖంలో ఆశ్చర్యం చూడండి. ఆ భావం చూడండి! ఎంత ముచ్చటగా ఉందో అలా కన్నయ్య, పిల్లలు పరుగెడుతూ ఇంకా ఇంకా ముందుకు వెళ్ళారు. ఆ ఆవు అలా పరుగెడుతూనే ఉంది ఇలా పరుగెడుతూ వారు ఒక కొండ వద్దకు చేరుకున్నారు. అక్కడ వీరు అందరూ చూస్తుండగానే ఆ ఆవు ఒక్క క్షణంలో మాయమైంది. సుకేశుడు, పిల్లలు నిరాశపడ్డారు.

ఇంతలో వారికి అక్కడ ఒక పురాతనమైన గుడి కనిపించింది. సుకేశుడు కన్నయ్యతో ఇదేంటి కృష్ణయ్యా? అన్నాడు ఏమో చూద్దాం పద అని పిల్లలంతా కలిసి ఆ గుడిలోకి వెళ్ళారు. లోపలంతా దుమ్ము దుమ్ముగా మరియు చీకటిగా ఉంది. పిల్లలకు లోపల ఏముందో చూడాలనే ఉత్సాహం ఎక్కువైంది. సుకేశుడుకి మరీ కుతూహలంగా ఉంది. కన్నయ్యతో సహా అందరూ ఆ దుమ్ముని శుభ్రం చేస్తూ ఉంటే ఒక్కసారిగా పైకప్పు నుండి వెలుగు వచ్చి ఆ ఆలయంలో ఉన్న దేవతామూర్తిపై పడింది.

ఆ అద్భుత శిలామూర్తిని చూసిన ఆ పిల్లలందరూ ఆశ్చర్యపోయారు. ఎదురుగా ధనస్సు, బాణాలు ధరించి ఒక మూర్తి ప్రక్కనే ఎంతో సౌందర్యంతో, అద్భుత తేజస్సుతో మెరిసిపోతున్న స్త్రీమూర్తి కనబడ్డారు. ఇదంతా చూసి కన్నయ్య చిరునవ్వు నవ్వుకున్నాడు. పిల్లలందరూ ఆ మూర్తుల వంక ఎంతో ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఇంతలో సుకేశుడు ఒక్కసారిగా ముందుకు దూకి ఆ విల్లంబులు ధరించిన దేవతను గట్టిగా కౌగిలించుకున్నాడు. అతని ముఖంలో అద్భుతమైన ఆనందంతో కళ్ళ నీళ్ళు వచ్చాయి. తాను అలా ఎందుకు చేస్తున్నాడో కూడా తనకు తెలియడంలేదు.

తోడ వచ్చిన పిల్లలు ఇదంతా చూచి ఆశ్చర్యపోతున్నారు. అప్పుడు కన్నయ్య వారితో ఇలా అన్నారు వీళ్ళందరూ ఎవరో తెలుసా? శ్రీరామచంద్రమూర్తి, సీతమ్మ తల్లి, లక్ష్మణుడు అని అన్నాడు. వీరందరూ కొన్ని లక్షల సంవత్సరాల క్రితం ఈ భూమిపై ఉన్నారు. అదిగో అక్కడ కింద చూడండిఊ అతడు హనుమంతుడు! శ్రీరామచంద్రుల వారికి అనుంగుబంటు పిల్లలు అప్పటిదాకా హనుమంతుని గమనించలేదు ఒక పిల్లవాడు ముందకు వచ్చి హనుమంతులవారి విగ్రహానికి ఉన్న దుమ్ము తన తలకు చుట్టుకున్న గుడ్డను తీసి తుడిచాడు. సుకేశుడు శ్రీరామచంద్రుడు, సీతమ్మ తల్లి, లక్ష్మణ స్వాముల విగ్రహాలను తన తలపై కట్టుకున్న గుడ్డతోటి తుడుస్తున్నాడు. అలా తుడుస్తున్నంతసేపు ఎంతో ఆనందంతో అతడి కన్నుల వెంట నీళ్ళు కారుతూనే ఉన్నాయి.

అప్పుడు ఒక అద్భుతం జరిగింది. సుకేశుడుకి, పిల్లలకి శ్రీరామచంద్రమూర్తి స్థానంలో ఒక్కసారిగా ఈ కన్నయ్య కనపడ్డాడు. ఆశ్చర్యంతో కళ్లు నలుపుకొని మళ్ళీ చూసారు. మళ్ళీ కన్నయ్యే కనబడుతున్నాడు. ఇందాకటి మూర్తిలోని ధనస్సు, బాణాలు మాయమై ఆ విగ్రహం కన్నయ్యలాగా వేణువు ఊదుతూ కనిపిస్తున్నాడు. పిల్లలు కాసేపు తమ పక్కన ఉన్న కన్నయ్యని, ఎదురుగా విగ్రహరూపంలో ఉన్న కన్నయ్యని తల అటూ ఇటూ తిప్పుతూ చూస్తున్నాడు ఆనందంతో ఎగిరారు.

అప్పుడు కన్నయ్య వారితో పదండి చీకట పడుతుంది మనం ఇళ్ళకు వెళ్ళాలి అన్నాడు. వాళ్లు అక్కడినుండి కదలకపోతే పదండి పదండి అని వాళ్ళని హడావిడి చేసాడు. అక్కడితో వాళ్ళందరూ బయటకి వచ్చారు. బయటకి వస్తే అప్పుడే చీకటి పడుతోంది. అందరూ పరుగెత్తుకుంటూ ఆ పచ్చికబయళ్ళపై అటూ ఇటూ గెంతుతూ తిరిగి గోకులం చేరారు. వీరు గోకులం రావడం ఆలస్యమై వారి తల్లిదండ్రులు వీరికోసం గాభరా చెందుతున్నారు. ఇంక యశోదమ్మ సంగతి చెప్పనక్కర్లేదు ప్రొద్దున్న వెళ్ళిన కన్నయ్య ఇంకా రాలేదు అనుకుంటోంది. ఇంతలోనే చిరునవ్వు నవ్వుకుంటూ కన్నయ్య వచ్చాడు.

ఆ పిల్లల తల్లిదండ్రులు వారిని ఇంతసేపు ఎక్కడకి వెళ్ళారు అని అడిగారు వారు దానికి ఏదో ఆటలు ఆడుకుంటూ కాలం తెలియలేదు అన్నారు. వారికి నిజంగానే కాలం తెలియలేదు. అంతేకాదు వారు తాము అంతకుముందు చూసినదంతా మరచిపోయారు వారిని మాయ కప్పేసింది. ఇదంతా శ్రీకృష్ణలీల! శ్రీవిష్ణులీల! సుకేశుడు, మిగిలిన బాలలు ఇంతకుముందు శ్రీమన్నారాయణుల వారు శ్రీరామచంద్రునిగా అవతరించినపుడు మిథిలా నగర సమీపంలో మహర్షులుగా జన్మించారు. అక్కడ గురుకులంలో విద్యార్థులకు శాస్త్రాలు నేర్పేవారు అప్పుడు సుకేశుడు ధాత్రి అనే పేరుతో మహర్షిగా ఉన్నాడు. ధాత్రికి శ్రీరామచంద్రుల వారంటే ఎంతో ప్రాణం. దాదాపు ప్రతీ పది రోజులకు వచ్చి రామచంద్రుని వద్ద కూర్చునేవారు.

ధాత్రికి అలా రామచంద్రునితో ఎంతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ ద్వాపర యుగంలో కన్నయ్యగా జన్మించిన శ్రీమన్నారాయణుల వారికి ఒకసారి ధాత్రికి అప్పటి తన రూపాన్ని చూపాలనిపించింది. అందుకే అక్కడ ఉన్న శ్రీసీతారామచంద్రమూర్తి వారి ఆలయాన్ని చూపించాడు. ధాత్రి అలా రామచంద్రుని మళ్ళీ చూసి ఎంతో సంతోషించాడు. తరువాత ఆ ఆలయం అదృశ్యం అయిపోయింది. అటుతరువాత కృష్ణమాయ వలన సుకేశుడికి, పిల్లలకి మదిలోనుంచి మాయమైంది. వారి ఆత్మలకు ఆ దివ్యానుభూతి కలిగింది. మళ్ళీ అప్పటి శ్రీరామచంద్రులవారిని చూసిన దివ్య అనుభూతి కలిగింది. శ్రీకృష్ణ లీలలు ఇలా ఉంటాయి!

# 11

గోకులంలో కన్నయ్య ఆటలు ఇన్నీ అన్నీ కాదు. ఉదయాన్నే యశోదమ్మ గోష్టం నుంచి తెచ్చిన చిక్కటి పాలు త్రాగటం, పిల్లలతో ఎగురుతూ ఆడటానికి వెళ్ళడం. ఆ పిల్లలు అలా గోకులంలో ఆడుతూ తిరుగుతూ ఉంటే ఎంత ముచ్చటగా ఉందో చూడండి. ఆరోజు అందరూ కలిసి యవనిక అనే గోపిక ఇంట్లో ప్రవేశించారు. అటూ ఇటూ ఎవరు లేరని చూసి ఇంట్లో పెట్టిన వెన్న అంతా తినసాగారు. ఇంతలో ఎవరో వస్తున్న అలికిడి అయితే తింటున్న వారంతా అక్కడే వదిలేసి పరుగు పరుగున బయటకి వచ్చారు. యవనిక అమ్మ పిల్లల్లారా వెన్నంతా తినేసారా అంటూ వారివెంట పడింది. వారు మూతులకు, పెదవులకు అలా వెన్న ఇంకా అంటుకొని ఉంది.

వాళ్ళు పరుగెత్తి పరుగెత్తి యశోదమ్మ ఇంటికి వచ్చారు. యవనిక యశోదతో చూడమ్మా మీ కన్నయ్య రోజు ఇలా తుంటరి పిల్లలను

వెంటపెట్టుకొని మా ఇళ్ళలో వెన్న ఎలా దొంగిలిస్తున్నాడో చూడు అంది. అప్పుడు కన్నయ్య మేము అసలు వాళ్ళ ఇంటికే వెళ్ళలేదు అని అన్నాడు. పిల్లలందరూ అదే అన్నారు. అవునా అయితే మీ మూతుల చుట్టూ, బుగ్గలపై ఆ వెన్న చారలు ఎలా వచ్చాయి అన్నది యవనిక యశోదమ్మ ఆశ్చర్యపోతూ వెన్న చారల! ఎక్కడమ్మా! అసలు కన్నయ్య వద్దే కాదు, ఎవరి వద్దా కూడా వెన్న చారలు లేవు, వెన్న తిన్న వాసన లేదు అని అంది.

చాలు యశోదమ్మ! చాలు నువ్వుకూడా అబద్ధాలేనా! అంత చక్కగా వెన్న తింటూ ఇలా పరుగెత్తుకొని రావడం ఇప్పుడే చూసాను కదా నేను అన్నది యవనిక. యశోదమ్మ యవనికను ఇదిగో నువ్వు దగ్గరకి వచ్చి మరీ చూడు అంది యవనిక ముందుకు వచ్చి కన్నయ్యను, పిల్లలను పరిశీలించి చూస్తే ఎవ్వరికీ వెన్న చారలు లేవు! ఏ మాత్రం వాసన కూడా లేదు! ఆశ్చర్యపోయి ముక్కున వేలు వేసుకుంది యవనిక. ఇదంతా కృష్ణ మాయ తనను విపరీతంగా ప్రేమించే అందరిని అలా ఆట పట్టించడం ఆ కన్నయ్యకు ఒక వినోదం. అసలీ గోపికలందరూ ఇప్పుడు ద్వాపర యుగంలో జన్మించింది మాతో ముచ్చట్లాడడానికే కదా అని వారిని ఎన్నో విధాలా మురిపించేవాడు ఆ పరంధాముడు. ఎన్ని మాయలు! ఎన్ని వినోదాలు!

కన్నయ్య రోజురోజుకీ గోకులంలో ఎన్నో లీలలు చూపిస్తున్నాడు. కన్నయ్య లీలలు చూసిన వారందరూ ఈ పిల్లవాడు సామాన్యుడు కాడు అంటున్నారు. పూతనను చంపినపుడు, బకాసురుని అంతమొందించినపుడు గోకులం అంతా ఆశ్చర్యపోయారు. ఈ పిల్లవాడు సామాన్యుడు కాదు ఏ దేవతో ఇలా వచ్చి మన మధ్య ఉంటున్నాడు అనుకున్నారు. అందుకు యశోద అదేదీ కాదమ్మా ఏ దేవుడో కన్నయ్యను రక్షిస్తున్నాడు అంతే తప్ప ఇంత చిన్న పిల్లవాడేమిటి ఆ రాక్షసుని చంపడమేమిటి అనేది.

ఇలా ఉండగా కన్నయ్య స్నేహితులతో కలిసి ఆ రోజు అటూ ఇటూ ఎగురుతూ గోపికల ఇళ్ళల్లో వెన్నలను దొంగిలిస్తూ అనేక ఆటలు ఆడుతూ ఊరి బయటకు వచ్చారు. అక్కడంతా ఎన్నో చెట్లు చెట్ల మీద ఎన్నో రకరకాల

పక్షులు! వాటన్నింటినీ ఎంతో అద్భుతంగా చూస్తున్నాడు పక్కనే నెమళ్ళు పురివిప్పి నాట్యం చేస్తున్నాయి. దూరంగా ఎగురుతున్న ఆ కొంగలను చూడండి. ఇటు పక్కనే చెంగు చెంగున ఎగురుతూ చిన్న శబ్దానికి పక్కన పొదల్లోకి వెళ్ళి దాక్కొని మళ్ళీ బయటకు వస్తున్న ఆ ముద్దు ముద్దు కుందేళ్ళను చూడండి. ఇవన్నీ కలిసి ఎంత చక్కగా ఉంది ఆ ప్రకృతి! అక్కడ గోప బాలురతో కలిసి కన్నయ్య ఆడుకుంటున్నాడు.

ఇంతలో వీళ్ళకు దూరంగా నుంచి ఏవో కేకలు వినపడ్డాయి. చిన్న పిల్లలు అరుస్తున్నట్లు ఉన్నారు. అదికూడా ఆడపిల్లల గొంతులలాగా ఉన్నాయి. అంతే కన్నయ్య వెంటనే స్నేహితులతో కలిసి అటు పరుగెట్టాడు. అక్కడ ఒక కొలను కనిపించింది. ఆ కొలనులో నలుగురు ఆడపిల్లలు మునిగిపోతూ రక్షించండి రక్షించండి అని అరుస్తున్నారు. కన్నయ్యతో వచ్చిన పిల్లలకు ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. వాళ్ళు చిన్న పిల్లలు. నీటిలో దూకి ఎలా రక్షించగలడు? ఇంతలో ఒక పిల్లాడు ఊళ్ళోకి వెళ్ళి ఎవరినైనా తీసుకువస్తానని పరుగెత్తాడు. కాని ఇక్కడ ఉన్న పిల్లలకు చాలా భయంగా ఉంది ఇంకాసేపట్లో ఆ నలుగురు ఆడపిల్లలు పూర్తిగా మునిగిపోతారేమోనని ఎంతో భయపడుతున్నారు.

ఇలా ఆలోచిస్తుండగా కృష్ణయ్య ఒక్కసారిగా నీళ్ళలోకి దూకాడు. పిల్లలందరూ భయపడ్డారు. తమ స్నేహితుడు కూడా మునికిపోతాడేమోనని వాళ్ళకి ఏడుపు వచ్చింది గట్టిగా ఏడవసాగారు. నీటిలో దూకిన కన్నయ్య తన రెండుచేతులతో ఒక్కో వైపు ఇద్దరు ఆడపిల్లలను గట్టిగా పట్టుకొని నీటినుంచి పైకి లేచాడు. ఆ ఆడపిల్లల ముక్కునుంచి నోటినుంచి నీళ్ళు కారుతున్నాయి. కన్నయ్య చిరునవ్వుతో మీకేమి కాదు ఏమి బెంగ పడకండి అని ఆ కొలను ఈదుతూ మధ్యలో ఆశ్చర్యంగా నీటిపై నడుస్తూ ఒడ్డుకు వచ్చారు. ఆ దృశ్యం చూసిన కన్నయ్య స్నేహితులు ఎంతో ఆశ్చర్యపోయారు. ఇంతలో ఊళ్ళోనుంచి యాదవులు పరుగెత్తుకుంటూ వచ్చారు. తమ కుమార్తెలు నీట మునిగారని తెలిసి ఎంతో భయపడుతూ వచ్చారు. అక్కడకి రాగానే అప్పటికే

నీటి ఒడ్డున చేరిన కన్నయ్యను, తమ నలుగురి కుమార్తెలను చూసి వారెంతో సంతోషపడ్డారు. అక్కడున్న పిల్లలు జరిగినదంతా చెప్పారు. కాని పెద్దలు నమ్మలేదు. ఏడేళ్ళ వయసుకూడా లేని కన్నయ్య ఏమిటి నలుగురు పిల్లల్ని ఎత్తుకొని నీటి బయటకు తీసుకురావడం ఏమిటి? ఇదెక్కడా నమ్మబుద్ధి కావడంలేదు. తమ పూర్వజన్మ పుణ్యఫలం వలన ఏ దేవతో వచ్చి తమ పిల్లల్ని రక్షించాడు అనుకున్నారు. వారిలో ఒకరైతే కన్నయ్యను ఏ దేవతో ఆవహించి ఇంత శక్తి వచ్చిఉంటుంది అన్నాడు.

అందరూ కలిసి తిరిగి గోకులానికి వెళ్ళి యశోదమ్మకు జరిగిందంతా చెప్పారు. యశోదమ్మ ఆశ్చర్యపోయింది. ఇందాక చెప్పినట్లే ఒక యాదవుడు ఏ దేవతో మీ కన్నయ్యను ఆవహించి మా పిల్లలను కాపాడాడు యశోదమ్మ అని అన్నాడు. ఆ మాట విన్న యశోద అమ్మో కన్నయ్యను దేవత ఆవహించడం ఏమిటి అని కన్నయ్య వంక భయంగా చూస్తూ అంది. అప్పుడు కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ అదేమీ లేదమ్మా! భయపడకు! నేను నీ ఎప్పటి కన్నయ్యనే అన్నాడు. అప్పుడుగాని యశోదమ్మ కుదుటపడలేదు.

# 12

ఆ రోజు కన్నయ్య పుట్టినరోజు. యశోదమ్మకు నందునికి రెండురోజుల ముందునుంచి ఎంతో ఉత్సాహంగా ఉంది. ఆరోజు కన్నయ్యను ఎలా అలంకరించాలి. ఏఏ పిండి వంటలు వండి పెట్టాలి, ఎలాంటి రంగుల దుస్తులు వెయ్యాలి ఇవే ఆలోచనలు. ఇంతలో పుట్టినరోజు రానే వచ్చింది ఆరోజు ఉదయమే యశోదమ్మ కన్నయ్యను నిద్రలేపి అభ్యంగన స్నానం చేయించింది. అలా అమ్మ స్నానం చేయిస్తున్నప్పుడు కన్నయ్య ఆ నీళ్ళతో ముచ్చటగా ఆడుతున్నాడు. అది చూసి ఒక ప్రక్క ముచ్చట పడుతూ యశోదమ్మ అల్లరి పిల్లాడా అని అంది. ఇంతలో అటుగా ఒక గోపిక వచ్చింది కన్నయ్య చిలిపిగా ఆమె మీదకు ఇన్ని నీళ్ళు తీసుకొని చల్లాడు. ఆ గోపిక ఎంతో ముచ్చటపడింది ఆహా! జన్మధన్యమయింది అనుకుంది. యశోదమ్మ మాత్రం పిల్లవాడిని మందలిస్తూ అలా చేయకూడదు కదరా తండ్రీ అంది.

గోకులం అంతా పెద్ద పండుగ వాతావరణంతో ఉంది. అదిగో చూడండి! ఎన్ని రంగు రంగుల తోరణాలు కట్టారో! ప్రతీ ఇంటి ముందు గోపకాంతులు ఉదయాన్నే లేచి అద్భుతమైన రంగు రంగుల ముగ్గులు వేసారు. గడపలకు రంగు రంగుల పూలదండలు కట్టారు, ఆవులను చక్కగా అలంకరించారు, దూడలను ఎంతో ముచ్చటగా తీర్చిదిద్దారు. ఇంక ఆరోజు గోపికల హడావిడి చెప్పనక్కర్లేదు. వారందరి మనస్సులో ఒక్కటే ఆనందం ఎంతో పరవశం ఆరోజు కన్నయ్య పుట్టినరోజు అని ఎంతో మురిసిపోతున్నారు. వారి మనస్సులు ఎప్పుడూ కన్నయ్య పైననే!

ఇంక గోపబాలురు అయితే ఎంతో చక్కటి వస్త్రాలు ధరించి చేతిలో వేణువులు నెమలి పించాలు పట్టుకొని ఊరంతా తిరుగుతూ పరుగెడుతున్నారు. వాళ్ళ ముఖాలలో ఆ ఆనందం చూడండి మాటల్లో వర్ణించలేనిది! గోకులం అంతా ఎంతో గొప్ప శోభ సంతరించుకొంది. మరి కన్నయ్య పుట్టినరోజు అంటే సామాన్యమా వైకుంఠంలోని శ్రీమన్నారాయణుడే లోకోద్ధరణకై జన్మించిన రోజు ఎంత గొప్పది! ఎంత విశిష్టమైనది! స్వామి పుట్టిన రోజు లోకానికంతా కళ్యాణమే గదా!

ఇక్కడ విశేషం ఏమిటంటే గోకులంలో ఎవరికి అక్కడ జన్మించిన ఆ పిల్లవాడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అని తెలియదు. అందరూ ఆ పిల్లవాడు తనలో ఒకడు అని భావించి ఆడుతున్నారు. కన్నయ్యకి కావలసింది అదే నిష్కల్మష ప్రేమ! శ్రీకృష్ణుని చేరుకొనడానికి కావలసింది ఎంతో స్వచ్ఛమైన ప్రేమ! ఆ ప్రేమతోనే కన్నయ్యకు మనం దగ్గర అవుతాం. ఆ స్వచ్ఛమైన ప్రేమకే కన్నయ్య మనల్ని అనుగ్రహించేది.

గోపికలది ఆ పవిత్ర ప్రేమే! ఆ ప్రేమలో ఎటువంటి కామవికారాలు లేవు. కేవలం ఆ గోవిందుని వద్ద సాన్నిహిత్యంగా ఉంటే చాలు. తాము ఎంతో గొప్ప ఆత్మానుభూతి పొందుతున్నారు. వారి ఆత్మలన్నీ కన్నయ్యకే అర్పితం. వారందరూ గోకులంలో జన్మించింది కూడా ఆ దివ్యానుభూతిని పొందడానికే. కన్నయ్య చేయి తగిలితే మురిసిపోతారు.

కన్నయ్య స్పర్శకోసం ఎంతో తపిస్తారు. ఆ స్పర్శ వారికి ఎంతో అద్భుతమైన, అనిర్వచనీయమైన అనుభూతినిస్తుంది. ఆ స్పర్శ వారి ఉనికినే మరిపింపచేస్తుంది.

కన్నయ్య ఒకసారి వారి బుగ్గలపై చిన్ని చిటికె వేస్తాడు కొంతమంది బుగ్గలపై ముద్దు పెడతాడు. ఒకిరిని దగ్గరకు తీసుకుంటాడు. మరొకరిని ఎంతగానో లాలిస్తాడు. ఇవన్నీ వారిని ఆనందపరచడానికే! ఇక్కడ స్త్రీ, పురుష భేదం లేదు. ఆ గోవిందుని స్పర్శతో వారి తనువు మనస్సు ఎంతో పులకరిస్తుంది. వారు అనుభవించిన ఆనందాన్ని పొందడానికి పూర్తి శరణాగతి, స్వచ్ఛమైన ప్రేమ, అసలు కన్నయ్య తప్ప వేరేది ఏమి ఈ ప్రపంచంలో లేదు! అన్నిటియందు ఆ కన్నయ్యే ఉన్నాడన్న భావన ఉండాలి. అలా ఉన్నవారికి ఇప్పటికి ఆ గోపికలు అనుభవించిన దివ్యానుభూతి లభిస్తుంది. కన్నయ్యకు అటువంటి వారి ఎడల ఎంతటి ప్రేమ లేకపోతే ఇంతటి అద్భుత ఆనందాన్ని అనుగ్రహిస్తున్నాడు. గోపికలు అలా తన్మయత్వంతో శరీరాన్ని మరిచి ఉంటే వారిని చూసి కన్నయ్య ఎంతో ముచ్చట పడతాడు. ఇందుకే కదా తాను ఈ గోకులానికి వచ్చింది అని కన్నయ్యకు బాగా తెలుసు.

ఆరోజు యశోదమ్మ కన్నయ్యకు స్నానం చేయించి చక్కటి దుస్తులు వేసింది. అప్పటికే దగ్గరలో ఉన్న గోపకాంతులు బోలెడంత వెన్న, పాలతో చేసిన చక్కటి తీపి పదార్థాలు కన్నయ్య కోసం తీసుకువచ్చారు. యశోదమ్మ వాళ్ళతో అమ్మలారా పిల్లవాడికి హారతి ఇద్దాం అని పిలిచింది. చక్కగా అలంకరించిన కృష్ణయ్యను ఒక బల్లపై కూర్చోపెట్టారు. ఆహా! ఆ పురుషోత్తముడు ఎంత ముద్దొస్తున్నాడో! యశోదమ్మ కన్నయ్య నుదిటిపై చిన్న బొట్టు పెట్టింది. కన్నయ్య కాళ్ళు అటూ ఇటూ ఆడిస్తూ, కళ్ళు అటూ ఇటూ కదుపుతూ గోపికల వంక చిరునవ్వు నవ్వుతూ చూస్తున్నాడు. ఆ నల్లనయ్య దివ్యస్వరూపం చూసి వీరందరూ తన్వయత్వంలో మునిగిపోయారు. అప్పుడు యశోద వారితో కలిసి కన్నయ్యకు హారతి ఇచ్చింది.

వారిలో ఇద్దరు గోపకాంతలు చక్కటి మంగళహారతి పాట పాడారు. ఆహా! ఆ పరంధాముడికి ఈ విశ్వం మొత్తానికి కారణభూతుడైన వానికి హారతి ఇవ్వడం ఎంతటి అదృష్టం! మంగళహారతి పాడటం అవ్వగానే యశోదమ్మ వారందరికీ చక్కటి పాయసం గిన్నెల్లో పెట్టి ఇచ్చింది. కన్నయ్యతో పాటు వారందరూ కూడా ఆ పాయసం ఎంతో సంతోషంగా ఆరగించారు.

గోకులంలో మధ్యలో ఒక చోట చక్కటి ఉట్టిని కట్టారు. అక్కడికి పిల్లలు అందరూ చేరారు ఒకటేమిటి దగ్గర దగ్గరలో పది పదిహేను ఉట్టెలు కట్టారు. గోపబాలురందరూ ఒకరిమీద ఒకరు ఎక్కి అలా పైనున్న ఉట్టె కొడుతుంటే ఎంత అద్భుతంగా ఉందో ఆ దృశ్యం! ఇంతలో కన్నయ్య ఆడుతూ పాడుతూ అక్కడకి చేరాదు కన్నయ్యతో పాటు యశోద, నందుడు, బలరాముడు అందరూ అక్కడకి చేరుకున్నారు. ఆహా! ఎంత కోలాహలంగా ఉంది ఆ దృశ్యం. ఒక ప్రక్క గోపికలు రంగు రంగుల పరికిణీలు, ఓణీలు ధరించి కోలాటం ఆడుతున్నారు. మధ్య మధ్యలో కన్నయ్య వేణువుని ఎంతో మనోహరంగా ఊదుతూ వారిని మురిపిస్తున్నాడు.

అక్కడ కొంత దూరంలోనే మరో బృందం కోలాటం ఆడుతున్నారు. అక్కడ కూడా కన్నయ్యే! ఆ గోపికలు కొందరు మధ్యలో ఉన్న కన్నయ్య ముగ్ధమనోహర రూపానికి తనువులు మైమరచి కోలాటం గతి తప్పుతోంది. పక్కన ఉన్న గోపిక వీరిని ఆటపట్టిస్తోంది. ఇదంతా చూస్తున్న కన్నయ్య చిరునవ్వులు చిందిస్తూ తాను కూడా నృత్యం ఆడుతున్నాడు. కన్నయ్య తన చేతిలోని మురళిని ఊదుతూ మధ్య మధ్యలో అటూ ఇటూ తిప్పుతూ ఎంతో అద్భుతంగా నాట్యం చేస్తుంటే ఆ దృశ్యం వర్ణింపశక్యంగా లేదు. ఇంతటి దివ్యదృశ్యాన్ని చూస్తున్న మనం ఎంతటి అదృష్టవంతులం? కన్నయ్య ఇక్కడ నాట్యం చేస్తున్నాడని తెలిసి యశోద ఇటు పక్కకు వచ్చింది. నా చిన్నితండ్రి ఇంత గొప్ప నాట్యం నువ్వెప్పుడు నేర్చుకున్నావు అని ఆశ్చర్యపోయింది. కన్నయ్యను చూసి ఎంతో మురిసిపోయింది.

యాదవులందరూ అక్కడకి చేరుకున్నారు. అక్కడ వారికి మరొక ఆశ్చర్యకరమైన దృశ్యం కనిపించింది. అక్కడ చుట్టూ ఉన్న చెట్లపై ఎన్నో పక్షులు, నెమళ్ళు కనబడుతున్నాయి. ఇంతకు మునుపెన్నడూ చూడని ఎంతో అద్భుతమైన రంగు రంగుల ఈకలతో ఉన్న ఆ పక్షులు ఎంతో ముచ్చటగా ఉన్నాయి. అవన్నీ మధ్య మధ్యలో ఎంతో చక్కటి శబ్దాలను చేస్తున్నాయి. కన్నయ్య నాట్యానికి ఇవన్నీ నేపథ్య సంగీతం అన్నట్లుగా ఉంది. ఆ పైన ఉన్న ఆ పక్షులను చూసి అందరూ ఎంతో ఆశ్చర్యపోయారు. ఎంతో ముచ్చటపడ్డారు. గోపకాంతల మధ్య నృత్యం చేస్తున్న కన్నయ్య మధ్య మధ్యలో తల పైకెత్తి ఆ పక్షుల వంక చూసి చిరునవ్వు నవ్వుతున్నాడు.

ఆ పక్షులు ఎవరో కాదు! అనేక లోకాల నుంచి గోకులానికి వచ్చిన దేవతలు! ఆ రోజు కన్నయ్య జన్మదినం అని తెలుసుకొని ఆ పురుషోత్తముని జన్మదిన వేడుకలను కనులారా చూద్దామని అలా పక్షుల రూపంలో భూలోకానికి వచ్చారు. క్రింద కన్నయ్య అలా నృత్యం చేస్తుంటే వారు ఆనందంతో రకరకాలుగా కూస్తున్నారు. ఆ కూతలన్నీ ఒక విధమైన రీతిలో ఎంతో లయబద్ధంగా కన్నయ్య నృత్యానికి తగ్గట్టుగా ఉన్నాయి ఆహా వినండి! చెవులకు ఆ ధ్వని ఎంత ఇంపుగా ఉందో కళ్ళుమూసుకొని వింటే అవి పక్షుల కూతల్లాగా లేవు! ఎవరో గొప్ప విద్వాంసుడు సంగీత పరికరాలు వాయిస్తున్నట్లుగా ఉంది! అంత అద్భుతంగా ఉంది ఆ ధ్వని! అందుకే క్రింద ఉన్నవారు అంతా కూడా ఆ ధ్వనికి ఎంతో సంతోషిస్తున్నారు. ఆనందంతో ఎంతో పులకరించిపోతున్నారు.

ఇంతలో అక్కడికి చెంగు చెంగున ఎగురుతూ ఒక అద్భుత సౌందర్యరాశి వచ్చింది. చిన్న పిల్ల! ఎంత మెరిసిపోతుందో! బంగారు కాంతులు విరజిల్లే మేనుతో ఆ పాప ఎంతో తేజస్సుతో ప్రకాశిస్తోంది. ఆ కన్నులు చూడండి ఎంత అందంగా, ఎంత ఆకర్షణీయంగా ఉన్నాయో ఆమె ప్రతీ కదలికలో దైవత్వం, ప్రేమ తత్వం, బ్రహ్మానందానుభూతి, జగత్తుకే వెలుగునిస్తున్న తేజస్సు! ఆహా ఎవరీ పిల్ల? ఏదో దేవలోకం నుంచి వచ్చిన

పార్వతీదేవో, లక్ష్మీదేవో కాదుకదా! లేదా ఆ సరస్వతీదేవే ఈ రూపంలో భూలోకానికి వచ్చిందా? ఆ బంగారు లోలకలు, బంగారు హారం, బంగారు గాజులు, బంగారు వడ్డాణం ఎవరు తల్లీ ఈమె అని అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఆమెతోపాటు ఆమె తల్లిదండ్రులు, పరివారం కూడా వచ్చారు చాలా ధనవంతుల బిడ్డ కాబోలు అనుకుంటున్నారు.

ఆమె మరెవరోకాదు! కన్నయ్య ముద్దుబంగారమైన రాధాదేవి! వృషభానుడు, కీర్తి దంపతుల ముద్దుల పుత్రిక. కన్నయ్యకు ప్రాణం! అంతటి ప్రాణమైన రాధ ఈరోజు రాకుండా ఉంటుందా? వృషభానుడు, కీర్తి యశోదమ్మ అందరితో మాట్లాడుతూ ఉంటే రాధ చెంగు చెంగున ఎగురుతూ ఆ గోపికల మధ్యన నుంచొని ఉన్న కన్నయ్య దగ్గరకు వెళ్ళింది. ఆ ఎగరడం చూడండి! అలా గంతులు వేస్తూ, ఎంతో చలాకీగా ఎగురుతూ, గాలిలో తేలిపోతూ కన్నయ్యను చేరుకుంది.

కన్నయ్య ఆమెను చూసి అద్భుతంగా నవ్వాడు. రాధను చూసినపుడు ఆ కన్నయ్య నవ్వే నవ్వును ఎటువంటి పోలికలతోను వర్ణించలేము. కృష్ణయ్య కన్నులు, పెదవులపై ఆ నవ్వు ఈ సృష్టిలో ఎటువంటి ఉపమానాలతోను పోల్చలేము. రాధ కన్నయ్య పక్కచేరి వయ్యారంగా నుంచొని తాను కూడా నృత్యం చేయసాగింది.

చుట్టూ గోపికలు కోలాటం ఆడుతుంటే మధ్యలో రాధా, కృష్ణులు ఎంతో వయ్యారంగా, ఎంతో సుకుమారంగా, ఎంతో రసరమ్యంగా నాట్యం చేస్తున్నారు. వారి అడుగులు భూమిమీద లయబద్ధంగా పడుతూ ఉంటే భూదేవి ఆనందంతో పులకరిస్తోంది. ఇదంతా చూస్తున్న పైన చెట్లపై పక్షుల రూపంలో ఉన్న దేవతల ఆనందానికి అంతులేదు. వారు మరింత వినూత్న, విచిత్ర ధ్వనులతో కూయసాగారు. ఈ లయ ధ్వనులకు ప్రకృతి మొత్తం పరవశించిపోతోంది.

ప్రకృతిలోని ప్రతీ చెట్టు ప్రతీ జీవి ఈ అమృతమైన లయబద్ధ నృత్యానికి పులకరించిపోతుంది. కుందేళ్ళు కన్నులు పెద్దవి చేసుకొని చూస్తున్నాయి. జింకలు ఆనందంతో అటూ ఇటూ పరుగెడుతున్నాయి. ఆనందంతో పరవశులైన గోకులంలోని వారందరూ నృత్యం చేయసాగారు. అక్కడ అంతా ఒక దివ్య వాతావరణం నెలకొంది. యశోద, నందులు రాధాకృష్ణులను చూసి ఎంతో ముచ్చటపడ్డారు.

ఇక్కడ రాధాకృష్ణులు ఇలా నృత్యం చేస్తున్నట్లు గ్రహించి పార్వతీ పరమేశ్వరులు, బ్రహ్మ సరస్వతీ, యాదవులు గోపికల రూపంలో వచ్చి రాధాకృష్ణుల నృత్యం తిలకించ సాగారు. రాధ కృష్ణుని కోసమే జన్మించింది. రాధాకృష్ణులు ఇద్దరూ ఒక్కటే కృష్ణునిలోని ప్రేమ తత్వం అంతా రాధ తత్వమే! అలాగే రాధలోని ప్రేమ తత్వమంతా కృష్ణ తత్వమే! వారి ప్రేమ ఈ విశ్వం మొత్తానికి ఒక దివ్యఅలంకారం. యుగయుగాలు చెరిగిపోని దివ్యముద్ర!

ఇన్ని యుగాలుగా సృష్టికే ఆదర్శమైన ప్రేమ తత్వం రాధాకృష్ణులది. అంతటి ప్రేమ మూర్తులు అలా నృత్యం చేస్తుంటే చూస్తున్నవారంతా ఎంతో ధన్యులు. ఆహా! ఆ వైభవం ఎంత గొప్పగా ఉంది కన్నయ్య అలా నృత్యం చేస్తూఉంటే మధ్య మధ్యలో రాధాదేవి కన్నయ్య పింఛం చూస్తున్నప్పుడు ఆ పింఛం ఎలా మెరిసిపోతుందో చూడండి! కన్నయ్య తలమీద తమ జాతి పింఛం ఉంటుందని నెమలిజాతి మొత్తం పరవశించిపోతుంది. కన్నయ్య చేతిలో వేణువుగా మారిన వెదురుజాతి మొత్తం ఆనందంతో పులకరించిపోతుంది. అవన్నీ తమ అదృష్టంగా భావిస్తున్నాయి.

రాధాకృష్ణుల నృత్యాన్ని అలా చూస్తున్న గోపికల ఆనందం వర్ణించలేనిది. అలా కాసేపు నృత్యం చేశాక కన్నయ్య ఉట్టికొట్టడం కోసం వెళ్ళాడు. మళ్ళీ అక్కడెంతో కోలాహలం! గోప బాలుర పైన ఎక్కి, పైన ఉన్న ఉట్టిని కొట్టి అందులో ఉన్న వెన్ననంతా తాను నోటికి రాసుకొని కింద ఉన్న బాలురపై విసిరాడు. ఆశ్చర్యంగా ఆ వెన్న ప్రతీ బాలుడి నోటి దగ్గరకి చిన్న

చిన్న ముద్దలుగా చేరింది. ఎంత అద్భుతంగా ఉంది ఆ దృశ్యం! చూసినవారందరూ ఎంతో ఆశ్చర్యపోయారు.

అప్పుడు యశోదమ్మ కీర్తి వద్దకు వచ్చి వదినా! పదండి! మనింటికి వెళదాము ఈ రోజు కన్నయ్య పుట్టినరోజు కదా ఎన్నో పిండివంటలు చేయించాను అంది. అప్పుడు కీర్తి ఎంతో సంతోషంగా తప్పకుండా వస్తాను వదినా అంది. ఇది విన్న రాధ ఎంతో సంతోషపడింది. అందరూ కలిసి యశోద ఇంటికి వచ్చారు. అందరు కాళ్ళు కడుక్కొని భోజనాలకు కూర్చున్నారు. రాధ పరుగెత్తుకుంటూ వెళ్ళి కన్నయ్య ప్రక్కనే కూర్చున్నది! ఈ పిల్ల భలేఉందమ్మా అని యశోద వీరిద్దరినీ చూసి మురిసిపోయింది. రాధాకృష్ణులిద్దరూ అలా ప్రక్క ప్రక్కనే కూర్చుని ఉంటే అందరికీ ఎంతో ముచ్చటగా ఉంది.

అప్పుడు వృషభానుడు కీర్తిని రాధను పిలిచి యశోద నందులతో ఇంక మేము మా నగరానికి వెళతాము అన్నాడు. రాధ కన్నయ్య వంకే బెంగగా చూస్తోంది. అప్పుడు యశోద వారితో ఈరోజు రాత్రికి ఇక్కడే ఉండడమ్మా సాయంత్రం పిల్లలు ఆడుకుంటారు రేపు వెళ్ళొచ్చు అంది. దానికి వారిద్దరూ సరే అన్నారు. రాధాకృష్ణుల ఆనందం ఇంక చెప్పాలా సాయంత్రం దాకా ఎందుకు ఇప్పుడే ఆడుకోవడానికి వెళ్తాము అని చేతిలోకి మురళిని తీసుకొని రాధ చేయిపట్టుకొని పరుగెడుతున్నారు. ఈ పిల్లలు భలే ఉన్నారు అని పెద్దలు అనుకుంటున్నారు.

రాధాకృష్ణులు బయటకు వెళ్ళగానే అక్కడున్న గోప బాలురు వీరిని కలిసారు. అందరూ కలిసి ముందుకు పరుగెడుతూ వెళ్ళారు. ఊరంతా రంగు రంగుల పూలతో అలంకరింపబడి ఉండడం చూసి రాధ ఎంతో ముచ్చటపడింది. ఇంతలో అక్కడ బోలెడు చెట్లు కనబడ్డాయి. రాధ కృష్ణుడితో మనం ఇక్కడే ఈ చెట్లు పక్కనే ఆడుకుందాము అని అంది. ఓ అలాగే అన్నాడు కన్నయ్య. అందరూ చెట్ల చుట్టూ తిరుగుతూ పరుగెత్తసాగారు. అప్పుడు కన్నయ్య వాళ్ళని ఆ చెట్ల మధ్యకు పిలిచి ధాముడు అనే పిల్లవాడిని పిలిచి

నువ్వు కళ్ళుమూసుకొని మధ్యలో ఉండు మేమందరం చెట్ల వెనుక దాక్కుంటాము. నువ్వు ఇదిగో ఈ రాధ ఏ చెట్టువద్ద ఉందో కేవలం రెండుసార్లతో కనుక్కోవాలి అన్నాడు. అంతే ధాముడు కళ్ళుమూసుకున్నాడు రాధాకృష్ణులతో సహా అందరూ చెట్ల మధ్యనకెళ్ళి దాక్కున్నాడు.

ధాముడు ఒక చెట్టు వెనక వచ్చి చూస్తే కన్నయ్య కనబడ్డాడు. మళ్ళీ అటూ ఇటూ వెతికి మరో చెట్టువద్దకు వెళితే అక్కడకూడా కన్నయ్యే కనబడ్డాడు. మూడో చెట్టు వెనుకకు వెళితే అక్కడ మళ్ళీ కన్నయ్యే కనబడ్డాడు. కన్నయ్య తనను మోసం చేస్తున్నాడు అనుకుంటున్నాడు అన్ని చోట్ల ఉన్న గోపబాలురు కన్నయ్య రూపంలోనే ఉన్నారు అని గ్రహించలేకపోయాడు. అప్పుడు ధాముడు గట్టిగా నేను రాధను కనుక్కోలేకపోయాను అందరూ బయటకు రండి అన్నాడు. అప్పుడు రాధతో సహా కృష్ణుడు గోపబాలురు అందరూ ముందుకు వచ్చారు.

మళ్ళీ అందరూ చెట్ల మధ్యకు వచ్చారు. అప్పుడు కన్నయ్య రాధతో రాధా! నీ కనులు ఒక గుడ్డతో కడతాను మేము మీ చుట్టూ తిరుగుతుంటాము. నేను ఎక్కడ ఉన్నదీ నువ్వు రెండవసారికే కనిపెట్టాలి. ఓ సరే అంది రాధ. కన్నయ్య చాలా సున్నితంగా రాధ కళ్ళకు తాను తలపై ధరించిన గుడ్డతీసి కట్టాడు. తామందరూ రాధ చుట్టూ తిరగసాగారు.

మధ్యలో రాధ చుట్టూ కన్నయ్య, గోపబాలురు. ఎంత ముచ్చటగా ఉంది ఆ సన్నివేశం రాధ నెమ్మదిగా ఆలోచిస్తూ చిరునవ్వు నవ్వుతూ అడుగులు వేస్తుంది. ఆ అడుగుల్లో ఎంత వయ్యారం, ఎంత లాలసం అలా వేస్తూ ఒక గోపబాలుడికి తాకింది ఓహో ఇది కన్నయ్య కాదు అని అంది. కన్నయ్య స్పర్శ రాధకు తెలీదా ఇద్దరూ ఒక్కరే రాధ మనస్సులో కన్నయ్య! కన్నయ్య మనస్సులో రాధ !

ఇంకో అద్భుతం చెప్పనా! రాధ అలా నడుస్తూంటే తన నీడలో కృష్ణుడు కనిపిస్తున్నాడు ఆహా ఎంత సుందర దృశ్యం! అలా నెమ్మదిగా

వయ్యారంగా అడుగులు వేస్తుంటే చుట్టూ కన్నయ్య, గోపబాలురు తప్పట్లు కొడుతూ తిరగసాగారు. గోపబాలురు అందరి చూపులు రాధ పైననే. కన్నయ్యను ఎలా గ్రహిస్తుందా అని ఆశ్చర్యపోతూ చూస్తున్నారు.

ఇదంతా దూరంనుంచి చూస్తున్న కొందరు గోపకాంతలు రాధ అదృష్టానికి ఎంతో ఆనందపడుతున్నారు. ఆహా రాధ భాగ్యం ఎంతటిది ఏ దేవతో ఈ రూపంలో వచ్చిందేమో లేకపోతే మన కన్నయ్యను స్పృశించే భాగ్యం ఇలా కలుగుతుందా అనుకున్నారు. ఇంతలో రాధకు కన్నయ్య దొరకనే దొరికాడు. గట్టిగా చెయ్యిపట్టుకొని కన్నయ్యవే నువ్వు అంది. అప్పుడు కన్నయ్య చిరునవ్వుతో రాధ కళ్ళకు కట్టిన గుడ్డను నెమ్మదిగా విప్పాడు. రాధ బుగ్గలపై చిన్న ముద్దు ఇచ్చాడు. చుట్టూ గోపబాలురు ఉండడంతో దూరంగా ఉన్న గోపకాంతలు ఈ దృశ్యం చూడలేదు. లేకపోతే రాధ అదృష్టానికి ఎంత అసూయపడేవారో!

ఇంక ఆటలు ఆపి అందరూ నెమ్మదిగా ఇంటిదారి పట్టారు. ఆడుతూ పాడుతూ కన్నయ్య రాధా గోపబాలురతో కలిసి ఇంటివైపు నడవసాగారు. ఆ వెనుక గోపికలు నడుస్తూ రాసాగారు. ఆరోజు కన్నయ్యను చూస్తే వారికి వదలబుద్ధి కావడంలేదు. ఎంత ముద్దుగా ఉన్నాడో! ఎంత అందంగా ఉన్నాడో! దారి పక్కన ఉన్న మల్లెలు, జాజులు కన్నయ్య అందాన్ని చూసి మూతి ముడుచుకుంటున్నాయి. పక్కనే ఉన్న సంపెంగ వృక్షాలలోని సంపెంగలు తెల్లబోతున్నాయి. చేమంతులు కన్నయ్య అందం చూసి చిన్నబోతున్నాయి. గులాబీల గుండెల్లో కన్నయ్య అందం గుబులు పుట్టిస్తున్నదట! ఈ పువ్వులన్నీ కన్నయ్య మెడలో హారంలోకి వెళ్ళే భాగ్యం ఎప్పుడు వస్తుందాఅని ఎదురుచూస్తున్నాయి. ఆ మాధవుడు మనల్ని ఎప్పుడు కరుణిస్తాడా అని అనుకుంటున్నాయి.

అందరూ అలా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తుండగా ఒక్కసారిగా పెద్ద గాలిదుమారం చెలరేగింది. ఆ గాలిని చూసి పిల్లలందరూ భయపడ్డారు.

గట్టిగా కన్నయ్యను పట్టుకున్నారు. కన్నయ్య రాధ చేయి పట్టుకున్నాడు అప్పుడు రాధ ముఖంలో అనుభూతులు చూడాలి. ఆహా ఎంత అద్భుతం! ఆ వదనం చూడండి! ఒక పక్క ఆ గాలినిచూసి బెదురు, ఒక పక్క కన్నయ్య తన చేతిని పట్టుకున్నాడన్న ఆనందం ఈ రెండు భావాలు ఒకేసారి చూపిస్తున్న రాధ దివ్య ముఖారవిందాన్ని కనులారా దర్శించండి. రాధాకృష్ణులారా! మా జన్మ ధన్యమైంది! మిమ్మల్నిద్దర్ని ఇలా చూస్తున్న ఈ దివ్యానుభూతి ఎప్పటికీ, ఎన్ని జన్మలెత్తినా చెదిరిపోకుండా ఉండేలా అనుగ్రహించండి! ఈ దివ్యానుభూతి కలిగిస్తున్న ఆనందం మాకు ఇక వేరే ఇక ఏ ఆలోచనలు లేకుండా చేస్తున్నది కదా!

ఆ గాలిలో ఒక పెద్ద వృక్షం ఎగురుతూ ఇటుపైకే రాసాగింది. ఆ వృక్షం ఎంత పెద్దది అంటే దాని నీడ నూరు మంది మీద పడుతోంది. వేగంగా వస్తున్న ఆ వృక్షాన్ని కన్నయ్య ఎడంచేత్తో ఎత్తిపట్టి ఒక్కసారిగా దూరంగా విసిరాడు. అంత పెద్ద వృక్షం కాస్త అతివేగంగా ఎగురుతూ వెళ్ళి వెళ్ళి దూరంగా ఉన్న ఒక కొండకు తగిలి కొమ్మలన్నీ విరిగి చెల్లాచెదురుగా పడ్డాయి. అందులోనుండి ఒక దేవత ఇటు కన్నయ్య దగ్గరకు వచ్చి నమస్కరించి ఆకాశం వైపు వెళ్ళిపోయాడు.

అతడు ధారుడు అనే దేవత శాపవశాన అలా పెద్ద వృక్షంలా ఉన్నాడు. శ్రీమన్నారాయణుడు కన్నయ్యగా జన్మించినప్పుడు స్వామి చేతి స్పర్శచేత శాప విమోచనం కలుగుతుంది. అదే ఈనాడు జరిగింది. ఇదంతా చూసిన గోపబాలురు, గోపికలు ఎంతో ఆశ్చర్యపోయారు. కాని రాధ మాత్రం ఆశ్చర్యపోలేదు రాధకు కన్నయ్య ఎవరో తెలుసు రాధకు తెలీక ఇంకెవరకు తెలుస్తుంది. రాధాకృష్ణుల ఆటలు ఎంత అద్భుతం మనల్ని ఎంత తన్మయత్వంలో ముంచెత్తుతాయి.

# 13

ఒకరోజు గోకులంలో  పెద్దలందరూ ఒకచోట కలిసి అవి ఇవి విశేషాలు ముచ్చటించ సాగారు. అక్కడ నందుడు, ఉపనందుడు ఇంకా అనేకమంది గోకుల వాసులు ఉన్నారు. అప్పుడు వారిలో ఒకరు నాకు ఒక విషయం చెప్పాలనిపిస్తోంది. మనం ఇంక ఎందుకో ఈ రేపల్లెలో ఉండడం అంత క్షేమం కాదేమో అనిపిస్తోంది. ఇక్కడ మన కన్నయ్యని ఇబ్బంది పెట్టడానికి ఎన్నో సంఘటనలు జరిగాయి. ఆ శ్రీమన్నారాయణుని దయ వలన కన్నయ్య అన్నింటినుంచి బయటపడ్డాడు. ఆ కంసుడు కన్నయ్యను సంహరించడానికి ఎందరో రాక్షసులను పంపించాడు. ప్రతిరోజు మనం ఇక్కడ భయపడుతూ బ్రతకవలసి వస్తోంది. ఇంకా ఇక్కడ మనం ఉండడం ఏమాత్రం క్షేమం కాదు అనిపిస్తోంది అని అన్నాడు. అది విన్న మరొక యాదవుడు కూడా నేను కూడా ఇదే విషయం చెప్పాలని అనుకున్నాను. చిన్నప్పుడే పూతన, తరువాత శకటాసురుడు... ఇలా ఎంతమంది రాక్షసులు

కన్నయ్య మీదకు వచ్చారు. ఆ భగవంతుని దయవల్ల కన్నయ్య బయటపడ్డాడు. ఇక ఇక్కడ ఉండడం మనకి ఏమాత్రం క్షేమకరం కాదు అనిపిస్తోంది అని అన్నాడు.

అప్పుడు నందుడు ఇంతమందిమీ, కుటుంబాలతో, పిల్లా పాపలతో, గోవులతో ఎక్కడకి వెళ్తాము? మనకు అనువైన ప్రదేశం ఏది? అన్నాడు ఆ మాటలు విన్న ఉపనందుడు ఈ పరిస్థితి త్వరలోనే వస్తుంది అని కొన్నిరోజులనుంచి అనుకుంటూనే ఉన్నాను. నేను ఈ మధ్యనే చుట్టుపక్కల ఎన్నో ప్రదేశాలు చూసి వచ్చాను వాటన్నింటిలో నాకు బృందావనం ఎంతో అనుకూలంగా అనిపించింది. ఆ బృందావనమే ఇక మనమందరికి నివాస ప్రదేశం. రేపే మనందరం బయల్దేరి బృందావనం వెళ్ళాలి అన్నాడు అందుకు అందరూ సరే అని అన్నారు. ఆ రాత్రే అందరూ తమ ఇళ్ళల్లోనే సామాన్లు సర్దుకున్నారు. మగవారంతా రాత్రంతా నిద్రపోక ఆ సామాన్లన్నింటినీ బండ్ల నిండా ఎక్కించారు.

ఉదయాన్నే రేపల్లె అంతా కదిలి వరుసగా బళ్ళతో బృందావనం వైపు సాగింది. ఆహా! ఎంత అద్భుతంగా ఉంది ఆ దృశ్యం! అదిగో చూడండి! బారులు బారులుగా అలా ముందుకు వెళుతున్న ఎడ్లబళ్ళు...ముందు ఆలమందలు మధ్యలో ఒక బండిలో నందుడు, యశోద, కన్నయ్య, బలరాములు...కన్నయ్య మదిలో ఎన్నో ఆలోచనలు...తాను ఇక బృందావనం వెళ్ళే సమయం వచ్చింది బృందావనంలో తాను చేయబోయే లీలలు అన్నీ కన్నయ్య మదిలో మెలిగి చిరునవ్వు నవ్వుకుంటున్నాడు. బృందావనంలో జరిగే గోపికలతో ఆటలు రాధతో నృత్యాలు రాసలీలలు...ఇవన్నీ కన్నయ్య మదిలో ఒక దివ్యదృశ్యంలా వెళ్తున్నాయి. జరిగినది, జరుగుతున్నది, జరగబోతున్నది ఆ కన్నయ్యకు తప్ప మరెవరికి తెలుసు. ఒక్క బృందావనమే కాదు మధురలో జరగబోయే సంఘటనలను అటుతరువాత హస్తినాపురంలో జరుగబోయే విశేషాలు, మహాభారత యుద్ధం ఇవన్నీ కన్నయ్య మదిలో మెదులుతూ చిరునవ్వుతో ముందుకు

చూస్తున్నాడు. పక్కన ఉన్న వారెవరికీ కన్నయ్య ఆంతరంగం తెలియదు కదా! ఇంత తెలిసికూడా ఏమీ తెలియని వాడిలాగా చిన్న పిల్లవాడిలాగా అటూ ఇటూ కనిపిస్తున్న నెమళ్ళను, జింకలను చూసి ఆనందపడుతున్నాడని యశోద నందులు తలుస్తున్నారు. బృందావనం తన రాకకై ఎదురుచూస్తోంది అని కన్నయ్యకు బాగా తెలుసు. బృందావనంలోని ప్రతీ చెట్టు, ప్రతీ రాయి, ప్రతీ గడ్డిపరక కూడా ఆ పరంధాముడు బృందావనానికి ఎప్పుడు వస్తాడా అని వేయి కనులతో ఎదురుచూస్తున్నాయి. ఆ ఘడియ రానే వచ్చింది.

వారందరూ అలా ప్రయాణం సాగించి రాత్రి ఒక అనువైన చోట నిద్రించి తరువాత రోజు మరల ప్రారంభించి సాయంత్రానికి బృందావనం చేరుకున్నారు. బృందావనంలో కాస్త అనువుగా ఉన్నచోట ఆ బళ్ళు అన్నీ ఆపి చిన్న చిన్న గుడారాలు వేసుకొని అందరూ రాత్రి అక్కడే పడుకున్నారు. ఆ మరునాడే యాదవులు అందరూ కలిసి గృహాలు కట్టుకోవడం ప్రారంభించారు. అందరూ ఎంతో కష్టపడి ఇళ్ళు కట్టుకోవడానికి కావలసిన సామాగ్రి అంతా తెచ్చుకొని రెండురోజులలోనే ఇళ్ళు కట్టుకున్నారు. వీరందరి రాకతో బృందావనం పరవశించిపోయింది. ఎక్కడ చూసినా కోలాహలం కన్నయ్య గోపబాలురు బృందావనం అంతా పరుగెత్తసాగారు.

బృందావనం ఒక దివ్యక్షేత్రం ప్రేమ తత్వానికి ప్రతీక బృందావనం అదే సమయంలో యోగ తత్వానికి, ముక్తి తత్వానికీ కూడా బృందావనం ప్రతీక.

గోపికలందరూ ప్రేమ తత్వంతో కన్నయ్యకోసం కలవరించి, యోగ తత్వంతో కన్నయ్యను గ్రహించి చివరికి దివ్యానుభూతిని పొంది ముక్తిని పొందారు. గోపికలందరూ ప్రేమతత్వంతో అద్వితీయ యోగ శక్తితో ఆ పరమాత్మ ఆనందతత్వాన్ని అనుభవించి, జీవించి ఉండగానే దివ్యానుభూతిని పొంది ముక్తి తత్వాన్ని పొందారు. ఆహా ఎంత అద్భుత తత్వం గోపికలది! అందుకే కృష్ణయ్యపై గోపికలకు గల ప్రేమ ఇప్పటికీ ఎప్పటికీ నూతనంగా, అమృతప్రాయంగా ఉంటుంది. కన్నయ్యపై

అపారమైన ప్రేమను పెంచుకొని ఆ తత్వాన్ని పూర్తిగా అనుభవించి, ఆనందంలో ఉచ్ఛస్థితికి చేరుకొని ఈ బాహ్యపు ఆలోచనలనుండి అన్ని లౌకిక సుఖాలు, సంపదలు అన్ని కోరికలు దాటి ముక్తిని పొందారు. శ్రీకృష్ణ అవతారంలో గోపికలు, రాధ అనుభవించిన కన్నయ్య ప్రేమ తత్వాన్ని మరెవ్వరూ అనుభవించలేదు. ఆ పరంధాముడు గోపికలకు అపారమైన ప్రేమను అందించి వారిని ఆనంద సాగరంలో ముంచెత్తాడు. ఆ ఆనందం ముక్తిప్రదమట!

అసలు గోపికల భక్తి అర్థం చేసుకోవడం చాలా కష్టతరం అది పూర్తిగా కన్నయ్యకు తప్ప మరొకరికి తెలియదు. ఇంకా విచిత్రం ఏమిటంటే ఒకొక్క గోపికది కృష్ణునితో ఒకొక్క అనుభూతి! ఎవరి అనుభూతులు వారికే ప్రత్యేకం!

గోపికలు ఎప్పుడూ కృష్ణయ్య ప్రేమతత్వంలో మునిగితేలుతూ, ఆత్మానందం చెందుతూ ఎంతో బ్రహ్మానందాన్ని అనుభవిస్తారు. బృందావనం అంతా రాధాకృష్ణుల ప్రేమ తత్వం నిండి ఉంటుంది. బృందావనంలోని ప్రతీ మట్టి రేణువు ఆ కృష్ణయ్య అలనాడు ద్వాపరయుగంలో గోపికలతో నృత్యం ఆడినదే! గోపికలతో సరసాలాడినదే! గోపికలకు అమితానందాన్ని ప్రసాదించినదే! అంతే కాదు రాధా కృష్ణులు ఆడుతూ పాడుతూ తిరిగిన రసరమ్య భూమి ఈ బృందావనం.

కృష్ణయ్య తన వేణువుగానంతో ఎంతో మధురంగావించిన దివ్యధామం ఈ బృందావనం. రాధాకృష్ణుల రాసలీలలు ఎన్నెన్నో! ఎంత అద్భుతం! అంతటి ప్రేమతత్వం ఆ ప్రదేశంలో లీనమై ఈనాటికి కృష్ణుని పూర్తిగా మనసా, వాచా, కర్మణా ఆరాధించే భక్తులకు అమృతవాహినియై అక్కడ ప్రతిధూళి అణువులలో కూడా ఎంతో అద్భుతంగా నేటికీ ప్రవహిస్తోంది.

సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే కన్నయ్యగా నడయాడి అనేకమంది గోపికలతో, రాధతో ప్రేమ తత్వాన్ని ఎన్నో విధాలుగా, ఎన్నో గుణాలతో ప్రకటించిన, ఆవిష్కరించిన ఆ దివ్యక్షేత్రంలో ప్రతీ అణువణువు ఎన్ని యుగాలైనప్పటికీ అదే ప్రేమతత్వం భాసిల్లుతూ అత్యంత తేజస్సుతో నేటికి అక్కడ ప్రకాశిస్తోంది. ఆ కన్నయ్యను, కృష్ణ తత్వాన్ని పూర్తిగా గ్రహించినవారికి ఆ దివ్య అనుభూతి ఇప్పటికి కలుగుతుంది.

ఎప్పుడైతే కన్నయ్య ప్రేమ తత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకొని పూర్తిగా అనుభవించగలుగుతామో మనం కూడా ద్వాపరయుగంలో గోపికలు కలిగిన అనుభూతిని కొంతైనా పొందుతాము. అందులో ఏ మాత్రం సందేహం లేదు అటువంటి దివ్యానుభూతిని అనుభవిస్తున్న మహనీయులు ఇప్పటికీ మన మధ్య ఉన్నారు. కృష్ణయ్య వారి హృదయాలలో ఎప్పటికీ ఉంటాడు వారితో ఆడతాడు, పాడతాడు తన రాసలీలలు అన్నీ వారికి దర్శనమిస్తాడు. వారికి అనేక భావాలలో మిళితమై కనిపిస్తాడు. ఇప్పటికీ తన ఉనికి యొక్క అద్భుత ఆనందాన్ని అనుగ్రహిస్తారు.

ఆ అద్భుత బృందావనంలో కృష్ణయ్య గోపికలకు ఎన్నెన్నో అనుభూతులు ప్రసాదిస్తున్నాడు. వారందరూ అనేకమంది సిద్ధులు, యోగులు ఆ ప్రేమ పొందడానికి, ఆ దివ్యానుభూతిని అనుభవించడానికి ఎన్నో యుగాల నుంచి ఎదురుచూసి ఇప్పుడు లభించి, ఆ తన్మయత్వంలో మునిగితేలుతున్నారు. కృష్ణుడు ఒక్కసారి వారివంక చూస్తేనే మురిసిపోతున్నారు. కొందరు వేణునాదంతో పరవశమౌతున్నారు. కృష్ణుడు బృందావనంలో తిరుగుతూ ఆ గోపికలకు ఎన్నో ముచ్చట్లు తీరుస్తున్నాడు. భక్తుల ముచ్చట్లు తీర్చడమే భగవంతునికి ఎంతో ప్రతీకరం కదా! ఆ కన్నయ్య, ఆ దేవదేవుని స్పర్శానుభూతిని పొందిన గోపికల అదృష్టం ఎంత గొప్పది!

అదిగో ఆ గోపికలిద్దరితో కన్నయ్య ఎలా ఆడుతున్నాడో చూడండి! వారిపేరు లతా, కుసుమ వారు త్రేతాయుగంలో ఇద్దరు మహాత్ములు. జనక

మహారాజు ఆస్థానంలో గొప్ప పండితులు వారు నిత్యం శ్రీరామచంద్రుని చూస్తూ ఉండేవారు. ఆ ముగ్ధ మనోహర రూపం వారిని ఎంతో ఆనందపరిచేది.

ఒకనాడు వీరిద్దరూ శ్రీరామచంద్రునితో మాట్లాడుతున్నప్పుడు అక్కడ ఎవరూ లేరు. అప్పుడు వారిలో ఒకరు రామయ్యతో ఇలా అన్నారు. రామచంద్రా! నీవు శ్రీమన్నారాయణుడివే! దీనిలో ఏ మాత్రం సందేహం లేదు! మాకు ఈ విధంగా దర్శనమిస్తూ ఎంతో అనుగ్రహించారు. మా జన్మలు ధన్యమవ్వడానికి ఇంకా ఏమి కావాలి? ఎందరో మహాపురుషులు నిన్ను ఒక్కసారైనా దర్శించుకోవడానికి ఎన్నో వేల సంవత్సరాలుగా తపిస్తున్నారు. కాని వారు వారి కర్మలు ఇంకా పూర్తికాక నీ అనుగ్రహం లభించక ప్రస్తుతం వేరే దేశాలలో జన్మించి నీ ఉనికి గ్రహించలేక ఇక్కడకి రాలేక ఉన్నారు. అటువంటిది నిన్ను నీ నిజరూపాన్ని తెలుసుకొనగలిగాము అంతకుమించిన భాగ్యం ఏముంది? మా ఇద్దరిది ఒకే కోరిక వచ్చే ద్వాపరయుగంలో నీవు శ్రీకృష్ణునిగా జన్మిస్తావు. అప్పుడు ఎందరు యోగులు గోపికలుగా జన్మిస్తారు. అప్పుడు మా ఇద్దరికీ కూడా గోపికలుగా జన్మించే అదృష్టాన్ని ప్రసాదించమని వేడుకుంటున్నాము అని ఆ పండితులిద్దరూ ఆ రామచంద్రుని అర్థించారు.

ఇది విన్న శ్రీరామచంద్రుడు ఓ మహాత్ములారా! మీ పూర్వజన్మ పుణ్యఫలం వలన ఈ జన్మలో నన్ను దర్శింపగలిగారు. మీరు తప్పక రాబోయే ద్వాపరయుగంలో గోకులంలో జన్మించి నాతో ఎన్నో సంవత్సరాల పాటు ఎంతో సన్నిహితంగా ఉండి నా అనుగ్రహం పొందుతారు అని వారు చెప్పారు. వారు ఎంతో సంతోషపడి శ్రీరామచంద్రుల వారికి నమస్కరించి వెళ్ళిపోయారు.

వారే ఈ ద్వాపరయుగంలో లత, కుసుమ అనే పేర్లతో ఒక యాదవ కుటుంబంలో జన్మించారు. పుట్టినప్పటినుంచి వారికి ఇదే ధ్యాస ఆ కన్నయ్య ఎప్పుడు వస్తాడో ఎప్పుడు చూడగలుగుతామా అని. ఇదిగో ఈ రోజు వారిద్దరూ కన్నయ్యను ఇలా కలుసుకున్నారు. వీరి మనస్సులో ఉన్న ఆలోచన

తెలిసి కన్నయ్య వారిద్దరినీ కౌగిలించుకున్నాడు. అప్పుడు వారి అనుభూతి చెప్పనలవి కానిది. ఒక్క నిమషం లతని కౌగిలించుకొని, నుదిటిపై ముద్దు పెట్టి ఎంతో ప్రేమతో తల నిమిరాడు అప్పుడు లతకు కలిగిన అనుభూతి ఎంత గొప్పది అంటే ఈ విశ్వంలోని ప్రేమ తత్వం మొత్తం తనని కమ్మేసినట్లు, తనని ఆవహించినట్లు అయిందట. మరి ఈ విశ్వంలో ప్రేమైక హృదయాలలో, ప్రేమ స్వరూపాలలో భాసిల్లేది ఆ కృష్ణ తేజస్సే కదా! కృష్ణయ్య కౌగిలితో ఆ గోపికకు ఒక్కసారిగా ఈ విశ్వంలోని ప్రేమామృతం మొత్తం ఒక ధారలా కురిసిందట! ఆహా ఎంత దివ్య అనుభూతి!

అటు తరువాత కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ కుసుమను కౌగిలించుకున్నాడు. అప్పుడు కుసుమకు ఈ సృష్టి మొత్తాన్ని కౌగిలించుకున్న దివ్యానుభూతి కలిగిందట! సృష్టిలో ఉన్న సరస్సులన్నింటిని, అద్భుత పూల మొక్కలన్నింటిని ఇలా ఈ సృష్టిలో అత్యంత ఆనందాన్నిచ్చే ప్రతీ ఒక్కటిని, అసలు ఈ విశ్వం మొత్తం కౌగలించుకున్న అద్భుత అనుభూతి కలిగిందట కుసుమకు. ఆమెకు కృష్ణుడు కనిపించడం లేదు! అసలు ఏ విషయ వాసన లేదు! తాను ఎవరు, తాను ఎక్కడ ఉన్నది తెలియడంలేదు.

ఆక్షణంలో ఆకన్నయ్య స్పర్శ అలా తగలగానే వారి ఆత్మలతో ఈ విశ్వంలో లీనమైనట్లు! ఈ విశ్వంలోని ఆనంద తత్వం అంతా తనను కప్పేసినట్లు అనిపించింది. ఆ పురుషోత్తముని దివ్య తత్వం మొత్తం మన ఆత్మకు ఎప్పుడు అనుభవానికి వస్తుందో అదే మోక్షం, అదే ముక్తి. ఈ సమస్త జీవకోటి ఆ ముక్తికోసమే కోట్లాది సంవత్సరాలుగా ఎదురు చూస్తుంది! అది ఎంతో భాగ్యం ఉన్న వారికి గాని లభించదు. శాస్త్ర అధ్యయనం వలన గాని, ఎన్నో జన్మల తపస్సు వలన గాని ఎన్నో జన్మలలో ఆ పరమేశ్వర తత్వాన్ని ఎన్నో విధాలా స్పృశిస్తున్న గాని ఆ ఆనందాన్ని అర్థం చేసుకోవడం, అనుభవించడం కలుగదు.

ఆ పురుషోత్తముని దివ్య ప్రేమ తత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకొనడానికి ఆ స్వామి అనుగ్రహం కావాలి. అది పూర్తి ఆర్తితో ఈ సృష్టిలో

ప్రతిదానియందు ఉన్నది ఆ పురుషోత్తముడు ఒక్కడే అని గ్రహిస్తూ, ప్రతి జీవిలోను ఆ కృష్ణ పరమాత్మను, ఆ దివ్య ప్రేమ తత్వాన్ని పూర్తిగా చూసినవారికి ఈ దివ్య అనుభూతి కలుగుతుంది. గోకులంలోని గోపికలందరికి ఈ దివ్య అనుభూతే లభించింది.

# 14

ఒకనాడు కృష్ణుడు బృందావనంలో స్నేహితులతో కలిసి నడుస్తున్నాడు. ఇలా కొంత దూరం వెళ్ళాక అక్కడ వీధి ప్రక్కనే నారింజ పళ్ళు అమ్ముకుంటున్న ఒక వయస్సు మళ్ళిన వ్యక్తి కనిపించాడు. అతడు తన ఎదురుగా ఒక గుడ్డ మీద నారింజ పళ్ళు కోసుకొని కాళ్ళు ముడుచుకొని కూర్చొని ఎవరు కొంటారా అని ఎదురుచూస్తున్నాడు. అక్కడ పళ్ళు కూడా ఏమంత ఎక్కువ లేవు. మహా ఉంటే ఒక ఇరవై దాకా ఉంటాయి. అతనిని దాటి ముందుకు వెళ్ళిన కన్నయ్య ఏదో గుర్తు వచ్చినవాడిలాగా వెనక్కి వచ్చి ఆ తాత దగ్గరకి వచ్చి తాతా నాకు రెండు పళ్ళు ఇస్తావా అన్నాడు.

ఆ తాతకు కనుచూపు సరిగా కనిపించడం లేదు.కంటి మీద చేతులు పెట్టుకొని ఇలా కళ్ళు చిట్లిస్తూ కన్నయ్య వంక చూసాడు. కన్నయ్య కొన్ని నాణేలు తీసి అతనికి ఇవ్వబోయాడు. అతను తీసుకోబోతున్నవాడల్లా ఒక్కసారి ఆగాడు...అంతే ఆ తాత కనుల వెంబడి నీళ్ళు కారాయి. కన్నయ్య

నువ్వు వచ్చావా నా దగ్గర పళ్ళు కొనడానికి... ఈ సృష్టి అంతా నీదే కదయ్యా నన్ను అనుగ్రహించడానికి కాకపోతే నా దగ్గర పళ్ళు కొనడమేమిటి ఆ పురుషోత్తముడివి నీవే స్వయంగా వచ్చావా కన్నయ్య అని ఎంతో ఆనందపడ్డాడు.

ఇక్కడ మనం ఒక విషయం గమనించాలి. ఆ తాతకి అప్పటిదాకా కన్నయ్య గొప్పతనం గురించి తెలియదు. గోకులంలో ఒక గోపబాలుడు ఎన్నో అద్భుతాలు చేస్తున్నాడుట అని ఆనోట ఈనోట విన్నాడు. అంతే తప్ప కన్నయ్యను ఇంత దగ్గరగా చూడలేదు. కన్నయ్య దగ్గరకి రాగానే ఆ దివ్య తేజస్సును ఆ తాత ఆత్మ గ్రహించింది. అంతే అతడి నోటి వెంట అప్రయత్నంగా ఈ మాటలు వచ్చేస్తున్నాయి. ఆత్మ మహదానందపడి స్వామిని గుర్తించి అప్రయత్నంగా నోటి నుండి ఈ మాటల్ని పలికిస్తోంది. అలా మాట్లాడుతున్న ఆ తాతను చూసి కన్నయ్య అయ్యో తాత ఈ నాణేలు తీసుకో అన్నాడు. అప్పుడు తాత స్వామి పురుషోత్తమా నీ దగ్గర నాణేలు తీసుకొని నన్ను ఋణగ్రస్తున్ని చేస్తావా. నాణేలు తీసుకున్న నేను ఎన్ని జన్మలెత్తి ఎంత గొప్ప భక్తుడినై నీ భక్తిలో మునిగి నీకు తీర్చాలి కదా! నాలో అంతటి శక్తి ఎక్కడ ఉంది స్వామి అందుకే కన్నయ్యా! నీ నాణేలు నీవద్దన్నే ఉండనీ! ఇదిగో ఈ రెండు పళ్ళు తీసుకో నన్ను ధన్యుడిని చెయ్యి అన్నాడు.

అప్పుడు కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ నాణేలు జేబులో వేసుకొని తాత ప్రక్కనే కూర్చొని ఒక నారింజ పండు వలుచుకొని ఒక తొన తాను తిని మిగిలిన తొనలు స్నేహితులకు పెట్టాడు. ఇదంతా అటు వెళ్తూ చూస్తున్న గోపికలు ఆ తాత భాగ్యానికి ఎంతో ఆనందపడ్డారు. భక్తపరాయణుడైన కన్నయ్య అక్కడితో ఊరుకోలేదు. తాత నువ్వు నాణేలు ఏమి తీసుకోలేదు కదా నాకా నీ వద్ద ఊరికే తీసుకోబుద్ధి కావడంలేదు ఎలా అని చెప్పి నేను నీకు కాసేపు వేణువు ఊది వినిపిస్తాను సరేనా అన్నాడు. కన్నయ్య తాత పక్కనే కూర్చొని తాతకి వినపడేలా చక్కగా వేణువు ఊద సాగాడు ఆహా ఎంత అద్భుతంగా ఉంది ఆ దృశ్యం!

కన్నయ్య వేణుగానానికి పరవశించుపోయాడు తాత! పక్కన ఉన్న గోపబాలురు, అటుగా వెళుతున్న గోపికలు, యాదవులు ఈ దృశ్యం ఎంతో వింతగా చూడసాగారు. కన్నయ్య వేణునాదంతో జగత్తు అంతా పరవశించిపోయింది. తాత అలా వింటూనే ఉన్నాడు. అలా కన్నయ్య వేణునాదం వింటుంటే ఆ తాత తీసుకున్న వేల జన్మల ప్రారబ్ధకర్మ పూర్తిగా ఈ అమృత వర్షంలో కరిగిపోయింది. ఈ అమృత గానం వలన ఆ తాత ఆత్మకు కలిగిన జ్ఞానాగ్నిలో ఇన్నివేల జన్మల ప్రారబ్ధకర్మ పూర్తిగా నశించిపోయింది. ఆ తాత ధన్యుడయ్యాడు.

ఇక్కడ మీకు ఇంకొక విషయం చెప్పాలి. ఈ తాత త్రేతాయుగంలో దివ్యవ్రతుడు అనే అతి సామాన్య జీవి. అతడు ఒక ధనికుడి నారింజతోటకు కాపలాదారుడిలా ఉండేవాడు. అలా కాపలాగా ఉన్నందుకు దివ్యవ్రతుడికి అతడి యజమాని నెల జీతంతో పాటు రోజు ఒక ఇరవై పళ్ళు ఇచ్చేవాడు. అవి అమ్ముకొని మరికొంత సొమ్ము సంపాదించుకునేవాడు.

అయితే దివ్యవ్రతుడికి ఒక కోరిక ఉండేది. ఎలాగైనా ఈ పళ్ళు తీసుకెళ్ళి ఆ శ్రీరామచంద్రుడికి కానుకగా ఇవ్వాలి. ఇలా అనుకొని అతడు ఎన్నో సార్లు ఒక గుడ్డనిండా పళ్ళు కట్టుకొని రామయ్యకి ఇవ్వాలని ఆశతో నగరానికి వచ్చేవాడు. కాని అక్కడ కాపలా భటులు ఇతన్ని ఎప్పుడూ లోనికి రానీయట్లేదు. ఇలా ఎన్నో సార్లు ప్రయత్నించాడు వారిని ఎంత ప్రాధాయపడినా వారు ఇతడిని లోపలకి పంపేవారు కాదు.

అలా అతడి జీవితం తాను ఎంతో ప్రేమించే, ఎంతో ఆరాధించే శ్రీరామచంద్రమూర్తికి పళ్ళు ఇవ్వకుండానే ముగిసింది. అతడికి ఇది తీరని కోరికగా మిగిలింది. కాల క్రమంలో దివ్యవ్రతుడు తన ప్రారబ్ధకర్మలను అనుసరించి అనేక జన్మలు ఎత్తుతూ ఇప్పుటి ద్వాపరయుగంలో ఈ జన్మలో ఈ ప్రదేశంలో జన్మించి అదికూడా కన్నయ్య ఉన్న ప్రాంతంలోకి వచ్చి పళ్ళు అమ్ముకుంటూ నివశిస్తున్నాడు.

ఇటుగా ఆడుతూ పాడుతూ స్నేహితులతో కలిసి వెళుతున్న కన్నయ్యకి ఆ పాత పూర్వజన్మ వృత్తాంతం అంతా తెలిసి ఇతడి ముచ్చట తీర్చాలని తలచి ఇలా అతడి వద్దకు వచ్చి పళ్ళు తీసుకున్నాడు. చూసారా ఆ కన్నయ్య అనుగ్రహం ఎంతటిదో! వేరే ఆలోచన లేకుండా ఎప్పుడూ తన పైనే మనస్సును లగ్నం చేసే ప్రేమ జీవులను ఎంతో ఆప్యాయంగా దగ్గరకి తీసుకునే అమృత మూర్తి మన కన్నయ్య!.

# 15

ఆరోజు కృష్ణుడు ఎంతో సంతోషంగా ఉన్నాడు. బృందావనం అంతా ఎంతో సంతోషంగా తిరుగుతున్నాడు. గోపికలు, యాదవులు కన్నయ్యతో ఆడుకుంటున్నారు. ఇంతలో నేను కూడా అక్కడకి వచ్చాను. అప్పుడు నేను ఒక గోపబాలుడిలాగా ఉన్నాను. కన్నయ్య నన్ను బృందావనంలో అటూ ఇటూ తిప్పుతూ ఎన్నో విశేషాలు చెప్తున్నాడు. ఆరోజు నాతో పాటు ఇద్దరు గోపబాలురు కూడా ఉన్నారు. మేమందరం కలిసి ముందుకు నడుస్తున్నాం. కొంతదూరం వెళ్ళాక కన్నయ్య పక్కన కనిపించిన ఒక బండరాయిపై కూర్చున్నాడు. నన్ను తన పక్కనే కూర్చొనమన్నాడు. ఆ రాయి పై మరొక్కరు మాత్రమే కూర్చొనే అవకాశం ఉంది. మాతో వచ్చిన గోపబాలురిద్దరూ ఏదో ఆడుకుంటూ కొంచెం దూరంగా వెళ్ళారు.

అప్పుడు కన్నయ్య నాతో ఇలా చెప్పసాగాడు. ఇదిగో ఇప్పుడు నేను చెప్తున్న విషయాలు చాలా సావధానంగా విను! వచ్చే కలియుగంలో ఈ

విషయాలన్నీ ప్రజలందరికీ తెలియాలి ముఖ్యంగా నా భక్తులకు తెలియాలి ఇవన్నీ తెలిసికున్నవారందరూ ఎంతో సంతోషపడతారు. ఇలా కన్నయ్య నాతో చెప్తుండగా కన్నయ్యకు వెనుకగా దగ్గరలోనే రెండు నెమళ్ళు వచ్చి వాలాయి. నేను వాటివంక చూసాను.

అప్పుడు కన్నయ్య నాతో ఇలా అన్నాడు. ఈ నెమళ్ళు రెండు ఇద్దరు యోగులు. త్రేతాయుగం నుంచి ప్రతీ యుగంలో అనేక కాలాలలో ఈ సృష్టిలో ధర్మం నిలపడానికి జన్మిస్తున్నారు. ఇటువంటి యోగులు అన్ని యుగాలలోను ఈ భూమిపై ఉంటారు. వారి వలన ధర్మం కాపాడుతూ ఉంటుంది. వారు కొన్ని జన్మలలో మానవులు గాను, కొన్ని జన్మలలో పక్షులగాను, మరికొన్ని జన్మలలో ఆవుల వంటి సాధుజంతువులగాను జన్మిస్తారు.

మానవునిగా జన్మించినప్పుడు వారిలో కొందరు ధర్మ ప్రచారం కోసం వేద శాస్త్రాలను, పురాణాలను ప్రజలకు అర్థమయ్యే సులభరీతిలో భోదిస్తారు. మరికొందరు గొప్ప సంగీతకారులై వారి సంగీతం చేత ఈ ప్రపంచంలో ఎంతో గొప్ప ప్రకాశం కలిగిస్తారు. వారి అద్భుత నాదం వలన వారున్న ప్రదేశాలలో ఎన్నో యోజనాల వరకు దివ్యతరంగాలు ప్రసరిస్తాయి. దాని వలన మానవుల మనస్సులో చెడుదారి పట్టకుండా మంచి మార్గంలో పయనిస్తారు. వారి ఆలోచనలు, దృక్పథం వారిని మంచి మార్గం వైపు పయనింపచేస్తాయి.

కన్నయ్య ఇంకా ఇలా చెప్పసాగాడు. ఈ ద్వాపరయుగంలో నేను భూమిమీద ఉన్న కాలంలో నన్న అనేకమంది కలుస్తారు. వారి వారి పుణ్యఫలాలను బట్టి వారి వారి ఆధ్యాత్మిక శక్తిని బట్టి నా తత్వం వారు అర్థం చేసుకోగలుగుతారు. చాలామందికి నేను సామాన్య మానవుని లాగానే కనిపిస్తాను. అయితే ఎన్నో జన్మలలో పుణ్యం చేసుకొని నాకు సన్నిహితంగా వచ్చినవారు కలియుగంలో అప్పుడప్పుడు కొన్ని వందల సంవత్సరాలకు

ఒకసారి భూమిమీద జన్మించి గొప్ప శాస్త్రకారులిగా, గొప్ప సంగీత విద్వాంసులుగా జన్మిస్తారు. కాసేపు మనం ఇక్కడ ఇలాగే కూర్చొందాము. నీకొక అద్భుతం చూపిస్తాను అన్నాడు.

ఇలా కన్నయ్య నాతో అంటూ ఉండగా అక్కడకి ఒక్కసారిగా ఇరవై మంది గోపబాలురు బిలబిల పరుగెత్తుకుంటూ వచ్చారు. నాకు కొంచెం ఆశ్చర్యం వేసింది. ఇంతమంది పిల్లలు ఒక్కసారిగా రావడం ఏమిటి అని అనుకున్నాను. ఇందులో శ్రీకృష్ణుల వారి ఆంతర్యం ఏదో ఉంటుంది. అనుకున్నాను. ఈ గోవిందుని సంకల్పంతోనే వీరందరూ ఇక్కడకి వచ్చారని అర్థమయింది. వచ్చిన వారంతా గోవిందుని వంకే ఎంతో ఆనందంగా చూడసాగారు. ఆశ్చర్యం ఏమిటంటే ఈ పిల్లలు మామూలుగా అటూ ఇటూ పరుగెడుతూ ఆడుకుంటూ ఉంటారు. కాని ఇలా వచ్చి ఏమాత్రం కదలకుండా ఇలా బుద్ధిగా కూర్చున్నారంటే ఏదో విశేషం ఉండి ఉంటుంది అనుకున్నాను.

ఇదంతా ఎప్పటిమాట? ద్వాపరయుగంలో చివరిలో కృష్ణుని వయస్సు దాదాపు పన్నెండేళ్ళు ఉండొచ్చు. ఆ కన్నయ్య అనుగ్రహంతో నేను ద్వాపరయుగానికి వెళ్ళి ఆరోజు ఆ స్వామి పక్కన ఉండి అన్ని విషయాలు అవగతం చేసుకుంటున్నాను. ఎంతటి దివ్యానుభూతి ఇది! ఎంతటి మధురానుభూతి ఇది!

అప్పుడు కన్నయ్య దగ్గరలో ఉన్న పిల్లవాడిని పిలిచాడు. విశ్వా! ఇలా రా అన్నాడు. అతడి పేరు విశ్వకీర్తి ఆ పిల్లాడి వయస్సు సుమారు పది సంవత్సరాలు ఉంటుంది. కన్నయ్య తన వద్దున్న మురళిని ఎంతో మనోహరంగా వాయించాడు. ఆ మురళీగానానికి ప్రకృతి మొత్తం పరవశించి వరుణుడు సంతోషించి సన్నటి నీటి తుంపరులు కురిపించాడు. కన్నయ్య ఒక్కసారి అలా వేణువూదుతూ తల పైకెత్తి ఆకాశం వైపు చూసేటప్పటికి వరుణుల వారికి అర్థమయ్యి నీటి తుంపరులు ఆగిపోయాయి.

అప్పుడు అటుగా ఒక అద్భుత నెమళ్ళ సమూహం వచ్చి దూరాన ఉండి కన్నయ్య వేణుగానం వింటోంది. ఆ నాదం ఎంత అద్భుతంగా ఉందో! ఆ రోజు మరీ దివ్యంగా ఉంది అనిపిస్తోంది. ఆ నాదానికి అక్కడున్న పిల్లలందరూ ఒక గొప్ప అనుభూతిని పొందుతున్నారు. నేను ఎంతో ఆనంద స్థితికి చేరుకొని ఇదంతా గమనిస్తున్నాను. అప్పుడు కన్నయ్య విశ్వకీర్తిని పిలిచి విశ్వా! ఒక్కసారి ఈ వేణువు ఊదు అన్నాడు. ఇప్పటిదాకా నేను పలికిన రాగం పలుకు అన్నాడు. అప్పుడు ఆ పిల్లాడు వేణువు తీసుకొని వస్తుందో రాదో అన్నాడు. కన్నయ్య అతనితో తప్పకుండా ఎంతో మనోహరంగా వస్తుంది. చక్కగా ఊదుతావు నువ్వు అన్నాడు.

అప్పుడు విశ్వకీర్తి ఆ వేణువుని నెమ్మదిగా ఊదసాగాడు. మొదట్లో నెమ్మదిగా వచ్చిన ఆ నాదం కొన్ని నిమషాలలో ఎంతో అద్భుత స్థితికి చేరుకుంది. కన్నయ్య రెండు చేతులు ఇలా చెంపలపై పెట్టుకొని ఆ పిల్లవాడి వంక ముచ్చటగా చూడసాగాడు. అలా ఒక పదినిమషాలు గడవగానే అతని నుంచి మురళిని కన్నయ్య తీసుకున్నాడు. ఆ పిల్లవాడు ఆనందంతో కన్నీరు కార్చాడు. కన్నయ్య మురళిని ఊదడమంటే సామాన్యమా ఆహా ఎంత భాగ్యం ఆ ఆత్మ ఎంతో మురిసిపోయింది. ఒక దివ్య అనుభూతి పొందింది. ఎన్ని జన్మల నుంచో ఈ అదృష్టం కోసమే కదా ఎదురు చూసింది. అయితే విచిత్రం ఏమిటంటే ఆ పిల్లవాడి ఆత్మ ఇదంతా గ్రహిస్తున్నది గాని అతని బాహ్య స్థితిని మాత్రం మాయ కప్పేసింది. కృష్ణమాయ పూర్తిగా ఆవరించింది. అందువలన ఆ పిల్లవాడు ఎంతో అమాయకపు, సహజనవ్వుతో ఎంతో ముచ్చటగా ఉన్నాడు.

అటు తరువాత కన్నయ్య మరో పిల్లవాడిని పిలిచాడు. తాను చేతిలో పట్టుకున్న మురళిని తాను రెండు నిమషాలు ఊది మరొక పిల్లవాడిని ముందుకు పిలిచి నువ్వు కూడా ఊదమని చెప్పాడు. ఆ పిల్లవాడు ముందు కాసేపు బెరుకుగా ఉన్నా తరువాత ధైర్యం తెచ్చుకొని ఎంతో ఆనందంగా ఆ మురళిని ఊదాడు. ఆహా ఎంత అద్భుతంగా ఉంది ఆ వేణునాదం! మరి

ఊదుతున్నది ఎవరి మురళిని! ఆ కన్నయ్యదే కదా! కాకపోతే ఇంతటి మధురగానం, దివ్యానుభూతి ఎలా సాధ్యం?

ఇలా కన్నయ్య ఒకరి తరువాత మరొక పిల్లవాడిని పిలిచి ప్రతీ ఒక్కరినీ తన వేణువు ఊదమన్నాడు. అందరూ ఎంతో ఆనందంతో కన్నయ్య వద్ద నుంచి వేణువు తీసుకొని ఊదారు. ఆహా ఎంత దివ్య అనుభూతి అది!

ఇదంతా పైనుంచి చూస్తున్న దేవతలు ఎంతో ఆశ్చర్యపోయారు. శ్రీకృష్ణుల వారి లీలలు సామాన్యంగా ఉండవు కదా అనుకుంటున్నారు. ఆ దివ్య పురుషులు ఎవరిని ఎప్పుడు ఎలా కరుణిస్తాడో ఎవరికి ఎరుక. ఆ గోపబాలురు ఎంతటి అదృష్టవంతులు. సాక్షాత్తూ ఆ కృష్ణ పరమాత్మ వేణువు తీసుకొని ఊదుతున్నాడు అంటే అంతకు మించిన భాగ్యం ఏముంటుంది. దేవతలందరూ క్రింద బృందావనంలో జరుగుతున్న ఈ కృష్ణలీల చూసి ఎంతో ఆనందపడ్డారు.

కాసేపు అలా అందరికీ తన వేణువునిచ్చి అందరినీ ఊదమన్నాడు. అటుతరువాత ఆ పిల్లలందరూ అక్కడ నుంచి ఎంతో ఆనందపడుతూ వెళ్ళిపోయారు. అప్పుడు కన్నయ్య నాతో ఇలా చెప్పాడు. చూడు వీరందరూ ఇంతకుముందు జన్మలలో ఎంతో పుణ్యం చేసుకున్నవారు. ఇంతకుముందు యుగాలలో ఎంతో ధర్మమార్గంలో జీవించినవారు. మీరందరూ నాకు మిక్కిలి ఆప్తులు వీరంటే నాకెంతో అభిమానం. మీరు వచ్చే యుగాలలో వివిధ కాలాలలో జన్మించి తమ సంగీతం చేత, కొందరు వేణునాదం చేత లేదా కొందరు గాత్రసంగీతం ద్వారా అందరినీ రంజింపచేస్తారు. కొందరు వివిధ వాద్యకారులుగా ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చుకుంటారు. ప్రజలను తమ వాద్యంతో తమ వాయిద్యగానంతో ఎంతో మంత్ర ముగ్ధులను చేస్తారు. వీరిలో కొందరు నిన్ను ఈ జన్మలో కలిసారు కూడా. మరికొందరు త్వరలో కలవబోతున్నారు అని కన్నయ్య ఆరోజు నాకు చెప్పాడు. ఎంత అద్భుతం ఎంత కరుణ అంతేకాదు వారు ప్రస్తుత కలియుగంలో ఏఏ కాలాలలో ఎక్కడ జన్మించినది ఏఏ పేర్లుతో వారు జీవించినది కూడా చెప్పారు. కొన్ని దైవ

సంబంధ కారణాల వల్ల ఆ పేర్లను, ఆ వ్యక్తుల వివరాలను నేను ఇక్కడ తెలియపరచలేకపోతున్నాను. కాని విజ్ఞులైన మీరు వీరిలో కొందరిని తప్పక గుర్తుపడతారు.

ఆరోజు కన్నయ్యతో అంత అద్భుతంగా గడిచింది. అలా ఇరవై మంది బాలురు ఒకరి తరువాత ఒకరు ఎంతో అద్భుతంగా వేణునాదం చేస్తూ ఉంటే మధ్య మధ్యలో కన్నయ్య తానే వేణుగానం చేస్తుంటే ప్రకృతి ఎంతో పరవశించిపోయింది. అటుగా వెళుతున్న గోపకాంతులు అలా నోట మాట రాకుండా చూసారు. చెట్లపై ఉన్న పక్షులు ఆకాశంలోని దేవతలు ఇదంతా ఎంతో ఆనందంతో తిలకించారు. శ్రీకృష్ణుల వారి అనుగ్రహం అంతగొప్పగా ఉంటుంది.

కన్నయ్య ప్రేమతత్వం బృందావనం మొత్తం వ్యాపించింది. కన్నయ్య రాకతో బృందావనం మొత్తం పులకించింది. ఈ వనంలో, ఈ అడువుల్లో, ఈ కొండల్లో, ఈ యమున ఒడ్డున ఇన్ని యుగాలుగా ఎందరో మహాపురుషులు సంచరించి వెళ్లారు. ఎందరో దేవతలు ఇక్కడ వనాలలో విహరించారు. అయినా ఇక్కడ ఉన్న ప్రతీ వృక్షానికి ప్రతీ జీవికి ఇంకా ఏదో వింతగానే ఉందట. కృష్ణయ్య ఇచ్చే ఆనందం, కృష్ణ స్వరూపాన్ని దర్శించడం సాంగత్యం, సాన్నిహిత్యం అనుభవించడం, ఆ స్పర్శ దివ్యానుభూతి ఒక్క కనురెప్ప పాటైనా అనుభవించడం...దీని కోసమే, ఈ బ్రహ్మానందం కోసమే ఇవన్నీ, ఇక్కడి అందరూ నిరీక్షిస్తున్నారు.

కన్నయ్య రానే వచ్చాడు. ఇక బృందావనం ఆనందం ఇంతా అంతా అని చెప్పనలవి కాదు. యమునా నది కన్నయ్య వచ్చాడు అని తెలుసుకొని వయ్యారంగా వంకలు తిరుగుతూ ఆ కన్నయ్య పాద స్పర్శ ఎప్పుడు తగులుతుందా అని చూస్తుంది. రాధాకృష్ణుల పవిత్ర, ప్రేమైక పాదాలను ఎప్పుడు తాను తాకగలదు అని ఎంతో ఆత్రంతో ఎదురుచూస్తున్నది. ఆ అమృత ఘడియలు రానే వచ్చాయి. యమున ఆనందం పట్టలేకపోయింది. ఆ కెరటాలు కిందకి పైకి వయ్యారంగా ఎగురుతూ కదులుతూ తుళ్ళి పడుతూ ప్రవహిస్తున్నాయి.

# 16

బృందావనంలో గోపికలు, గోపబాలురు, యాదవులు నిత్యం కన్నయ్య లీలలే తలుచుకుంటూ ఆనందిస్తున్నారు. ఇక గోపికల ఆనందం అయితే చెప్పనక్కర్లేదు. ఎన్ని యుగాలుగా ఈ నిరీక్షణ! గోపికల విరహం, కన్నయ్య ప్రేమ తత్వం అక్కడి గాలిలో ప్రతిబింబించి ఒక గొప్ప అనుభూతిని కలిగిస్తున్నాయి. ఇటువంటి దివ్యానుభూతిని పొందుతున్న అక్కడి సకల జీవులు ఎంత అదృష్టం చేసుకున్నాయో కదా! ఆ దివ్య వైభవం, దివ్య తేజస్సు అక్కడి భూమిలో, ప్రతీ చెట్టులో, ప్రతీ రాయిలో, ప్రతీ ధూళికణంలో నిక్షిప్తమై ప్రకాశిస్తూ ఉంది. ఆ తత్వాన్ని, కృష్ణ తత్వాన్ని పూర్తిగా తెలుసుకున్నవారికి ఆ దివ్యానుభూతి ఇప్పటికీ కలుగుతుంటుంది.

బృందావనంలో కృష్ణయ్య చేస్తున్న లీలలు, కృష్ణయ్య చిలిపి చేష్టలు, అద్భుతాలు, దివ్య వేణుగాన నాదం చూసి దేవతలు ఎంతో సంతోషిస్తున్నారు. బ్రహ్మదేవుడు, పరమేశ్వరుడు శ్రీమన్నారాయణుల వారు కృష్ణయ్యగా

భూలోకంలో అవతరించి చేస్తున్న అనేక లీలలు చూసి ఎంతో ముచ్చట పడుతున్నారు. కేవలం ధర్మ సంస్థాపన కోసమే భూమి మీదకి వచ్చాడా ఈ నారాయణుడు! లేదా ఇంకా ఏదైనా విశేష పరమార్థం ఉన్నదా అని దేవతలు అనుకుంటున్నారు. నారాయణుడు ఎన్నో అవతారాలు ధరించాడు. దేనికదే ప్రత్యేకం కాని ఈ కృష్ణావతారం చాలా విశిష్టంగా ఉంది. దుష్టులను శిక్షించడానికి, శిష్టులను రక్షించడానికి మాత్రమే కాదు ఎన్నో యుగాల నుండి తనకోసం ఎదురు చూస్తున్న మహాపురుషులను ఆనందింపచేయడానికి నారాయణుడు ఈ కృష్ణావతారం ఎత్తినట్లు దేవతలు గ్రహించారు.

బృందావనంలో గోపికలను మురిపించడం, ఆడించడం సరసల్లాపాలు ఆడడం అప్పుడప్పుడు వారికి కొంచెం కోపం తెప్పించడం...ఇంతలోపే వారిని బుజ్జగించడం...ఇవన్నీ బాహ్యానికి కనబడుతున్న చేష్టలు అయినప్పటికీ వీటన్నింటి వెనుక ఆయా జీవుల ఆత్మ ఉద్దేశ్యం, ఆత్మకామనలు గ్రహించి కన్నయ్య వారి వారికి అవి అనుగ్రహిస్తున్నాడు. ఇక్కడ శరీర స్పృహ లేదు...శరీర కోరికలు లేవు. కన్నయ్య వారందరి ఆత్మలకు కావలసిన అమిత ఆనందాన్ని తన లీలలతో అనుగ్రహిస్తున్నాడు. ఏ జీవికి ఏది ఇస్తే ఆనందం లభిస్తుందో ఏ జీవుడు ఏ విధంగా అద్భుత అనుభూతికి లోనౌతాడో కన్నయ్య ఆ విధంగా వారందరిని ఆ విధంగా అనుగ్రహిస్తున్నాడు. ఎవరికి ఏది ఎప్పుడు కావాలో ఆ కన్నయ్యకు తప్ప ఎవరికి తెలుసు?.

# 17

ఒకనాడు బ్రహ్మదేవునికి ఒక చిన్న ఆలోచన వచ్చింది! అది కూడా విష్ణుమాయ చేతనే! కృష్ణ మాయచేతనే! బ్రహ్మ అనుకుంటున్నాడు ఈ నారాయణుడు ఇలా కన్నయ్యలా జన్మించి ఇన్ని లీలలు చేస్తున్నాడు. ఇంత పెద్ద రాక్షసులను సునాయాసంగా మట్టుపెట్టాడు. మానవజన్మ తీసుకొని ఇన్ని అద్భుతాలు చేస్తున్నాడు. నేను కన్నయ్యకు ఒక చిన్న పరీక్ష పెడతాను ఏంచేస్తాడో చూస్తాను! అనుకున్నాడు. మనస్సులో అలా ఆలోచన రాగానే కింద బృందావనంలో కన్నయ్య, గోపబాలురు, లేగ దూడల్ని చూసాడు. కన్నయ్య గోపబాలురు కలిసి ఏదో ఆడుకుంటున్నారు. దూడలు పచ్చిగడ్డి మేస్తున్నాయి. అంతే మనస్సులో ఏదో ఆలోచన మెరిసి బ్రహ్మదేవుడు ఆ దూడలిన్నంటినీ క్షణంలో మాయం చేసాడు.

సాయంత్రం అయింది. గోపబాలురకు దూడలు కనబడలేదు. వారంతా ఎంతో గాభరా పడ్డారు. కన్నయ్యతో మొరపెట్టుకున్నారు.

అప్పటిదాకా అక్కడ వున్న దూడలన్నీ ఎక్కడకి వెళ్ళిపోయాయి అని ఎంతో కంగారు పడ్డారు. కన్నయ్యతో మొరపెట్టుకున్నారు. కన్నయ్య ఒక్క క్షణం కళ్ళుమూసుకున్నాడు. జరిగినది అర్థమయింది. బ్రహ్మగారి ముచ్చటకు చిరునవ్వు వచ్చింది. సరే నీ ముచ్చట తీరుస్తానులే అని అనుకున్నాడు.

గోపబాలురితో మీరేమీ భయపడవద్దు! అవిగో ఆ దూడలన్నీ బహుశా దూరంగా వెళ్ళి గడ్డి తింటూ ఉండి ఉంటాయి. కాసేపట్లో వస్తాయి ఏమి బెంగపడవద్దు అని అన్నాడు. నేను వెతికి తీసుకువస్తాను మీరందరూ ఇక్కడే ఉండండి అని దూరంగా వెళ్ళాడు. కన్నయ్యకు బ్రహ్మ ముచ్చట ఇంకా బాగా తీర్చాలనిపించింది. కాసేపు అటూ ఇటూ తిరిగి వచ్చాడు. తిరిగి వచ్చే సరికి గోపబాలురు కూడా లేరు.

అంతే! కన్నయ్య తానే గోపబాలురుగా, దూడలుగా మారిపోయాడు. అన్ని రూపాలు తానే ధరించాడు. అదికూడా ఏ ఏ గోపబాలురు ఎలా ఉన్నారో ఏ ఏ రంగు వస్త్రాలు ధరించి ఉన్నారో ఏ విధంగా మాట్లాడుకుంటారో, ఏ విధంగా నడుస్తుంటారో, ఏ విధంగా నవ్వుకుంటారో...ఇలా అన్ని విధాలుగా తాను మారిపోయాడు. అలాగే దూడలు కూడా ఇంతకు ముందు అక్కడ ఉన్న అన్ని దూడల రూపం ధరించాడు. అలా కన్నయ్య అందరి గోపబాలురు, అందరి రూపాలు ధరించి సాయంత్రానికి ఇళ్ళకు చేరుకున్నాడు.

గోపకాంతలందరూ తమ పిల్లలలో ఆరోజు ఏదో ఒక తేజస్సు చూసారు. కాని వారికి అర్థం కాలేదు. వారిలో కొందరు ఆ పిల్లవాళ్ళను అడిగారు. ఏం నాయనా? ఏం తిన్నావు నువ్వు? కన్నయ్య నిన్ను ఏం మాయ చేసాడు? ఈ రోజు ఇంత ఆనందంగా, ఇంత ముద్దుగా కనిపిస్తున్నావేమిటి అని అడిగారు. అలా కొన్ని రోజులు గడిచాయి ఆ తరువాత రోజుల్లో కూడా గోపికలు ఎంతో ఆశ్చర్యపోయారు. వారి కంటికి ప్రతీ పిల్లవాడు ఎంతో ముద్దుగా కనపడసాగాడు. మరి వారందరూ ఎవరు? కన్నయ్య రూపాలే కదా! ఈ సర్వ భూతాలయందు ఉన్నది తానే అని సమస్త జీవులకు

చెప్పడానికే బ్రహ్మదేవునికి తెలియచెప్పడానికి ఆ బ్రహ్మదేవుని కూడా కృష్ణమాయలో పడేసాడు. ఇంద్రియాలే లేగదూడలు! మన బుద్ధియే గోపబాలురు! మనందరిలోని ప్రాణశక్తియే ఆ కన్నయ్య! వీటన్నిటిలో ఉండే అంతర్యామి తత్వాన్ని లోకానికి చాటి చెప్పడానికే కన్నయ్య ఈ మాయ చేసాడు.

రోజూ ఇంతమంది కన్నయ్య స్వరూపాలు గోపబాలురుగా, లేగ దూడలుగా బృందావనం అంతా తిరుగుతూ ప్రతిరోజు ఎప్పటిలాగానే దూడలను తోలుకొని అడవులకు వెళుతూ తన స్వరూపాలతోనే ఆడుకుంటూ తన స్వరూపాలతో తానే ఆడుకుంటూ, తానే కవ్విస్తూ, తానే లాలిస్తూ, తానే బుజ్జగిస్తూ...ఆహా ఆ దృశ్యం చూడండి ఎంతటి అద్భుతంగా ఉందో ఆ దివ్యానుభవం మీరు అనుభవించారు. కన్నయ్యను అన్ని రూపాలలోను చూస్తూంటే ఎంత ఆనందంగా ఉంటుందో!

గోప కాంతలు తమ బిడ్డలను ఇంతకు ముందు కంటే ఎక్కువగా లాలిస్తూ గుండెలకు హత్తుకొని మురిసిపోతున్నారు. ఇంతకు ముందు కంటే మాటల్లో చెప్పలేని ఎంతో గొప్ప అనుభూతిని వారు పొందుతున్నారు. వారి మనస్సుకు ఇదంతా అర్థం కావడం లేదు. కాని వారి ఆత్మలు ఎంతో దివ్య ఆనందాన్ని పొందుతున్నాయి. కన్నయ్య ఈ విధంగా అందరిలో తానే ఉండి వారి వారి మోహాలను, తన పట్లగల ఆకర్షణను ఆరాధనను ఆ విధంగా తీరుస్తున్నాడు. ఆహా ఎంత ప్రేమ స్వరూపుడువయ్యా కృష్ణా! ఎంత అద్భుత ఆనంద మూర్తివయ్యా కృష్ణా! నీకోసం ఈ యోగులు అందరూ అనుభవిస్తున్న విరహాన్ని నీ స్పర్శతో ఇలా తీర్చావా. నీ లీలలు అద్భుతం కదా తండ్రీ! కేవలం నీ తత్వం గ్రహించడం వలననే ఎంత ఆనందం కలుగుతోంది!

ఇలా ఒక సంవత్సరం గడిచింది. గోకులంలో అందరికీ ఇది ఒక అద్భుత కాలం. ఎప్పటికీ వారి ఆత్మలు మరిచిపోలేని ఆనంద కాలం. ఒకనాడు బ్రహ్మదేవుడు కింద ఏం జరుగుతోందో అని చూసాడు. తాను దాచిన గోపబాలురు, దూడలు ఏమయ్యాయో చూద్దాం అనుకున్నాడు

భూలోకం అంతా ఈ సంవత్సరం ఎంత తల్లడిల్లిందో చూద్దాం అనుకున్నాడు. కాని గోకులం వైపు చూసిన బ్రహ్మదేవునికి నోట మాట రాలేదు.

అక్కడ కన్నయ్య, గోపబాలురు, ఆలమందలు చక్కగా ఆడుకుంటూ ఉన్నారు. మరి తను మాయ చేసి ఎక్కడో గుహలో దాచిన వారందరూ ఎలా ఉన్నారో అని చూసారు. గుహలో గోపబాలురు, లేగదూడలు అన్నీ నిద్రపోతున్నాయి. మరి ఇక్కడ గోకులంలో ఇవన్నీ చక్కగా తిరుగుతున్నాయి. నేను మాయ చేసినవన్నీ ఇక్కడ కూడా కనబడుతున్నాయే! ఇదంతా కన్నయ్య లీల తప్ప మరొకటి కాదు అని అర్థమయింది. కృష్ణయ్య వీళ్ళందరినీ అలాగే సృష్టించి అది కూడా గోకులంలో ఎవ్వరికీ ఏమాత్రం అనుమానం రాకుండా సంవత్సరం పాటు యధావిధిగా అన్నీ నడిచాయి. కృష్ణా!! నీ మాయ నన్నుకూడా కప్పి ఎంత పని చేసాను. నువ్వు మామూలు మానవునిగా భ్రమపడ్డాను. నా భ్రమను తొలగించావు తండ్రి అన్నాడు.

భూమి మీదకు దిగి బ్రహ్మ దేవుడు కృష్ణయ్యతో ఇలా అన్నాడు. స్వామి నీ నిజరూపాన్ని నీ దివ్యతత్వాన్ని నేను గ్రహించలేకపోయాను నన్ను క్షమించు. ఈ సృష్టిలో ఉన్న జీవకోటి మొత్తంలో అంతర్యామి స్వరూపంలో ఉండేది నీవే కదా! నీ మాయచేత ఈ విషయం నేను గ్రహించలేకపోయాను. నీ గర్భంలోని అనేక బ్రహ్మాండాలలో ఒక బ్రహ్మాండానికి మాత్రమే బ్రహ్మను నేను! అది కూడా నీయందే ఉండేవాడిని! నాకు కారణభూతుడవు కూడా నీవే! నీ మాయ చేత నేను కూడా సత్యం గ్రహించలేకపోయాను క్షమించు స్వామి అని పరి పరి విధాల వేడుకున్నాడు.

అప్పుడు కన్నయ్య బ్రహ్మదేవా అలా చింతించకు. ఇదంతా నా లీలలోని భాగమే! ఒక సంవత్సరం పాటు ఇక్కడ గోపకాంతలు అందరికి పిల్లవాడిని అయ్యాను కదా వారి ముచ్చట్లు అన్నీ తీర్చాను కదా అలాగే ఇప్పుడు ఇక్కడ జన్మించిన ఆలమందలు అన్నీ ఎంతో పుణ్యం చేసుకున్నాయి. అందుకే వాటి రూపం కూడా ధరించి వారిని కూడా అనుగ్రహించాను అన్నాడు.

ఇలా అన్నాక కన్నయ్య తన మాయను ఉపసంహరించుకున్నాడు. మాయా రూపంలో తన ఎదురుగా ఉన్న గోపబాలురు, దూడలు మాయమయ్యాయి. అక్కడ గుహలో ఉన్న గోపబాలురు ఇక్కడ ప్రత్యక్షమై నిద్రలేచినట్లు కళ్ళు నలుపుకుంటూ ఏవి మన దూడలు అని అన్నాడు. కన్నయ్య ఇవిగో ఇక్కడే ఉన్నాయి అని చూపించాడు. ఈ దూడలన్నీ మళ్ళీ వచ్చాయి.

ఆ గోపబాలురకు తాము ఆ సంవత్సర కాలం మాయా నిద్రలోనికి వెళ్ళిపోయినట్లు ఏమి తెలియట్లేదు. ఇదంతా ఇప్పుడే జరిగినట్లుగా వారికి తోస్తోంది. కన్నయ్య దూడలను వెదకడానికి వెళ్ళాడు ఇదిగో ఇప్పుడే వచ్చాడు అని వారు అనుకుంటున్నారు. కన్నయ్య లీలలు ఎంత అద్భుతం కదా! కన్నయ్య లీలలు ఏవి చదివినా, ఏవి విన్నా మనస్సులోని అశాంతత అంతా తొలగిపోయి మనస్సు ఆనందంతో నిండిపోతుంది. ఆ కరుణామూర్తి లీలలు అంత మధురంగా ఉంటాయి మరి!.

# 18

ఒకరోజు సాయంత్రం గోకులంలోని యాదవ ప్రముఖులు ఒకచోట సమావేశమై ఏవో విషయాలు చర్చింపసాగారు. ఇంతలో అటుగా గోపబాలురతో వెళ్తున్న కన్నయ్య వీరందరూ ఏమి మాట్లాడుకుంటున్నారా అని కాసేపు అక్కడ ఆగి వారి మాటలు వినసాగాడు. ఇంతలో వారిలో ఒక యాదవుడు ఇలా అంటున్నాడు. మనం ప్రతి సంవత్సరం ఇంద్రుడి గురించి యాగం చేస్తాం కదా. మనకు వర్షాలు సమృద్ధిగా పడాలని! పంటలు బాగా పండాలని పశువులన్నీ ఆనందంగా ఉండాలని ఆ దేవేంద్రుని సంతృప్తి పరచడానికి ప్రతీ సంవత్సరం యాగం చేయడం మనందరికి అలవాటే కదా! అలాగే ఈ సంవత్సరం కూడా రేపుచేద్దామా అని అన్నాడు. దానికి వారందరూ సరేనని అన్నారు. అయితే ఇదంతా విన్న కన్నయ్య వారితో మీరు ఏ ఫలితాన్ని కోరి ఈ యాగం చేస్తున్నారు? యాగఫలం ఎవ్వరికి ఇస్తున్నారు? అని అడిగాడు. అప్పుడు వారు కృష్ణా! నువ్వు చిన్నవాడివి! నీకీ విషయాలన్నీ

తెలియవు. మేఘాలన్నీ దేవేంద్రుడి ఆధీనంలో ఉంటాయి. అతని ఆజ్ఞతోనే మేఘాలు వర్షం కురిపిస్తాయి. ఆ వర్షం వల్ల భూమి సస్యశ్యామలమై పంటలు పండుతాయి. అందుకే మనం ప్రతి సంవత్సరం ఇంద్రుని ఆరాధిస్తూ గొప్ప యాగం చేస్తాం. దానితో ఇంద్రుని అనుగ్రహం కలిగి మంచి వర్షాలు కురుస్తాయి అని ఆన్నాడు.

అది విన్న కృష్ణయ్య ఈ విషయంలో ఏమి అర్థం లేదు జీవుల యొక్క కర్మ ఫలాలను బట్టి వారి వారికి లభించేవి లభిస్తాయి. ఈ సృష్టి మొత్తం పరమేశ్వరుని ఆధీనంలో ఉంటుంది. అంతే తప్ప దీంట్లో ఇంద్రుడు చేసేదేమి లేదు. ఈసారి మనం ఇంద్రుని తృప్తి పరిచే ఆ యాగం బదులు ఈ గోవర్ధనగిరికి పూజలు చేద్దాం. అలాగే బ్రాహ్మణులకు పూజిద్దాం అని అన్నాడు. కృష్ణుని మాటలు వారందరినీ ఒక మాయ కప్పి ఓ తప్పక ఈ సంవత్సరం ఇలాగే చేద్దాం అని అన్నారు. ఈ గోవర్ధన పర్వతమే మనందరికి కామధేనువు వంటిది. ఆ పర్వతాల్ని పూజించడం కంటే విశిష్టమైనది ఏమి ఉంటుంది అని అన్నారు.

ఆ తర్వాతరోజు యాదవులందరూ కలిసి ఎన్నో రకాల పిండి వంటలను తయారుచేసి అవన్నింటిని నెత్తిన పెట్టుకొని ఎంతో వైభవంగా ఆ పర్వతం వైపు నడిచారు. ముందుగా అక్కడ ఉన్న బ్రాహ్మణులకు నమస్కరించారు. వారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. కన్నయ్య గోపబాలురతో కలిపి వీరి వెంటనే నడుస్తున్నాడు. కన్నయ్య ఎంతో చిలిపిగా యాదవులందరిని చూస్తూ నవ్వుతున్నాడు. కృష్ణుడు అలా ఎందుకు నవ్వుతున్నాడో వారికి అర్థం కాలేదు. తామందరమూ తలమీద ఇలా అనేక రకాల పిండి వంటలు పెట్టుకొని కొత్త వస్త్రాలను ధరించి అనేక రకాల పూజా సామాగ్రిలతో వెళ్తుండడం కన్నయ్యకు నవ్వు తెప్పించిందేమో అనుకున్నారు.

కాని ఆ పరంధాముని చిరునవ్వు వెనుక ఆంతర్యం వేరు. ముందు జరుగబోయే ముచ్చట అంతా తన మనస్సులో మెదులుతున్న ఆ కన్నయ్యకు చిరునవ్వు వచ్చింది. కన్నయ్య స్నేహితులైన గోపబాలురు కన్నయ్య

చిరునవ్వులో ఏదో అర్థం ఉందని గ్రహించారు. కాని అది ఏమిటో వారికి అర్థం కాలేదు వారు రోజు కన్నయ్యతో ఆడిపాడేవారు కాబట్టి కన్నయ్య హావభావాలన్నీ ఎంతో ఎక్కువగా అతి దగ్గరగా చూసేవారు, అనుభవించేవారు, అనుభూతి పొందేవారు వీరేకదా అందుకే ఈ రోజు కన్నయ్య అలా నవ్వడం చూసి ఏదో పెద్ద ముచ్చటే ముందు జరుగనున్నది అని అనుకున్నారు.

అందరూ ఆ విధంగా వెళ్ళి తాము తెచ్చిన పిండి పదార్థాలు అన్నీ ఆ గోవర్ధనగిరికి ఎదురుగా పెట్టి ఆ పర్వతానికి నివేదించారు. యాదవులందరూ సంతోషంతో నృత్యం చేయసాగారు. ఆ నివేదనలన్నీ తిని ఎంతో ఆనందపడి యాదవులు, గోపికలు, కన్నయ్య, గోపబాలురు అందరూ సంతోషంగా ఆటలు ఆడుకుంటున్నారు. గోపికలందరూ కన్నయ్యను చూసి ఎంతో ముచ్చట పడ్డారు. ముందు ముందు ఇంకా పెద్ద ముచ్చట ఉందని మనస్సులో తలచి కన్నయ్య వారివంక చూసి చిరునవ్వు నవ్వాడు.

ఇదంతా ఇంద్రలోకం నుంచి చూస్తున్న ఇంద్రుడికి చాలా కోపం కలిగింది. చిన్న పిల్లవాడైన ఈ కృష్ణుని మాటలు నమ్మి ఈ యాదవులందరూ నాకు యాగం జరిపించకుండా ఉంటారా? వీరందరికీ బుద్ధి చెప్పవలసిందే నా శక్తి ఏమిటో వీరికి తెలియచెప్పవలసిందే ఇన్ని సంవత్సరాలుగా చేస్తున్న యాగం మాని అలా ఆటలు ఆడుకుంటారా అని ఎంతో కోపం వచ్చి ఎంతో భీకరమైన మేఘాలను పిలిచి తక్షణమే వెళ్ళి భూలోకంలో ఆ బృందావనంలో మీరు కుంభవృష్టి కురిపించండి! వర్షపు ధారలతో ప్రళయం సృష్టించండి! రాళ్ళు కురిపించండి! మీ శక్తితో రోజుల తరబడి కురిసే వర్షానికి బృందావనం అంతా తడిసి, నీటమునిగి వారందరూ సర్వం కోల్పోవాలి అప్పుడుగాని వారికి బుద్ధి రాదు అని ఆ మేఘాలను ఆదేశించాడు.

ఇంద్రుని ఆదేశం అందుకున్న ఆ మేఘాలన్నీ భూలోకం వైపు వచ్చి బృందావన ప్రాంతంపై కుంభవృష్టి కురిపించసాగారు. ఒక్కసారిగా ఆకాశం అంతా నల్లటి మేఘాలతో కప్పబడి అంతటి భయంకరమైన వర్షం

కురియడం యాదవులందరికీ ఎంతో ఆశ్చర్యం భయం కలిగింది. వర్షంతో పాటు దిక్కులు పిక్కటిల్లేలా శబ్దం చేస్తూ పెద్ద పెద్ద పిడుగులు పడుతున్నాయి. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లుగా కురుస్తున్న ఆ వర్షానికి బయపడి ఆవు దూడలు తాళ్ళను తెంచుకొని ఇటూ అటూ పరుగెత్తసాగాయి ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామానికి యాదవులు భీతావహులు అయ్యారు. ఇంక చిన్న పిల్లల సంగతి అయితే చెప్పనక్కర్లద్దు. ఎంతో బెదురుపోయి తమ తల్లిదండ్రుల వద్దకు చేరారు.

గాలి ఇంకా ఎక్కువై పెద్ద వృక్షాలు సైతం ఒరిగిపోతున్నాయి. ఆ గాలికి ఆ వృక్షాలు క్రింద పడుతూ దూరంగా ఎగిరి పడుతున్నాయి. ఒక భీభత్సకరమైన వాతావరణం చూసి అందరూ ఎంతో భయపడ్డారు. దీని నుంచి కృష్ణయ్య తప్ప ఇంకెవ్వరూ తమను కరుణించలేదని తలచి వారందరూ కృష్ణుడి వద్దకు వెళ్ళి కృష్ణా! నువ్వే ఈ భీభత్స ప్రళయం నుంచి మమ్మల్నందరినీ రక్షించాలి అని వేడుకున్నారు. కన్నయ్య వారితో మీకేమి పర్వాలేదు ముందుకు పదండి! అని వారందరినీ పర్వతం వద్దకు తీసుకువచ్చాడు. అందరూ ఆ వర్షంలో తడుస్తూ గాలికి అటూ ఇటూ ఊగిపోతూ ఆ పర్వతం వద్దకు వచ్చారు.

కన్నయ్య ఒక్కసారి వారివంక చిరునవ్వుతో చూసి ఆ పర్వతం వైపు తిరిగి కళ్ళు మూసుకొని ధ్యానించి కళ్ళు తెరిచి ఒక్కసారిగా తన చేతితో ఆ పర్వతాన్ని పైకెత్తాడు. అంతటి పర్వతరాజాన్ని ఒక చిన్న రాయి ఎత్తినట్టు ఒక్కచేతితో ఎత్తిన కన్నయ్యను చూసి అందరూ ఆశ్చర్యపోయారు. తక్షణమే యాదవులందరూ ఆవు దూడలను తోలుకుంటూ ఆ పర్వతం కిందకు వచ్చారు. కృష్ణుడు జయజయధ్వానాలు చేయసాగారు. కన్నయ్య వారితో మీరు ఇంక అస్సలు భయపడవద్దు. ఇంద్రుడు ఎన్నాళ్ళు వర్షం కురిపిస్తాడో చూద్దాం అని అన్నాడు. అవిగో ఆ కనిపిస్తున్న నైవేద్యాలన్నీ చక్కగా మీరు ఆరగించండి! సంతోషంగా నృత్యం చేయండి! అదిగో బయట ఆ వర్షాన్ని చూస్తూ ఈ పాయసాలన్నీ ఆరగిస్తూ ఆనందంగా ఉండండి. నేను

ఉన్నంతకాలం మిమ్మల్ని ఏ శక్తి ఏమీ చేయలేదు అని అన్నాడు. అందరూ ఆనందంగా ఆ నివేదనల గుండిగల వద్దకు వెళ్ళి ఆ పదార్థాలన్నీ ఎవరికి కావలసిన వారు తీసుకొని సంతోషంగా తినసాగారు. పర్వతం అంచుల నుంచి వర్షం ఎంతో ధారగా పడుతున్నప్పటికీ ఒక్క చుక్క నీరు కూడా వీరున్న పక్కకి రావడం లేదు. పర్వతం ఆవలివైపుకి వెళుతోంది తప్ప లోపలవైపుకి ఏ మాత్రం నీరు రావడం లేదు.

ఇదంతా పైనుంచి చూస్తున్న ఇంద్రుడికి కోపం ఇంకా ఎక్కువైంది. ఇంకా భీకరమైన మేఘాలు పంపించాడు. ఆ మేఘాలు పెద్ద వర్షంతో పాటు రాళ్ళ లాంటి వడగళ్ళవాన కురిపించాయి. అయినా కృష్ణుని చేతిమీద ఉన్న పర్వతం ఎక్కడా చలించలేదు. పర్వతం అంచున కారుతున్న వర్షపు ధారలలో ఎంతో అద్భుతంగా ఈ పర్వతం చుట్టూ నవ్వుతూ నృత్యం చేస్తున్న కన్నయ్య ప్రతిరూపం కనబడసాగింది. యాదవులందరూ ఇది చూసి ఎంతో ముచ్చట పడ్డారు. ఇంక గోపికల ఆనందం అయితే చెప్పనక్కర్లద్దు.

అలా ధారగా కురుస్తున్న వర్షపు నీటిలో ఒక ప్రతిబింబంలా ఎంతో తేజస్సుతో ఒక చేతితో మురళిని తలపై పింఛాన్ని పెట్టుకొని ముందుకి వెనక్కి ఎంతో లయబద్ధంగా నృత్యం చేస్తూ కన్నయ్య ఆ పర్వతం చుట్టూ తిరుగుతున్న దృశ్యం వారికి కనిపిస్తోంది. వారందరూ ఆశ్చర్యపోయి ఇటువైపు తిరిగిచూస్తూ మధ్యలో చేయి పైకెత్తి పర్వతాన్ని తన చేతిపై ఉంచుకొని నుంచున్న కన్నయ్య కనిపిస్తున్నాడు. ఇక్కడ కన్నయ్య మురళిని దోపుకొని ఇలా నుంచున్న భంగిమ అటుపక్క చూస్తే అలా నృత్యం చేస్తున్న విశేష దృశ్యం వారందరికీ ఎంతో ఆనందం కలిగించింది. ఇక్కడ ఇలా నుంచున్న కన్నయ్య ఆ పర్వతపు అంచులలో అలా ఎలా నృత్యం చేస్తూ పరుగెడుతున్నాడో వారికి అర్థం కాలేదు. ఇదే కృష్ణమాయ! ఇదే కృష్ణలీల!

ఒక్కసారి మనందరం ఆ దృశ్యాన్ని దర్శిద్దాం యాదవులు ఆలమందల మధ్య గోపికల మధ్య ఉన్న ఆ కన్నయ్యను చూడండి!. వర్షానికి తట్టుకోలేక ఆ కొండ కిందకి చేరిన జింకలు, లేళ్ళు, నెమళ్ళు, కుందేళ్ళు

ఇంకా అనేక రకాల పక్షులను చూడండి. కొండ అంచున వర్షపు ధారల్లో నృత్యం చేస్తూ తిరుగుతున్న ఆ కన్నయ్య ప్రతిబింబాన్ని చూడండి.

అలా ఒకటా రెండా ఏడు పగళ్ళు, ఏడు రాత్రుళ్ళు ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. భయంకరమైన పిడుగులు పడుతూనే ఉన్నాయి. అయినా కన్నయ్య నుంచున్న ప్రదేశం నుంచి కదల్లేదు. ప్రతిరోజు రాత్రి అవ్వగానే కన్నయ్య ఒక చేత్తో ఎంతో అద్భుతంగా మురళీగానం చేసేవాడు. ఆ నాదానికి ఎంతో ఆనందపడి ఆ పర్వతం కింద ఉన్న యాదవులు గోపికలు అందరూ నిద్రలోకి జారుకునేవారు అంతేకాదు వారితో పాటు ఉన్న జింకలు, లేళ్ళు ఇవన్నీ కూడా ప్రశాంతంగా నిద్రపోయేవి.

వారందరూ ఉదయం లేచేటప్పటికి కృష్ణుని దగ్గరలో బ్రహ్మాండమైన పిండివంటలు గుండిగలతో ఎంతో వేడి వేడిగా కనపడేవి. ఇవన్నీ ఎక్కడ నుంచి వచ్చాయో కూడా వారు ఆలోచించడంలేదు. వారంతా కృష్ణ మాయలో పడి ఎంతో ఆనందపడుతూ అవన్నీ భుజించేవారు.

గీతిక వచ్చి నైవేద్యంను చిన్న గిన్నెలోకి తీసుకొని కన్నయ్యకు తినిపించింది. కన్నయ్య ఎంతో ముచ్చటపడుతూ ఆ పాయసాన్ని ఆనందంగా తిన్నాడు. అలా ప్రతిరోజు యశోదమ్మ గోపికలు వచ్చి కన్నయ్యకు అప్పుడప్పుడు తీపి పదార్థాలు పెట్టేవారు ఆ పరంధాముడికి ఆకలి లేకున్నా వీరి ఆనందం కోసం అవన్నీ చిరునవ్వుతో స్వీకరించేవాడు. ప్రతిరోజు పగలంతా యాదవులు ఆడుతూ పాడుతూ గడిపేవారు ఆవులన్నిటికి తినడానికి బోలెడంత గడ్డి కనబడుతుంది. పక్షులకు తినడానికి ఎన్నో ధాన్యాలు దొరికాయి.

కన్నయ్య చేతి మీద ఉన్న ఆ గోవర్ధనగిరి కింద ఎవరు తినడానికి కావలసినవి వారికి దొరికాయి. దాంతో వారికి ఆకలిబాధ తెలియక ఎంతో ఆడుతూ పాడుతూ పగలంతా గడిపేవారు. సాయంత్రం అయ్యేటప్పటికి కన్నయ్య ఒక గంటసేపు ఎంతో అద్భుతంగా వేణువు ఊదేవాడు. ఆ

వేణుగానం వింటూ  వారందరూ నిద్రలోకి జారుకునేవారు. కన్నయ్య ఆ ఏడు రోజులు ఏరోజుకారోజు కొత్తరకంగా కొత్త తరంగాలతో వేణుగానం చేసేవాడు. అక్కడతో అక్కడ ఉన్న మానవులే కాక జీవులన్నీ ఎంతో ప్రశాంతంగా నిద్రపోయేవి. అంతకు ముందు ఆ వానని, పిడుగులని చూసి భయపడిన యాదవులందరూ అది చూసి ఇప్పుడు ఆనందిస్తున్నారు.

ఇలా ఏడురోజులు గడిచిన తరువాత ఇంద్రుడి తాపం నశించి మేఘాలను వెనక్కి రప్పించాడు. ఎనిమిదవ నాడు సూర్యుడు ఎంతో తేజస్సుతో దర్శనమిచ్చాడు. అక్కడితో యాదవలందరూ ఎంతో ఆనందపడుతూ ఆ పర్వతం కిందనుంచి బయటకు వచ్చారు. వారితోపాటే గోపకాంతలు గోపబాలురు ఆవు దూడలు అన్నీ ఆనందపడుతూ బయటకు వచ్చాయి. ఆ కొండకిందనున్న అన్ని జీవులు బయటకి వెళ్ళాయి అని గ్రహించిన తరువాత కన్నయ్య నెమ్మదిగా చేతిని దింపి ఆ పర్వతరాజాన్ని యథాస్థానంలో పెట్టాడు.

ఇదంతా గమనించిన ఇంద్రుడికి అహంకారం తగ్గి అక్కడ ఉన్న చిన్న బాలుడు శ్రీమన్నారాయణుడు తప్ప మరొకరు కాదని గ్రహించాడు. వెంటనే బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి దేవా! బృందావనంలో ఉన్న బాలుడు అతి సామాన్య బాలుడు అని తలచి ఎంతో తప్పిదం చేసాను. ఆ బాలుడు సృష్టిమొత్తానికి ఆధారభూతుడైన ఆ పరంధాముడైన శ్రీమన్నారాయణుడే అని ఇప్పుడు గ్రహించాను వెళ్ళి ఆ స్వామిని నా అపరాధం మన్నించమని అడుగుతాను అని అన్నాడు.

అప్పుడు బ్రహ్మదేవుడు అతడితో ఇంద్రా! కన్నయ్యకు గోవులంటే ఎంతో ఇష్టం కాబట్టి నువ్వు గోవులను తీసుకెళ్ళి ఆ పరంధాముడికి కానుకగా ఇవ్వు అతడు సంతోషించి నిన్ను అనుగ్రహిస్తాడు అన్నాడు. తక్షణమే ఇంద్రుడు కామధేనువును ఆమె సంతానాన్ని తీసుకొని భూలోకం బయల్దేరాడు. బృందావనం వచ్చేటప్పటకి దూరంగా పచ్చికబయళ్ళలో ఒకరాతిపై కూర్చొని వేణుగానం చేస్తున్న కన్నయ్య కనబడ్డాడు. కన్నయ్యను

చూసిన తడవుగానే ఆ ధేనువులన్నీ కృష్ణుని వైపు ఆనందంతో పరుగెత్తసాగాయి.

ఇంద్రుడు కృష్ణుని వద్దకు వచ్చి శ్రీకృష్ణా! నన్ను క్షమించు నువ్వు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడివే అని ఎరుగక ఇంత ఘోరం తప్పిదం చేసాను. నాకు బాగా బుద్ధి చెప్పావు. సర్వభూతాలకు ఆధారభూతుడువైన నీ తత్వం గ్రహించలేకపోయాను! నీ మాయలో పడి అజ్ఞానంతో నిన్ను అతి సామాన్య బాలునిగా గ్రహించి ఇంత వర్షం కురిపించి నీ బృందావన వాసులందరినీ ఎంతో బాధపెట్టాను. ఈ బ్రహ్మాండం మొత్తాన్ని సునాయాసంగా ఎత్తిన నీకు ఈ పర్వతం ఎత్తడం ఏపాటిది? సమస్త విశ్వానికి ప్రభువు నీవు నా అజ్ఞానంతో చేసిన అపరాధాన్ని క్షమించు ఈ కామధేనువును నాయందు దయతో స్వీకరించు అని వేడుకున్నాడు! ఈ గోవులన్నీ నిన్ను పట్టాభిషేకం చేయడానికి ఎంతో ఆత్రపడుతున్నాయి. వాటిని కూడా అనుగ్రహించు అని వేడుకున్నాడు.

కన్నయ్య ఇంద్రుని అనుగ్రహించి అలాగే అని అన్నాడు. అప్పుడు బృందావనంలో ఎంతో అద్భుతంగా గోవింద పట్టాభిషేకం జరిగింది. బంగారు సింహాసనంపై కూర్చొన్న కన్నయ్యకు ఇంద్రుడు సహస్రధారాభిషేకం చేసాడు ఆ గోవింద పట్టాభిషేకం చేసి ప్రకృతి అంతా పులకించింది. యాదవులంతా ఆనందపడ్డారు గోపికలు ఎంతో దివ్యానుభూతికి లోనయ్యారు ఇక కన్నయ్య స్నేహితులైన ఆ గోపబాలురి సంగతి చెప్పనక్కర్లేదు ఎంతో ఆనందంతో అటూ ఇటూ ఎగురుతున్నారు. రోజూ తమతో ఆడుకునే కన్నయ్యకు జరుగుతున్న ఆ పట్టాభిషేకం తమకు కూడా జరుగుతున్నట్టు ఆనందంపడ్డారు.

అక్కడ దేవలోకంలో నారదమహర్షుని గోవిందనామం యొక్క విశిష్టతని దేవతలందరికీ చెప్తున్నారు. గోవిందుడు అంటే గోవులను మాత్రమే కాదు ఈ సమస్త సృష్టిని నడిపించేవాడు!ఈ విశ్వం అంతా వ్యాపించి ఉన్నవాడు ఆ గోవిందుడే! గోవిందుడు భక్తులను ఎప్పుడూ

అనుగ్రహించేవాడు. సమస్తలోకాలను పరిపాలించే పరబ్రహ్మ తత్వమే ఈ గోవిందుడు సమస్త ప్రాణికోటి కర్మాచరణలను నియంత్రించేవాడు గోవిందుడే గోవింద అంటే స్తుతించబడేవాడు అని కూడా అర్థం ఈ జగత్తులో శ్రీమన్నారాయణుడికంటే స్తుతించగలిగినవాడు ఎవరుంటారు? అందుకే ముక్కోటి దేవతలు, సమస్త ప్రాణికోటి ఈ గోవిందునే ఎల్లవేళలా కీర్తిస్తుంటారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు అన్నీ కూడా ఈ గోవిందుని స్తుతిస్తే కలిగే దివ్యానుభూతుల్ని, దివ్య భోగభాగ్యాలను సర్వజ్ఞానాలను, సర్వ ఐశ్వర్యాలను వివరిస్తున్నాయి. ఈ సృష్టి మొత్తానికి సర్వాధారుడు, సర్వకారణ భూతుడు, సర్వ ప్రాణిరూపుడు, సర్వ ఆగముల సారము ఈ గోవిందుడే! ఎల్లవేళలా గోవింద నామం స్మరించేవారికి సర్వ సౌభాగ్యాలు లభిస్తాయి, సర్వ శుభాలు కలుగుతాయి అని చెప్పాడు. అది విన్న దేవతలందరూ సంతోషించి ఆ గోవిందునికి ఇక్కడినుంచే నమస్కరించి తమతమ స్థానాలకు వెళ్ళారు.

# 19

ఒకనాడు కృష్ణయ్య గోపికలతో ఆడుతూ ఊరి బయటకు వచ్చాడు. అక్కడ ఒక చెట్టుకు ఊయల కనిపించింది. బృందావనం అంటేనే ఎన్నో అద్భుతాలకు నిలయం. బృందావనంలోని ప్రతి చెట్టు ప్రతి ఆకు, చివరికి ఒక గడ్డి పరక కూడా భగవంతుడి అంశను, ప్రేమ తత్వాన్ని నింపుకున్నవే! కన్నయ్యకు ఎదురుగా కనబడుతున్న ఊయల ఎక్కాలనిపించింది. వెంటనే అక్కడకు వెళ్ళి ఒక చేతితో ఊయల తాడును పట్టుకొని రెండవ చెయ్యి ఊయలమీద పెట్టి ఒక్కసారిగా ఎగిరి కూర్చున్నాడు. అలా ఎగురుతున్న కృష్ణయ్యను చూడండి. ఎంత ముచ్చట! ఎంత ఠీవి! కృష్ణుడు బృందావనంలో ఉన్నంతకాలం ఎందరికో అద్భుత అనుభూతులను అనుగ్రహించాడు. ఎవరెవరికి ఎటువంటి అనుభూతులు కావాలో గ్రహించి అవి వారికి అనుగ్రహించాడు. బృందావనంలో ఉన్నంతకాలం ఇలా తనకోసం ఎన్నో లక్షల సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఎందరో తన ప్రియభక్తులని ఎన్నో

విధాలుగా అనుగ్రహించాడు. ఒకొక్కరిని ఒకొక్క లీలతో ఎంతో ఆనందపరిచాడు. ప్రతీ ఆత్మకి జ్ఞానం, వైరాగ్యం అతి ఎక్కువ స్థాయిలో సాధించిన తరువాత బ్రహ్మానందం వైపు వెళతాడు. కన్నయ్య తనను ప్రేమించిన వారందరికి ముందుగా ఈ జ్ఞాన, వైరాగ్యాలనే అనుగ్రహించి తరువాత తన మధుర తత్వంలోనికి లాక్కొని వారిని ఎంతో ఆనందపరుస్తాడు. జీవులందరిని తన వద్దకు ఆకర్షించుకునే సంకర్షణుడే ఈ శ్రీకృష్ణుడు! ఈ విధంగా కన్నయ్య ప్రతీరోజు ఉదయం లేచిన మొదలు రాత్రి ఇంటికి వెళ్ళి పడుకునే వరకు బృందావనం అంతా తిరుగుతూ ఎన్నెన్నో అద్భుత అనుభూతులను ఆ రోజు తనని కలిసిన వారందరికీ అనుగ్రహిస్తున్నాడు.

ఈ అనుభూతులన్నీ కేవలం మానవ రూపంలో జన్మించిన యాదవులకు, గోపికలకు, మహర్షులకు, సిద్ధులకు, యోగులకు మాత్రమే కాదు, అక్కడ బృందావనంలో సంచరిస్తున్న అనేక జంతువులకు, అనేక పక్షులకు కూడా ఎన్నో దివ్యానుభూతులు అనుగ్రహిస్తున్నాడు. కన్నయ్య కంటికి కనపడిన, కన్నయ్య చేతితో నిమిరిన, కన్నయ్య ముద్దాడిన, కన్నయ్య కౌగిలించుకున్న ఆ జంతువులు, ఆ పక్షులు ఎంతో ఆనందం పొందుతున్నాయి.

కన్నయ్య స్పృశించిన ఆ లేగదూడను చూడండి! అక్కడ పచ్చిక బయళ్ళలో చెంగు చెంగున ఎగురుతూ ఎంత ఆనందంగా వెళుతోందో! అప్పుడే వచ్చి కన్నయ్య భుజం మీద వాలిన ఆ చిన్న పక్షిని చూడండి! ఎంత ముచ్చట పడిపోతోందో! ఆ ఆనందంతో ఎంత చక్కగా కూస్తోందో! ఆ పక్షి చూడండి! కన్నయ్య చుట్టూ చేరి ఆ కన్నయ్యను తమలో ఒకరిగా భావించి ఎంతో అద్భుతంగా పురివిప్పి నాట్యం చేస్తున్న ఆ నెమళ్ళను చూడండి! ఎంత ఆనందపడుతున్నాయో!

కృష్ణయ్య ఆనంద స్వరూపుడు కృష్ణయ్య ఉన్నచోట బ్రహ్మాండమైన ఆనందం ఎంతో తేజోమయమై ప్రకాశిస్తూ ఉంటుంది. అందువలననే

కన్నయ్య చుట్టూ ఉన్న ఆ జీవులన్నీ అంత ఆనందాన్ని అనుభవిస్తున్నాయి. అంతటి ఆనందం అనుభవించడమే కాదు ఎప్పుడైతే పరబ్రహ్మ మూర్తి ఆ కన్నయ్య సాన్నిహిత్యం లభించిందో, అది కేవలం కొన్ని నిమషాలు మాత్రమే కావచ్చు అయినప్పటికి ఆ పరంధాముని దివ్య తేజో వలయంలో గడపడం వలన కలిగిన ఆనందంతో పాటు వారికి ఎంతో ధ్యాన వైరాగ్యాలు లభించి వారి ఎన్నో వేల జన్మల ప్రారబ్ధకర్మ నశించి అటు తరువాత వారికి ఎన్నో ఉత్తమ జన్మలు లభిస్తున్నాయి. ఈ రోజు మనమధ్య ఉన్న కొందరు మహాపురుషులు ఆనాడు ద్వాపరయుగంలో కృష్ణ సాన్నిహిత్యంలో గడిపిన వారే. వారిలో కొందరు గొప్ప ఆధ్యాత్మికపరులుగాను, గొప్ప సంగీతకారులుగాను, గొప్ప నాట్యకారులుగాను, గొప్ప సాహిత్యవేత్తలుగాను నేటి కాలంలో జన్మించి ప్రజలును తమ జ్ఞానంతో, తమ కలాలతో ఉత్తమ పథం వైపు నడిపిస్తున్నారు.

అలా కృష్ణయ్య ఊయల ఎక్కి కూర్చోగానే చుట్టుపక్కల చెట్లపై ఉన్న కొన్ని పక్షులు ఆ ఊయల రెండు వైపుల ఉన్న తాళ్ళపై ఎగిరి వచ్చి కూర్చొని కిచకిచలాడుతూ ఎంతో అద్భుత శబ్దాలు చేస్తున్నాయి. కన్నయ్యను చూసిన ఆ ఆనందం పట్టలేక ఆ తాడు మీదనుంచి ఈ తాడుకి, ఈతాడు మీదనుంచి ఆ తాడుమీదకి ఎగురుతున్నాయి. ఆ హడావిడిలో ఒకటి రెండు పక్షులు కన్నయ్య భుజాల మీద వచ్చి వాలాయి. కింద నుంచొని ఇదంతా చూస్తున్న గోపికలు ఎంతో ఆనంద పడుతున్నారు. వారికి ఆ ఊయల ఎక్కి తాముకూడా కన్నయ్య పక్కనే కూర్చోవాలని, కన్నయ్యతో కలిసి ఆ ఊయల ఊగాలని ఎంతో కోరికగా ఉంది. కాని ఆ ఊయలపై ఒక్కరు మాత్రమే కూర్చొనగలరు. అందుకని వారందరిలో నిరాశ కనిపిస్తోంది.

ఇంతలో కన్నయ్య నవ్వుతూ ఒక గోపికను పిలిచి వచ్చి ఎక్కమన్నాడు. తాను చేయి అందించి ఆ గోపికను ఊయలపైకి లాగి తనపక్కనే కూర్చొనబెట్టుకున్నాడు. ఆమె గీతిక! వేణువు తీసుకొని ఎంతో మనోహరంగా ఊదసాగాడు. ఎప్పుడైతే కన్నయ్య వేణువు ఊదడం మొదలు

పెట్టాడో పైన కిలకిలమంటున్న పక్షులు అన్నీ తాను కూయడం ఆపి కన్నయ్య మనోహర వేణునాదాన్నే వింటున్నాయి. ఆ మనోహర వేణునాదం ఎంతదాకా వెళ్ళిందంటే దూరాన కొండలలో గల సెలయేరులో నీరు తాగుతున్న ఏనుగులు ఇటువైపుగా రావడం ప్రారంభించాయి. దూరంగా ఎగురుతున్న జింకలు వేణునాదానికి ఎంతో ఆనందపడి చెంగు చెంగున ఎగురుతూ ఇటుపక్కకి వస్తున్నాయి.

ఇంతలో ఊయలపై మరొకరికి చోటు కనిపించింది. వెంటనే అక్కడ ఉన్న గోపిక  ఎగిరి ఊయలపై కూర్చొంది. ఆహా ఆమె ముఖంలో ఆ ఆనందం చూడండి! కన్నయ్యతో కలిసి అలా ఊగుతున్న ఆ ఇద్దరు గోపికలు ఎంత ఆనంద పడుతున్నారో చూడండి. కన్నయ్య వేణుగానం మళ్ళీ ప్రారంభించాడు. అంతే ఊయలపై మరొకరికి చోటు కనిపించింది. ఇంకొక గోపిక ఎక్కింది.

ఇలా ఎంతో ఆశ్చర్యంగా ఒకొక్క గోపిక ఆ ఊయల ఎక్కుతుంటే మరొకరికి చోటు కనిపిస్తోంది. ఇలా అక్కడ ఉన్న గోపికలందరూ ఆ ఊయల ఎక్కి కూర్చున్నారు. ఆ ఊయల ముందుకి వెనక్కి దివ్య తరంగంలాగా ఊగుతోంది. కృష్ణయ్య వేణుగానం ఎంతో మనోహరంగా ఊదుతూ ఉంటే ఆ గోపికలందరూ మైమరిచిపోయారు. ఎంత అద్భుతంగా ఉంది ఆ దృశ్యం ఇందరు భక్తులని ఆ కన్నయ్య ఎలా అలరిస్తున్నాడో చూడండి. పురుషోత్తముడు తలిస్తే దొరకనిది ఏమైనా ఉంటుందా? అనన్య భక్తితో ఆ స్వామిని కొలిచేవారికి లభించనిది ఏదైనా ఉంటుందా?

తనకోసం ఈ గోకులంలో జన్మించిన గోపికల ప్రతీ ముచ్చట తీర్చాలని తలచాడు ఆ కన్నయ్య. అందుకే ఈనాటి ఈ లీల. ఒక్కరికి మాత్రమే చోటు కనపడిన ఈ ఊయలపై ఇంతమంది గోపికలు కూర్చున్నారు. ఇందరు గోపికలతో మధ్యలో వేణుగానం చేస్తూ పైన రంగు రంగుల పక్షులతో కింద జింకలు, నెమళ్ళతో ఉన్న ఆ బృందావనం దృశ్యం చూడండి. మన మనస్సు ఎంత పరవశిస్తుందో!.

అలా కాసేపు ఊగిన తరువాత కన్నయ్య ఒకొక్క గోపికను కిందకి దించాడు. కన్నయ్య చెయ్యి పట్టుకొని ఒకొక్క గోపిక ఊయల పై నుంచి కిందకు దూకింది. ఒకొక్కరిని అలా దింపి చివరన తాను దిగాడు. అలా అందరూ దిగిన తరువాతనే తాను ఊయల దిగాడు. తాను ముందు దిగితే ఆ ఊయల తక్షణం తెగి పడుతుందని కన్నయ్యకు తెలుసు తన మాయతో అందరి శరీరాలని దూది పింజలకంటే తక్కువ బరువు ఉండేలా మాయచేసాడు. అలా అందరూ దిగిన తరువాతనే కన్నయ్య దిగాడు. అప్పుడు మళ్ళీ ఊయలవైపు చూసిన గోపికలందరూ నిర్ఘాంతపోయారు. అక్కడ ఒక్కరుకంటే ఎక్కువ కూర్చొనే చోటు కనపడలేదు. ఆహా ఇదంతా మన కన్నయ్య అనుగ్రహం కదా అని వారు ఎంతో ఆనందించారు. వారిని అలా ఆనందపరిచిన తరువాత కన్నయ్య గోపికలందరితో కలిసి తిరిగి సాయంత్రానికి ఇంటికి చేరుకున్నాడు.

# 20

ఒకనాడు కన్నయ్య గోపబాలురతో ఆడుకుంటూ అడవిలోకి వచ్చాడు. అక్కడ కొంత దూరంలో కృష్ణునికి ఒక గురుకులం కనిపించింది. అక్కడ కొందరు మహర్షులు ఒక యజ్ఞం నిర్వహిస్తున్నారు. కన్నయ్య గోపబాలురుని ఇక్కడే ఉండమని చెప్పి తాను ఆ మహర్షుల వద్దకు ఆ హోమగుండాల వద్దకు వెళ్ళాడు. వారిని చూసి కన్నయ్య ఈ యజ్ఞఫలం ఎవరికి ఇస్తున్నారు అని అడిగాడు. ఇది విన్న ఆ మహర్షులు నిర్ఘాంతపోయారు. ఇంత చిన్న పిల్లవాడేమిటి ఇటువంటి ప్రశ్న అడగడమేమిటి అని ఎంతో ఆశ్చర్యపోయారు.

అప్పుడు వారిలో ఒకరు ఈ యజ్ఞఫలం ముల్లోకాలకు నాధుడైన ఆ శ్రీమహావిష్ణువుకు సమర్పిస్తున్నాము అని అన్నారు. ఓహో అలాగా అని కన్నయ్య చిరునవ్వు నవ్వాడు. ఆ పిల్లవాడి తేజస్సు చూసి వారు ఎంతో ఆశ్చర్యపోయారు. వారిలో ఒకరు కన్నయ్యను గుర్తించి గోకులంలో పుట్టిన

ఒక బాలుడు ఎన్నో అద్భుతాలు చేస్తున్నాడు అని విన్నాము. అది నువ్వే అన్నమాట అని అన్నాడు. అప్పుడు కన్నయ్య అది నేనే అన్నమాట నిజమే కాని నేనేమి అద్భుతాలు చేయడంలేదు అని అన్నాడు. ఇలా అంటూ అక్కడ పక్కనే వారు యజ్ఞం కోసమే పెట్టుకున్న ఒక గుండిగ నిండా ఉన్న పాలన్నీ పైకెత్తి ఒక్క క్షణంలో మొత్తం తాగేసాడు. ఈ దృశ్యం చూసిన ఆ మహర్షులకు ఆశ్చర్యము కోపము రెండూ కలిగాయి చిన్న పిల్లవాడేమిటి? ఇంత గుండుగ నిండా ఉన్న పాలు తాగడమేమిటి? అయినా మన యజ్ఞం కోసం పెట్టుకున్న పాలు ఈ పిల్లవాడు ఇలా తాగేసాడేమిటి అని కోపగించుకున్నారు.

వారి కోపాన్ని చూసిన కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ ఒక్కసారి మీ నలుగురు ఇలా వస్తారా అన్నాడు. ఆ నలుగురు ఏదో మాయలో పడిన వారిలా కన్నయ్యతోపాటు పక్కన ఉన్న చెట్ల మధ్యకు వెళ్ళారు. అప్పుడు కన్నయ్య వారితో మీలో ఎవరికైనా ఎప్పుడైనా ఆ శ్రీమన్నారాయణుని దర్శనం కలిగిందా అన్నాడు. అందుకు వారు ఆ శ్రీమన్నారాయణుల వారి దర్శనం కలగడమా? అంత అదృష్టం కూడానా? ఎన్ని వేల సంవత్సరాల తపస్సుచేస్తే, ఇటువంట ఎన్ని వేల యజ్ఞాలను చేస్తే ఆ స్వామి దర్శనం లభిస్తుంది అని అన్నారు. వారిలో ఒక మహర్షి కన్నయ్యతో అయినా ఇవన్నీ మీకెందుకు గానీ నువ్వు మేము యజ్ఞం నిమిత్తం పెట్టుకున్న ఆ పాలన్నీ ఎందుకు తాగావు అని అడిగారు. దానికి కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ ఆకలి వేసి తాగాను అని అన్నాడు. వారికి కోపం ఇంకా ఎక్కువ అయింది.

అప్పుడు వారికి ఒక అద్భుతం కనిపించింది. కన్నయ్య ఉన్నచోట ఒక్కసారిగా శ్రీ నరసింహ స్వామి దర్శనమిచ్చారు. వారందరూ ఆశ్చర్యపోయి ఆ స్వామిని ఎన్నో విధాల స్తుతించారు. ఇంతల ఆ నరసింహ రూపం మాయమై వారికి శ్రీరామచంద్రుడు దర్శనమిచ్చాడు. ఆ నలుగురు మహర్షులకి ఆశ్చర్యంతో, ఆనందంతో నోట మాట రాలేదు. అటుతరువాత కన్నయ్య వారికి వానమమూర్తిగా కనిపించాడు. కాసేపటికి వరాహమూర్తిగా దర్శనమిచ్చాడు. అటుతరువాత నాలుగు చేతులతో శంఖు చక్రాలతో

శ్రీమన్నారాయణుడిలా దర్శనమిచ్చాడు. వారు ఆశ్చర్యం నుంచి తేరుకునే లోపలే తిరిగి కన్నయ్య తన అసలు స్వరూపానికి వచ్చి చిరునవ్వు నవ్వుతూ నుంచున్నాడు.

అప్పుడు మహర్షులు కన్నయ్యతో స్వామి నిన్ను మా మూర్ఖత్వంచేత, అజ్ఞానంచేత గుర్తించలేకపోయాము. ఈ రూపాలన్నీ నీవేకదా నీ తత్వం తెలుసుకోవడం ఎవరికీ సాధ్యం కాదు? ఈ గోకులంలో చిన్ని కన్నయ్యగా జన్మించి అందరినీ తరిపంచేస్తున్నావు. ఎన్నో వేల యజ్ఞాలు చేసినా, ఎన్నో వేల తపస్సులు చేసినా లభించని నీ దివ్యరూపాల దర్శనం మాకు కలిగింది. ఇంతకుమించి మాకేమి కావాలి మమ్మల్ని ఇంతగా అనుగ్రహించిన నీకు అనేక వేల నమస్కారాలు అని అన్నారు.

అప్పుడు కన్నయ్య వారితో ఓ మహర్షులారా రాబోయే కాలంలో ధర్మం మరింత క్షీణించబోతున్నది ధర్మం రక్షింపబడడం కోసం మీరు ఇంకా ఇలా యజ్ఞాలు చేస్తూ ఉండండి. ఇది లోక కళ్యాణానికై ఎంతో ఉపయోగపడగలదు. నేను మీకు ఇన్ని రూపాలు అనుగ్రహించిన విషయం ఎవ్వరికీ చెప్పవద్దు. దీనిని గోప్యంగా ఉంచండి అని అన్నాడు. అందుకు వారందరూ అలాగే స్వామి ఈ విషయం ఎవ్వరికీ బహిర్గతపరచం అని అన్నారు. అందరూ కలిసి తిరిగి యజ్ఞవాటిక దగ్గరకు వచ్చారు. కన్నయ్య వారిదగ్గర సెలవు తీసుకొని గోపబాలురు దగ్గరకు వెళ్ళాడు. కన్నయ్య వెళ్ళేటప్పుడు వారు నమస్కరించబోతే కనుసన్నలతోనే వారిని వద్దని వారించాడు. వారికి అర్థమైంది. వెంటనే ఆ ప్రయత్నం విరమించుకున్నారు.

# 21

ఒకరోజు కన్నయ్య గోపబాలురుతో కలిసి ఆడకుంటూ ఊరు బయటకు వచ్చాడు. చుట్టూ ఎన్నో చెట్లు మధ్య మధ్యలో పెద్ద పెద్ద రాళ్ళు. వారితో కలిసి ఈ రాళ్ళపై ఈచెట్లపై ఎగురుతూ పరుగెడుతున్నాడు. అలా పరుగెడుతుండగా ఒక్కసారి ఒకరాయి కాలికి తగిలి ముందుకు తూలిపడి నుదుటిమీద చిన్నటి గాయమై కృష్ణుడు కిందపడ్డాడు. ఆ గాయం నుంచి కొన్ని రక్తపు బొట్లు భూమిమీద పడ్డాయి. భూదేవి హఠాత్తుగా జరిగిన ఈ పరిణామానికి హతాశురాలై అయ్యో శ్రీమన్నారాయణుల వారికి నుదుటిమీద తగిలి ఇలా రక్తం చిందించడమా అని ఎంతో బాధపడింది. ఇంతలో కొందరి స్నేహితులతో అటుగా వెళ్తున్న గీతిక కృష్ణయ్య చుట్టూ గోపబాలురు మూగిఉండడం చూసి కన్నయ్యకు ఏమయ్యిందోనని అనుకుంటూ ఎంతో ఆంధోళన చెందుతూ అక్కడకు వచ్చింది. చూడగానే నుదుటిమీద గాయం కనపడింది.

వెంటనే గీతిక తన చీరకొంగు చింపి కన్నయ్యకు నుదుటిపై గట్టిగా కట్టింది రక్తం ఆగిపోయింది. కన్నయ్య నవ్వుతూ పిల్లలతో ఆడుకుందాం పదండి అన్నాడు. అప్పుడు గీతిక కన్నయ్యతో ఇంక ఆటలు చాలు! ఇక ఇంటికి వెళ్ళు కన్నయ్యా! అంది నేను వస్తాను పద అన్నది. గోపికలందరికి కృష్ణుడు అంటే అమితమైన ప్రేమ వారు అంత గట్టిగా చెప్పేటప్పటికి ఇంటికి వెళ్ళక తప్పలేదు. అది గోధూళి వేళ గోవులన్నీ ఇళ్ళకు చేరుకుంటున్నాయి. గీతిక తన మిగిలిన స్నేహితులతో కన్నయ్యతో గోపబాలురతో, ఆలమందలతో కలిసి గోధూళి వేళ అలా బృందావనంలోకి వస్తూంటే ఆ దృశ్యం ఎంతో కమనీయంగా ఉంది. కన్నయ్య తలకి చుట్టుకున్న ఆ గుడ్డతో చూడడానికి ముచ్చటగా ఉన్నాడు.

అలా ఇంటి వద్దకు వస్తున్న కన్నయ్యను దూరంనుంచే చూసిన యశోద అయ్యో ఏమైంది నా కన్నతండ్రి అంటూ పరుగెత్తుకుంటూ వచ్చింది. గీతిక యశోదతో అక్కడ జరిగిందంతా చెప్పింది. వెంటనే యశోద కంగారు పడుతూ అమ్మో ఎంత దెబ్బ తగిలిందో అది కూడా రక్తం వచ్చిందంటున్నావు ఇంత పసుపు రాసి మళ్ళీ మంచి గుడ్డ కడతాను అని కన్నయ్య నుదుటిపై ఉన్న ఆ గుడ్డ ముడి విప్పింది. ఆశ్చర్యం అక్కడ దెబ్బ తగిలిన గుర్తు ఏమాత్రం లేదు.

యశోద గీతికతో ఇదేంటమ్మా దెబ్బ తగిలిందన్నావు అదీ రక్తం కారిందన్నావు! మరి ఇక్కడ ఒక చిన్న మచ్చకూడా లేదు! నువ్వు నీ ముచ్చట కోసం నీ చీర కొంగు చింపి కన్నయ్యకు ఇలా కట్టినట్లున్నావు మీ అందరికీ నా కన్నయ్య అంటే ఎంత ప్రేమ ఉంటే మాత్రం మరీ ఇలా అబద్ధాలు చెప్తారా? అది కూడా దెబ్బతగిలి రక్తం కారిందని చెప్తారా అని అంది. అప్పుడు గీతిక అయ్యో యశోదమ్మ కన్నయ్యకు దెబ్బ తగిలి అదికూడా కిందపడి రక్తపు చుక్కలు నేలమీద పడి ఉండడం మేమందరం చూసాము. కావాలంటే ఇదిగో ఈ గోపబాలురందరిని అడుగు అని అన్నారు.

ఆ గోపబాలురందరు అవును కన్నయ్యకు రక్తం కారింది అన్నారు. గోపికలందరూ కూడా అదే మాట అన్నారు కన్నయ్య మాత్రం చిరునవ్వు

నవ్వుతూ ఏమో నాకేమీ తెలియదు కిందపడి లేచాను ఇంతలో గీతిక వచ్చి నా తలకి ఇలా కట్టింది అంది. అప్పుడు గీతిక యశోదమ్మతో యశోదమ్మ కావాలంటే రేపు ఉదయం మనం ఈ రోజు కన్నయ్య పడిన ప్రదేశానికి వెళ్ళి అక్కడ రక్తపు మరకలు నీకు చూపిస్తాను. రేపు ఉదయం వస్తాను ఇప్పటికే చీకటి పడింది కదా అని అంది.

కన్నయ్య ఇంట్లోకి వచ్చి కాళ్ళు చేతులు ముఖం కడుక్కొని యశోదమ్మ ఇచ్చిన వెచ్చని పాలు తాగి కాసేపటి తరువాత స్నానం చేసి భోజనం చేసి పడుకున్నాడు. కన్నయ్య చిరునవ్వుతో తాను అంతకుమునుపు ద్వాపర యుగంలో అంతకుమునుపు మహాయుగంలోని ఈ నాటి ఈ గీతిక గోపికగా పుట్టినప్పుడు తనపై ఎంతో ప్రేమతో వాత్సల్యంతో ఉండడం గుర్తుకు వచ్చింది.

గీతిక కొన్ని లక్షల సంవత్సరాల పాటు తన అనుగ్రహం కోసం తన సాన్నిహిత్యం కోసం ఎంతో గొప్ప తపస్సు చేసన మహాయోగి. క్రిందటి మహాయుగంలోని ద్వాపరయుగంలో తాను కృష్ణుడిగా అవతరించినపుడు బృందావనంలో ఈమె ఇదే పేరుతో జన్మించింది. కృష్ణుడ్ని ఎంతో ఆరాధించేది. బృందావనంలో ఉన్నన్ని రోజులు కాసేపైనా ప్రతీ రెండు మూడు రోజులకు ఒకసారి వచ్చి కలిసి వెళుతుండేది. ఆ విధంగా ఆ పరమాత్మునితో ఎంతో మధుర సాన్నిహిత్యం అనుభవించింది.

ఈ సృష్టిలో అన్నిటికన్నా మించిన ఆనందం కృష్ణ ఆరాధనలోని, కృష్ణ ఆలోచనలోను లభిస్తుంది. ఇక కృష్ణ సాన్నిహిత్యం కూడా లభించిన వారి ఆనందం చెప్పనలవి కానిది. అటువంటి ఆనందం పొందిన మహాయోగి నేటికి మన మధ్య సామాన్య మానవులే జన్మించి ధర్మాన్ని ఆచరిస్తూ ధర్మాన్ని ప్రచారం చేస్తూ ధర్మస్వరూపులై జీవిస్తూ ఆనాడు తాము కృష్ణుడి వద్ద పొందిన ప్రేమ తత్వాన్ని తమ వద్దకు వచ్చే ప్రతీ ఒక్కరికి పంచుతున్నారు. అటువంటి మహనీయులు ప్రస్తుత కాలంలో కూడా ఈ భూమిపై ఎన్నో ప్రదేశాలలో ఉన్నారు. మన పూర్వజన్మ పుణ్యఫలం వలన అటువంటి వారిని దర్శించిన,

వారి వద్ద కాసేపు కూర్చున్న మన హృదయాలలో ఎంతో అద్భుత ఆనందం జనిస్తుంది. వీరిలో కొందరు సాక్షాత్తూ ఆ కృష్ణ భగవానుని అంశతోనే జన్మించినవారు కూడా ఉన్నారు.

కన్నయ్య అలా ఆలోచిస్తూ అంతకు ముందు మహాయుగంలోని వెళ్ళి అప్పటి దృశ్యాలన్నీ చూస్తున్నాడు. అప్పుడు తాను ఒకనాడు గీతికకి తన చీర కొంగుతో రాబోయే ద్వాపరయుగంలో తలపాగా చుట్టించుకుంటానని మాటిచ్చాడు. ఈలోపు వచ్చే యుగాలలో అప్పుడప్పుడు జన్మించి తపస్సు చేసుకుంటూ ఉండవలసిందిగా చెప్పాడు. ఆ గీతికే మళ్ళీ ఈనాడు ద్వాపరయుగంలో మళ్ళీ గోపికగా జన్మించి ఈనాడు ఆమె ముచ్చట తీర్చాడు. మరునాటి ఉదయమే గీతిక ఎనిమిది గంటలకల్లా కన్నయ్య ఇంటికి వచ్చింది. యశోదమ్మ నిన్న కన్నయ్య పడిన ప్రదేశానికి ఇంక వెళదామా పదా అంది అందరూ కలిసి నిన్న కన్నయ్య పడిన ప్రదేశం దగ్గరకి వచ్చారు.

అక్కడ ఎంత వెతికి చూసిన నిన్న రక్తం పడిన ఛాయలు ఎక్కడా కనిపించలేదు. పైగా ఆ ప్రదేశంలో ఒక అద్భుతమైన వృక్షం కనిపించింది. ఆ వృక్షం కొన్ని కొమ్మలపై పువ్వులు కొన్ని కొమ్మలపై ఫలాలతో చూడ్డానికి ఎంతో అద్భుతంగా ఉంది. యశోదమ్మ మునుపెన్నడూ ఇటువంటి వృక్షం చూడలేదే అనుకుంది. గీతిక కూడా యశోదమ్మతో నిన్న ఈ వృక్షం ఇక్కడ లేదమ్మా అంది. యశోదమ్మ వారితో గీతిక నువ్వు చెప్తుంది ఏదీ కూడా నమ్మేలా లేదు రాత్రికి రాత్రి ఈ వృక్షం ఎలా వస్తుంది అని అంది.

గీతికకి చాలా ఆశ్చర్యం వేసింది. కన్నయ్య పడడం రక్తపు బొట్లు కారడం తన కళ్ళతో చూసింది. అటువంటిది ఇక్కడ ఏ మాత్రం చిన్న రక్తపు బొట్లు పడిన ఛాయలు లేకపోవడం ఎంతో ఆశ్చర్యం కలిగింది. ఇంతకీ జరిగిన విశేషం ఏమిటి అంటే ఎప్పుడైతే కృష్ణయ్య రక్తపు చుక్కలు భూమిపై పడ్డాయో మహాలక్ష్మి ఎంతో బాధపడింది. వెంటనే తన అంశతో అక్కడ ఒక వృక్షాన్ని సృష్టించింది.

శ్రీమన్నారాయణుడి రక్తపు బొట్టు పడిన ప్రదేశం అతి పవిత్రమైనది వలన దానిపై మానవులు ఎవ్వరూ కాలు పెట్టకూడదు అని గ్రహించి తన అంశతో ఒక అద్భుత వృక్షాన్ని ఆ ప్రదేశంలో సృష్టించారు. ఆ వృక్షం ద్వాపరయుగంలో అందరికీ దర్శనమిస్తూ కలియుగం వచ్చే నాటికి ధర్మం పూర్తిగా సన్నగిల్లడంతో ప్రస్తుత కాలంలో అదృశ్య రూపంలో ఉంది. కేవలం మహాయోగులకు ఎంతో గొప్ప కృష్ణ భక్తులకు మాత్రమే ఆ దివ్య వృక్షం దర్శనమిస్తుంది.

సామాన్య మానవులెవ్వరికీ ఆ మహాలక్ష్మి అంశ వృక్షం కనపడదు. అయితే ఆ ప్రదేశంలో మనం సంచరిస్తున్నప్పుడు మనకు మన మనస్సులలో ఎంతో దివ్యమైన అనుభూతి కలుగుతుంది. ఇది ఎందరో సాధకులకి బృందావనంలో ఆ ప్రదేశంలో సంచరిస్తున్నప్పుడు కలుగుతున్న దివ్య అనుభూతి. వారందరూ ఆ వృక్షం పక్కగా నడుస్తున్నప్పుడు వారి మనస్సులలో అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతున్నారు. కృష్ణునిపై అనన్యమైన భక్తి కలిగిన వారికి వారు ఏ ప్రదేశంలో ఉన్నప్పటికైనా ధ్యానంలో వారికి ఈ దివ్య వృక్షం దర్శనమిస్తుంది. వీరిలో కొందరికి కృష్ణుడు, ఆ దివ్య వృక్షం కూడా ఒకేసారి దర్శనమిచ్చి వారికి ఎంతో ఆనందం కలుగుతుంది.

# 22

గోకులంలోని గోపబాలురందరికీ కృష్ణునితోనే లోకమంతా కృష్ణునితోనే ఆటలు పాటలు. వారు మెలకువగా ఉన్న నిద్రలో ఉన్న వారి మదిలో ఎప్పుడూ కృష్ణయ్య రూపమే మెదులుతుంది. ద్వాపరయుగంతో ఆ విధంగా గోకులంలో, బృందావనంలో కృష్ణుడితో సాన్నిహిత్యంగా ఉన్నవారు కొందరు కలియుగంలో గొప్ప కృష్ణ భక్తులై జన్మించి కృష్ణునిపై అనేక పుస్తకాలు రచించారు. కొందరు గొప్ప సంకీర్తనలు రచించారు. కొందరు తమ జీవితాలలో రాధాకృష్ణ మధుర భక్తి సాంప్రదాయాన్ని ప్రచారం చేయడానికి జన్మించారు. మరికొందరు కృష్ణ తత్వాన్ని కృష్ణ తత్వంలోని అనేక కోణాలను అతి సామాన్య మానవులకి కూడా అర్థమయ్యేలా ఎన్నో గొప్ప పుస్తకాలు వ్రాసారు.

కొందరు అతి తేలిక పదాలతో గొప్ప కీర్తనలు రాసారు. మరికొందరు ఆ కీర్తనలను, ఆ పాటలను ఎంతో మధురంగా ఆలపిస్తారు.

కృష్ణుడికి సంబంధించిన ఏ పాటనైనా వారు పాడుతుంటే మన మనస్సులు ఎంతో ఆనందంతో ఉప్పొంగుతాయి. దానికి కారణం వారికి ద్వాపర యుగంలో ఆ కన్నయ్యతో సాన్నిహిత్యం ఉండడమే.

ఆ రోజు కన్నయ్య స్నేహితులతో కలిసి బృందావనంలోని అడవిలోకి బయలుదేరాడు. ఒకచోట ఆ పిల్లలకు ఎంతో ఆకలి వేసింది. అప్పుడు కన్నయ్య అక్కడ ఉన్న ఒక పళ్ళ చెట్టు ఎక్కాడు. ఆ చెట్టు ఎక్కడం ఎంతో కష్టమైనప్పటికి కన్నయ్య అతి సునాయాసంగా ఎక్కడం చూసి వారందరూ ఎంతో ఆశ్చర్యపోయారు. పిల్లలందరూ కింద నుంచొని కన్నయ్య పైనుంచి ఆ పళ్ళను కిందకి వేస్తాడ అని ఎదురు చూస్తున్నారు.

ఇంతలో రాధ కొందరు గోపికలతో కలిసి అటుపక్కగా వచ్చింది. చెట్టు మీద ఉన్న కన్నయ్యను చూసి ఎంతో ముచ్చటపడి ఒక్క పరుగున వచ్చి ఆ చెట్టు ఎక్కింది. గోపికలందరూ ముక్కున వేలు వేసుకున్నారు. ఆ చెట్టుపై అప్పటికే ఉన్న ఎన్నో రకాల పక్షులు, నెమళ్ళు రాధాకృష్ణులను ఈ చెట్టు కొమ్మలపై చూసి ఎంతో ఆనందిస్తున్నాయి. కన్నయ్యను చూసిన రాధ నీ స్నేహితులకు పళ్ళు కావాలా అని అడిగింది. అలా అంటూ ఒక కొమ్మ మీదనుంచి మరొక కొమ్మ మీదకు ఎగర సాగింది. అలా ఎగిరినప్పుడు ఆ కొమ్మపై ఉన్న పళ్ళు జలజలా కిందకు రాల సాగాయి.

కింద ఉన్న గోపబాలురు గోపికలు ఇదంతా చూసి ఆశ్చర్యపోతున్నారు. రాధలో ఇంతటి శక్తి ఉందా అని వారికి ఎంతో ఆశ్చర్యం కలిగింది. రాధలో గల శక్తి వారికి తెలియదు రాధ అటూ ఇటూ కొమ్మలపై ఎగురుతుంటే కన్నయ్యకూడా ఆ కొమ్మలపై ఊగుతూ ఒక కొమ్మ మీదనుంచి మరొక కొమ్మకి ఎగరసాగాడు. కిందనుంచి చూస్తున్న వారికి రాధాకృష్ణులిద్దరూ అద్భుతమైన నృత్యం చేస్తున్న భావన కలుగుతోంది.

ఆ రోజు కృష్ణయ్య నెమ్మదిగా యమున ఒడ్డుకు చేరి ఒక రాతిమీద కూర్చొని యమున వైపు తిరిగి వేణువు ఊదుతున్నాడు. కన్నయ్యను చూసిన

యమునా నది పరవశించింది. ఒక్కసారిగా కొన్ని అలలు వచ్చి కన్నయ్య పాదాలను స్పృశించి వెనక్కి వెళ్ళాయి. యమున ముచ్చట చూసి కన్నయ్య చిరునవ్వు నవ్వుకున్నాడు తిరిగి వెళుతున్న అల బెంగ పెటుకున్నదట! ఆ బెంగ వలన మళ్ళీ వచ్చి కన్నయ్య కాళ్ళను తాకింది. కన్నయ్య యమున వంక చూస్తూ తనివి తీరిందా అన్నాడు. యమున కృష్ణా! నీ పాదస్పర్శతో నేను పునీతురాలిని అయ్యాను. ఏ నదికీ రాని భాగ్యం నాకు లభించింది. సృష్టి ఉన్నంతకాలం ప్రజలందరూ యమున ఒడ్డున కృష్ణయ్య రాసలీలలు గురించే చెప్పుకుంటారు. ఇలా నేను కూడా ఎప్పటికీ ప్రజల హృదయాలలో ఉండిపోతాను. ఎన్నిసార్లు కన్నయ్యను ఇలా వెన్నెల రాత్రిలో చూడగలిగాను.

తెల్లటి వెన్నెల నల్లనయ్య మీద పడుతుంటే ఆ కన్నయ్య తేజస్సు ఆకాశం మొత్తం వ్యాపించిన కారుమేఘంలా కనిపిస్తోంది. ఎంతో తేజస్సుతో మెరిసిపోతుంది ఆ మేఘం. యమున తన ఒడ్డున కూర్చుని వేణునాదం ఊదుతున్న కన్నయ్యను చూస్తూ ఇలా ఎంతో మురిసిపోతుంది. తన భాగ్యానికి ఎంతో ఆనందపడుతోంది.

ఇంతలో వెనకి నుంచి వచ్చి రాధ నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ  తన మధురమైన చేతులతో కన్నయ్య కనులు మూసింది. ఎవరో చెప్పుకో అంది కన్నయ్యకు రాధ ముచ్చట అర్థమయింది. కాసేపు ఆట పట్టిద్దాము అనుకున్నాడు. ఎంత లేత చేతులు ఎంత మెత్తగా ఉన్నాయి ఇది గీతికే అన్నాడు. రాధ చిరుకోపంతో ఉహూ! కాదు అంది అప్పుడు కన్నయ్య ఏదో ఆలోచిస్తున్నవాడిలా నటించి ఇప్పుడు తెలిసింది ఈ చేతులు విశాలివే. ఆమెవే ఇంత మెత్తటి చేతులు ఆ స్పర్శ ఇప్పటికి నాకు గుర్తు ఉంది. రాధ మళ్ళీ ఉహూ కాదు కానే కాదు అంది. అప్పుడు కన్నయ్య  ఇది రాధ! రాధ కాక ఇంకెవరు? అప్పుడు రాధ ఒక్కసారిగా కన్నయ్య ముందుకు దూకింది. ఆ దూకిన క్షణంలోనే యమునా నది అల ఒకటి కన్నయ్య పాదాలను తాకడానికి వచ్చింది. అదే క్షణంలో రాధ కన్నయ్య ముందుకు దూకింది. అక్కడితో ఆ అల రాధాకష్ణుల ఇద్దరి పాదాలను తాకింది. ఆహా

యమున ఆనందం చెప్పనలివి కానిది. ఎంతటి భాగ్యమో ఈ వెన్నల రాత్రి రాధాకృష్ణుల కాళ్ళను తాకే భాగ్యం లభించింది అని తలచింది.

రాధ కన్నయ్యతో ఏది మళ్ళీ మురళి వాయించు అంది. కన్నయ్య చిరునవ్వు నవ్వుతూ రాధ ముఖంలోకి చూస్తూ సుమనోహరంగా మురళీగానం ప్రారంభించాడు. ఆ మురళీ నాదం విని ఎక్కడో దూరాన ఉన్న గోపికలు ముగ్ధులయ్యారు. వారు అంత దూరం నుండే ఈ నాదాన్ని విన్నారు. వారి హృదయాలు ఎప్పుడూ కన్నయ్యతోనే ఉంటాయి. వారిలో వివాహం కానివారు ఉన్నారు. అయిన వారు ఉన్నారు. కాని ఇవేమీ వారికి పట్టవు. ఈ లౌకిక బంధాలేవి వారి ఆత్మను బంధించలేవు. శరీరాలు భర్తలకు అంకితం శరీరానికి, మనస్సుకు సంబంధించిన ప్రేమ భర్తలకే. కాని ఆత్మ మాత్రం ఈ కన్నయ్యతోనే! ఆత్మ సంగమం అంటే వీరి ఆత్మలో కన్నయ్య ఆత్మను కలుపుకోవడం అలాగే కన్నయ్య ఆత్మలో తన ఆత్మ కలిసిపోవడం. అంటే బ్రహ్మానందంతో తమ నాదాలను పలకడం అన్నమాట.

అందుకే వారు ఎక్కడ ఏ స్థితిలో ఉన్నా కన్నయ్య సన్నిధిని, కన్నయ్య ప్రేమతత్వాన్ని పూర్తిగా ఆస్వాదించగలుగుతున్నారు. వారు నిద్రలో ఉన్న మెలకువ స్థితిలో ఉండే యోగులు. అందుకే వారు ఎంత దూరంలో ఉన్నా, ఎక్కడ ఉన్నా ఏ పనిలో ఉన్నా కన్నయ్య మురళి ఆలపించగా ఆ ఆనందంతో అనుసంధానం అవుతారు. అందుకే గోపికలు ఎప్పుడూ వర్ణించలేని అందంతో, తేజస్సుతో ప్రకాశిస్తూ ఉంటారు. ఇక్కడ కన్నయ్య యమున ఒడ్డున రాధకోసం ఆలపిస్తున్న ఆ వేణు నాదం ప్రకృతిలో ఎక్కడో ఉన్న కృష్ణ ప్రేమికులను అలరిస్తోంది. అందరి హృదయాలను సుమధురంగా తాకుతోంది. రాధ మోకాళ్ళమీద కూర్చొని రెండు చేతులు తన చెంపలపై పెట్టుకుని తన ముఖం కన్నయ్య కలిపై పెట్టుకొని పక్కకు తిరిగి కన్నయ్య పాదాలను చూస్తూ ఆ మురళీ గానం మనసారా వింటుంది. మధ్య మధ్యలో తన ఇద్దరి కాళ్ళను తాకుతున్న యమునను చూసి మురిసిపోతుంది.

కాసేపటి రాధలేచి ఒక్కసారిగా నృత్యం చేయడం ప్రారంభించింది. ఎంతో అద్భుతంగా ఉంది రాధమ్మ నృత్యం! పక్కన యమున పైన చంద్రుడు ఈ రాధాకృష్ణుల ముచ్చట్లు చూసి ఎంతో మురిసిపోతున్నారు. కన్నయ్య మురళి వాయిస్తూనే నృత్యం చేస్తున్నాడు. ఆహా ఆ రెండు ప్రేమ తత్వాల అద్భుత నృత్యం ఎంత లయబద్ధంగా ఉంది. ఈ విశ్వంలోని ప్రకాశం మొత్తం ఈ లయతోనే కదా!

ఇలా నృత్యం చేస్తూ రాధాకృష్ణులు కొద్దిగా ముందుకు వచ్చి యమునా తరంగాలు కాళ్ళకు తాకేలా నుంచొని నృత్యం చేయసాగారు. అలా నృత్యం చేస్తుంటే మధ్య మధ్యలో ఒక అల వచ్చి తన పాదాలను తాకి వెనక్కి వెళ్ళిపోతూ ఉంటే ఆ దృశ్యం ఎంతో అద్భుతంగా ఉంది. రాధ కాసేపు కన్నయ్య దగ్గర మురళి తీసుకొని ఎంతో మనోహరంగా ఊదసాగింది.

ఆహా ఎంత మనోహరంగా ఉంది ఆ వేణునాదం! రాధాదేవి ప్రేమతత్వం! శక్తి స్వరూపం! ఆ తల్లి వేణువూదిందంటే ఇంక ఎంత మధురంగా ఉంటుంది! ఆ మనోహరి వేణునాదానికి సృష్టి మొత్తం ఒక యోగమాయలో పడిపోయిందట! ఇంకా కాసేపు ఇలా రాధ మురళిని ఇలా గానం చేస్తూఉంటే ఈ సృష్టి మొత్తం యోగమాయలో పడి కొన్ని యుగాలు ఉండిపోతుందట! అది ఆ కన్నయ్యకు బాగా తెలుసు. అందుకే రాధతో రాధా ఒక్కసారి నా మురళిని ఇలా ఇవ్వు కాసేపు నాకు కూడా గానం చెయ్యాలని ఉంది అని అన్నాడు. అప్పుడు రాధ కన్నయ్యకు ఆ మురళిని ఇచ్చింది అప్పుడు సృష్టి మొత్తం యోగ మాయ నుండి మేల్కొంది. తన దివ్యానుభూతిని తన గ్రహిస్తుంది. ఇంక కాసేపటిలో తెల్లవారుతుంది అప్పుడు రాధాకృష్ణులు ఇద్దరు ఒకరినుంచి ఒకరు సెలవు తీసుకొని వెళ్ళారు.

రాధాకృష్ణుల లీలలు అమృతం, ఆమోఘం. వారిద్దరూ ఒకే రూపానికి గల రెండు తత్వాలు. ప్రపంచమంతటా కన్నయ్యలో గల ఆ రాధాతత్వానికే ఆకర్షింపబడుతోంది. రాధాకృష్ణులు అనే రెండు పేర్లు ఒకేసారి పలకగానే ఒళ్ళంతా పులకరిస్తోంది. మనసంతా ఎంతో అద్భుతమైన

ప్రేమ భావన కలుగుతుంది. రాధాకృష్ణుల ప్రేమ తత్వం మనందరిని అంతటా పులకరింపచేస్తుంది.

ఒకసారి కొందరు గోపికలు కృష్ణయ్యను ఇలా అడిగారు. కన్నయ్యా నీ నుంచి నీ వద్ద ఇప్పుడు ఇంత మధుర ప్రేమ పొందిన మేము మా పూర్వజన్మల ప్రారబ్ధ కర్మల వలన వచ్చే జన్మలలో నీ ప్రేమ, నీ సాన్నిహిత్యం ఎలా పొందగలము? ఈ విషయం మమ్మల్ని ఇప్పటినుంచే ఎంతో బాధపెడుతుంది అని అన్నారు. అప్పుడు కన్నయ్య చిన్నగా నవ్వుతూ గోపికలారా మీరంతా ఎంతో పుణ్యం చేసుకున్నవారు. వచ్చే జన్మలో చాలా తక్కువ జన్మలు తీసుకుంటారు. అనేక మహత్తర కార్యాలతో నన్నే ఎల్లవేళలా స్మరిస్తూ, ధ్యానిస్తూ నా ప్రేమ తత్వాన్ని పూర్తిగా తన్మయత్వంతో, అమితానందంతో అనుభవిస్తుంటారు. ఈ రోజు మీరు ఎంత సాన్నిహిత్యంగా ఉంటున్నారో అప్పుడు కూడా మీరు ఇదే సాన్నిహిత్య వైభవాన్ని అనుభవిస్తారు అని అన్నాడు. అప్పుడు గోపికలు కన్నయ్యతో స్వామి నువ్వు చెప్పినది చాలా సంతోషం కాని మేము కలి మాయలో పడకుండా మమ్మల్ని అనుగ్రహించు అన్నారు.

కన్నయ్య వారితో తప్పకుండా అలానే చూస్తాను అన్నాడు. మీరెవ్వరూ ఈ కలి మాయలో పడరు. మీలో కొందరికిగల పూర్వజన్మ కర్మల వలన సంసార బంధాలలో పడినప్పటికి అవి బాహ్యంగానే ఉంటాయి తప్ప మీ అంతరంగాన్ని ఏమాత్రం అంటవు. మీరు కలిమాయలో పడకుండా ఎప్పుడూ నా యందే మనస్సు ధ్యానించేలా మిమ్మల్ని అనుగ్రహిస్తున్నాను అని వారందరికి అభయమిచ్చాడు. గోపికలందరూ ఇది విని ఎంతో సంతోషించారు.

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు!






అనేక దేవతల అనుగ్రహంతో 32 పుస్తకాలు రచించిన విశ్వపతికి ఈ మధ్య శ్రీకృష్ణదర్శన భాగ్యం కలిగింది. ఆ చిన్ని కన్నయ్య విశ్వపతిని తనతోపాటు ద్వాపరయుగంలోకి తీసుకువెళ్ళి తాను గోకులంలోను, బృందావనంలోను చేసిన కొన్ని అద్భుత లీలలను దర్శింపచేసాడు. ఆ దివ్య లీలలలోని కొన్నింటి సమాహారమే ఈ శ్రీకృష్ణ దర్శనం! పదండి! కన్నయ్యతో మనం కూడా గోకులానికి, బృందావనానికి వెళ్ళి అద్భుత అనుభూతులను అనుభవిద్దాము. ఇంతకుమించిన అద్భుత ఆనందం వేరే ఏముంటుంది?